: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

ఒంగోలు

15-9-2025 సోమవారం సంపుటి: 31

సంచిక: 225 పేజీలు: 12 వెల: 6.50


తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

# ఆసియాకప్‌లో భారత్ జయభేరి

## పాక్‌కు మరో చావుదెబ్బ



సూర్యకుమార్ యాదవ్

### 7 వికెట్ల తేడాతో ఘన విజయం

### 127 పరుగుల లక్ష్యాన్ని అలవోకగా ఛేదించిన భారత్

### భారత్ బౌలర్ల దెబ్బకు పాక్ బ్యాటర్లు చిత్తు

### కెప్టెన్స్ ఇన్నింగ్స్ ఆడిన సూర్యకుమార్ యాదవ్

### ప్లేయర్ ఆఫ్ దిమ్యాచ్‌గా కుల్దీప్ యాదవ్

### స్కోర్లు పాక్: 127/9, భారత్-131/3

**దుబాయి, సెప్టెంబరు 14:** యావత్‌క్రికెట్‌ప్రపంచం మొత్తం ఉత్కంఠభరితంగా ఎదురుచూసిన మ్యాచ్‌లో అందరూఊహించినట్లుగానే భారత్ ఘనవిజయం సాధించింది. ఆదివారం దుబాయి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో పాకిస్తాన్‌తో తలపడిన భారత్‌జట్టు అత్యంత సులువుగా గెలుపు సాధించింది. ఏడు వికెట్ల తేడాతో పాకిస్తాన్ జట్టుపై ఘనవిజయం నమోదుచేసింది. ప్రపంచకప్‌లోనే కాదు ఆసియాకప్‌లో కూడా మాకు తిరుగులేదని భారత్‌జట్టు రుజువుచేసింది. చిరకాల ప్రత్యర్థిని మట్టికరిపించింది. మెగాటోర్నీలో రెండో విజయం సాధించింది. కుల్దీప్‌యాదవ్ విజృంభణతో 127 పరుగులకే ముందు పాకిస్తాన్ పరిమితం అయింది. ఛేదనలో అభిషేక్‌శర్మ 31పరుగులుచేసి మెరుపు ఆరంభం ఇచ్చాడు. ఆతర్వాత సూర్యకుమార్ యాదవ్ 47 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో పాక్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. మూడో వికెట్‌కు తిలక్‌వర్మ 31 పరుగులుచేయగా ఆతడికి జోడీగా 56 పరుగులు జోడించిన సూర్యజట్టు విజయానికి బాటలువేసాడు. చివరిలో శివందూబై తనదైన స్టైల్‌లో ఆడగా సిక్సర్‌తో భారత్‌కు ఏడు వికెట్ల విజయం వరించింది. అభిషేక్‌శర్మ కేవలం 13 బంతుల్లో నాలుగు ఫోర్లు రెండు సిక్స్‌లతో 31పరుగులుచేస్తే శుభ్‌మన్‌గిల్ తక్కువ పరుగులకే ఔట్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన సూర్యకుమార్ తిలక్‌వర్మలే మ్యాచ్‌ను నిలబెట్టారు. తిలక్‌వర్మ 31 శివమ్‌దూబే 10తో కలిసి సూర్యకుమార్ 47 పరుగులుచేసి జట్టు విజయానికి బాటలువేసారు. పాకిస్తాన్ బౌలర్లలో స్పిన్నర్ సెయిమ్ ఆయూబ్ మూడు వికెట్లు తీసాడు. మ్యాచ్‌లో గిల్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన కెప్టెన్ ఎస్కేవై రన్‌ఛేజ్‌కు తగ్గట్లుగా స్కోరు బోర్డును ముందుకు తీసుకెళ్లాడు. గతంలో పాక్‌పై పెద్దగా రాణిం చలేక పోయిన ఈ ప్లేయర్ ఈసారి మాత్రం పట్టుదలతో ఆడాడు. చివరి వరకూ క్రీజులో ఉండి కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను గెలి పించాడు. తిలక్‌వర్మ 31 బంతుల్లో 31 పరుగులుచేసే >>2



లండన్‌లోని వెస్ట్ మినిస్టర్ హాల్‌లో అవార్డ్ అందుకుంటున్న దేవాన్ష్

## 'దేవాన్ష్' ప్రపంచ రికార్డు 2లో

### 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కిన సిఎం చంద్రబాబు మనుమడు

# వృద్ధిరేటు లక్ష్యం 15%

### పౌరసేవలు జవాబుదారీగా ఉండాలి

### ఐదేళ్లలో 125 కేబినెట్ భేటీలు, 25 కలెక్టర్ కాన్ఫరెన్స్‌లు లక్ష్యం

### నేడు, రేపు జిల్లా కలెక్టర్ల సదస్సు

### మంత్రులు, కార్యదర్శులకు సిఎం చంద్రబాబు దిశా నిర్దేశం



**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం అందిస్తున్న పౌరసేవలతో పాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తే ముఖ్యమని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దానికి అనుగుణంగానే మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని సీఎం ఆదేశించారు. ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్న కలెక్టర్ల కాన్ఫరెన్సుపై తన క్యాంపు కార్యాలయంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన గత రాత్రి పొద్దు పోయేంతవరకు సమావేశమయ్యారు. పౌరసేవలు, సంక్షేమ పథకాలపై పబ్లిక్ పర్సెప్షన్‌ను విశ్లేషిస్తున్నామని సీఎం తెలిపారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 10.5 శాతం వృద్ధి రేటుకు చేరుకున్నామని అన్నారు. 2029 నాటికి జీఎస్డీపీ రూ.29 లక్షల కోట్లకు చేరే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. 2034కు తలసరి ఆదాయం రూ.10.55 లక్షలకు చేరేలా కార్యాచరణ చేపట్టాల్సి ఉందన్నారు. ప్రస్తుతం జీఎస్డీపీలో వ్యవసాయం అనుబంధ రంగాలే కీలకంగా ఉన్నాయని అన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, రాష్ట్రస్థాయిలో విభాగాధిపతులు పనిచేయాల్సి ఉందని సీఎం స్పష్టం చేశారు. గత ఏడాది నుంచి ఇప్పటి వరకూ 25 కేబినెట్ సమావేశాలు నిర్వహించామని.. ఐదేళ్లలో 125 కేబినెట్ సమావేశాలతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా అదే సంఖ్యలో రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశాలు నిర్వహణ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. అలాగే ఏడాదిలో ప్రతీ త్రైమాసికానికి ఒకసారి చొప్పున ఐదేళ్లలో 25 జిల్లా కలెక్టర్ సమావేశాలూ నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 3 శాతం వృద్ధి తగ్గిన కారణంగా రాష్ట్రం సుమారుగా రూ.6 లక్షల కోట్ల సంపద కోల్పోయిందని అన్నారు.

**కలెక్టర్ల కాన్ఫరెన్సులో 8 అంశాల వారీగా చర్చ:** ఈసారి జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సును విభిన్నంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పౌరసేవలు, పథకాల అమలుపై జిల్లాల వారీగా జవాబు దారీతనం ఉండేలా ఈ కాన్ఫరెన్సు నిర్వహించ >>2



# గరళ కంఠునిలా విషమైనా మింగేస్తా

### ఈశాన్య ప్రజలు ఆరాధించే వ్యక్తిని అవమానించడమా?

### హజారికాపై కాంగ్రెస్ ఘోరతప్పిదం

### అసోం బహిరంగసభలో ప్రధాని మోడీ

**గువాహతి,సెప్టెంబరు 14:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రముఖ గాయకుడు, భారతరత్న భూపేన్ హజారికాను కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించిందని, ఈశాన్య రాష్ట్రాల ప్రజల మనోభావాలను దెబ్బ తీయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. ఆదివారం అసోంలోని దర్రాంగ్ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. మొత్తంగా రూ.18,500 కోట్ల విలువైనప్రాజెక్టులకు ఆయన భూమిపూజనిర్వహించారు. వీటిలో బయో ఇథనాల్; పోలిప్రొపైలైన్ ప్లాంట్లు కూడా ఉన్నాయి. తర్వాతజరిగిన సభలో మోదీ మాట్లాడుతూ, "భూపేన్ హజారికాకు భారతరత్న ప్రకటించిన రోజు, పాటలు పాడేవారికి, డ్యాన్సులు చేసేవారికా మోదీ భారతరత్న ఇచ్చేది అని నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ఆ మాటలు నన్ను తీవ్రంగా బాధించాయి" అని తెలిపారు. తనను ఎవరైనా దూషించినా తాను శివుడిలా విషాన్నిదిగమింగుతానని, కానీ ఈశాన్య ప్రజలు ఆరాధించే వ్యక్తిని అవమానిస్తే మాత్రం సహించలేనని ఆయన భావోద్వేగంగాఅన్నారు. అంతకుముందు, మంగళ్‌దోయ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. కొత్త మెడికల్ కాలేజీ, ఆసుపత్రి, జీఎన్ఎం స్కూల్, బీఎస్సీ నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

# మహిళా శక్తిలో భారత్ అగ్రగామి



ఆదివారం తిరుపతిలో మహిళా సాధికారత సదస్సును ప్రారంభిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా. చిత్రంలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రఘురామకృష్ణరాజు

### మహిళా సాధికారత ఒక్కరోజులో సాధ్యంకాదు..

### ఆధ్యాత్మిక, సామాజిక ఉద్యమాల్లోనూ మహిళ కీలకపాత్ర

### తిరుపతి జాతీయ సదస్సులో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా

**తిరుపతి,సెప్టెంబరు 14ప్రభాతవార్తప్రతినిధి:** మహిళా శక్తికారణంగానే ఇవాళ ప్రపంచంలోనే భారత్‌ముఖ్యదేశంగా అవతరించిందని లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా అన్నారు. స్వాతంత్ర్యపోరాటంలోనూ మహిళలు కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఆదివాసీ నేపథ్యం నుండి వచ్చిన మహిళ ప్రస్తుతం భారతరాష్ట్రపతిగా ఉన్నా రని ఆయన గుర్తుచేశారు. మహిళా సాధికారత ఒక్కరోజులో సాధ్యం కాదని, అనేక కార్యక్రమాలు చేపడుతూ ఉంటే సాధ్యమవుతుందని తెలిపారు. దేశంలో ఆధ్యాత్మిక సామాజిక ఉద్యమాల్లోనూ స్త్రీలు కీలకపాత్ర పోషించారని చెప్పారు. తిరుపతిలో ఆదివారం మొదలైన రెండురోజుల జాతీయ మహిళా సాధికారత సదస్సులో దేశంలోని అనేక రాష్ట్రాల నుండి పార్లమెంట్,శాసనసభ మహిళా ప్రజాప్రతినిధులతో కలసి తొలిరోజు జ్యోతివెలిగించి సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా లోక్‌సభస్పీకర్ బిర్లా మాట్లాడుతూ సమాజంలో మహిళలకు గౌరవం ఇవ్వడం అనాదికాలంనుండి వస్తున్న భారత సంప్రదాయమన్నారు. మహిళల భాగస్వామ్యంలేకుండా ఏ దేశం అభివృద్ధిచెందలేదని తెలిపారు. వారికోసం రాజ్యాంగం అనేక నిబంధనలు రూపొందించిందని, మహిళా శక్తితోనే భారత్ అగ్రగామిగా నిలుస్తోందన్నారు. భరతభూమిలో మహిళా నాయకత్వం శతాబ్దాలకు ముందే ప్రారంభమైందని ఆయన గుర్తుచేశారు. నేడు అనేక రంగాల్లో మహిళా నాయకత్వం బలోపేతమైందన్నారు. రాజకీయాలు, శాస్త్రసాంకేతిక రంగంతోబాటు చివరకు ఎంతో కీలకమైన సైన్యంలోనూ మహిళలు కీలకపాత్ర పోషిస్తుండటం చూస్తున్నామన్నారు. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ >>2



## 'డబుల్ ఇంజిన్'తో రాష్ట్రం సమగ్రాభివృద్ధి

### జిఎస్టీ సంస్కరణలతో దేశం మరింతముందుకు: జెపినడ్డా

**విశాఖపట్నం, సెప్టెంబరు 14 ప్రభాతవార్త:** బిజెపి పార్టీ అనేది దేశాన్ని అభివృద్ధి పదంలో తీసుకెళ్లేందుకే అని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు . ఆదివారం రైల్వే గ్రౌండ్స్ లో నిర్వహించిన సారథ్యం సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా కనకమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు తోపాటు మహావిష్ణువు సింహాచల కొండపై వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సారథ్యం సభలో విజయవంతంగా నిర్వహించారని 26వ జిల్లాగా విశాఖపట్నంలో ముగింపు సభ నిర్వహిస్తున్నామని ఈ సభకు హాజరు కావడం ఎంతో ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. తెలుగు ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారని ఆయన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్నికల ముందు తాను ఒకసారి తిరుపతి వెళ్లానని అక్కడ తాను వైసిపి పూర్తిగా అవినీతి లో ఊరికిపోయిందని వాటిని నిర్మూలించవలసిన అవసరం ఉందని ప్రజలకు చెప్పానని తెలిపారు. అయితే ఎన్నికలు జరిగింతర్వాత డబల్ ఇంజన్ సర్కార్కు ప్రజలు పట్టం కట్టారని ఆయన అన్నారు. 11 సంవత్సరాల తర్వాత వచ్చిన మార్పులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాకముందు ఏ విధంగా దేశం ముందుకు సాగిందో ఆలోచించేయాలని ప్రతి ఒక్కరిగా అయినా సూచించారు. నరేంద్ర మోడీ పేదవాడి అభివృద్ధి కోసం ఎటువంటి కార్యచరణ చేపడుతున్నారో >>2

## నాలుగు రోజులు వర్ష సూచన

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** అల్పపీడనం,ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు.. కురిసేందుకు అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ ఆదివారం తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉరుములతో కూడిన వర్షాలు పడేటప్పుడు చెట్ల కింద నిలబడరాదని సూచించారు. ఇక సోమవారం అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు >>2



ఆదివారం గంగమ్మకు జలహారతి ఇస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

# పెన్నకు నీరు విడుదల

- సోమశిల జలాశయం నుంచి నదిలోకి నీటిని వదిలిన మంత్రి ఆనం
- 3 జిల్లాలకు నీరు అందించేలా ప్రణాళికలు
- నెల్లూరుకు 150 టిఎంసిల నీటినిల్వ సామర్థ్యం
- టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు

**అనంతసాగరం (నెల్లూరు), సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** చుట్టుప్రక్కల ఉన్న ఐదు జిల్లాల కంటే సోమశిల జలాశయానికి 150 టిఎంసిల నీటిని నిల్వ చేసుకున్న సామర్థ్యం నెల్లూరు జిల్లాకే ఉందని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సోమశిల జలాశయం నుండి 5,6గేట్ల ద్వారా పెన్నానదికి నీటిని విడుదల చేసి గంగమ్మకు జలహారతినిచ్చారు. అనంతరం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయం సామర్థ్యాన్ని >>2

## తిరుపతిలో అత్యాధునిక బస్‌స్టేషన్

### రోజుకు లక్షమంది రాకపోకలు సాగించేలా నిర్మాణం: సిఎం

**విజయవాడ,సెప్టెంబరు 14, ప్రభాతవార్తప్రతినిధి:** రోజురోజుకు పెరుగుతున్న యాత్రికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలో అత్యాధునిక బస్ స్టేషన్ నిర్మించాలని, అన్ని సౌకర్యాలతో ఆకట్టుకునేలా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారులతో సమీక్షను ముఖ్యమంత్రి నిర్వహించారు. నూతనంగా నిర్మించే బస్ స్టేషన్‌లో సుమారు 150 బస్సులు ఒకేసారి నిలిపి ఉంచేలా బస్ బే ఉండాలన్నారు. హెలిపాడ్ సౌకర్యంతో పాటు, రోప్‌వే,కమర్షియల్ కాంప్లెక్స్‌లు, >>2

15-09pg2exHMNWJQE 2nd_15-09pg2exHMNWJQE.qxd 9/15/2025 12:49 AM Page 1



# వృద్ధిరేటు లక్ష్యం15%

>> నున్నట్టు తెలిపారు. సరైన వ్యక్తి, సరైనచోట ఉండాలన్న లక్ష్యంతోనే కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేశామని అన్నారు. తాను 4వ సారి ముఖ్యమంత్రి అయినా ప్రజాప్రయోజనాల కోసం నిరంతరం ఏదో ఒక కొత్త అంశాన్ని నేర్చుకుంటూనే ఉంటానని సీఎం అన్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా మెరుగైన పాలన అందించే అంశంపై అధ్యయనం చేస్తూ ఉండాలని సూచించారు. రెండు రోజుల పాటు జరిగే కలెక్టర్ల సదస్సులో మొదటి రోజున జీఎస్డీపీ అంశంపై ప్రజెంటేషన్ లో భాగంగా సేవలు, పరిశ్రమలు, వ్యవసాయం, పర్యాటకం తదితర రంగాల పురోగతిపై సమీక్షిస్తామని తెలిపారు. జిల్లాలు ఈ రంగాల్లో ఎక్కడ ఉన్నాయన్న దానిపై కలెక్టర్ల నుంచి వివరాలు తెలుసుకుంటామన్నారు. ఇక రెండో అంశంగా సంక్షేమం, సూపర్ సిక్స్, అన్నా క్యాంటీన్లు, పీ4 తదితర అంశా లను సమీక్షించనున్నట్టు తెలిపారు. మూడో అంశంగా లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల గురించిన ప్రజెంటేషన్ ఉంటుందని తెలిపారు. నాలుగో అంశంగా స్వచ్ఛాంధ్ర, సర్క్యులర్ ఎకానమీ, పంచాయితీరాజ్, మున్సిపల్ తదితర అంశాలపై జిల్లాల వారీగా పురోగతి తెలుసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. ఇక రెండో రోజున ఐదో అంశంగా మానవ వనరుల అభివృద్ధి, వైద్యారోగ్యం, విద్య, స్కిల్ డెవలప్మెంట్, ఆరో అంశంగా ఐటీ, క్వాంటం వ్యాలీ, ఆర్టీజీహెచ్, వాట్సప్‌లో పౌరసేవలు, డేటా లేక్, ఏఐ తదితర అంశాలను చర్చిస్తామని వివరించారు. ఏడో కేటగిరీలో రెవెన్యూ విభాగంలో భూములు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, మైనింగ్, ట్రాన్స్‌పోర్ట్ లాంటి అంశాలపై జిల్లాల వారీగా వివరాలు తెలుసుకుంటామని స్పష్టం చేశారు. ఇక రెండో రోజు 8వ అంశంగా రాష్ట్రంలో శాంతిభద్రతలపై ఎస్పీలు, జిల్లా కలెక్టర్లతో సమీక్షిస్తామని తెలిపారు. ప్రభుత్వ విభాగాలు అందించే పౌరసేవలపై ప్రజల్లో సంతృప్త స్థాయిపైనా చర్చిస్తామని తెలిపారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ విజన్ ను పటిష్టంగా అమలు చేయాలని సీఎం పేర్కొన్నారు.

**నెక్స్ జెన్ సంస్కరణలపై కమిటీ:** ఆర్టీజీఎస్ ద్వారా నేపాల్‌లో చిక్కుకు పోయిన తెలుగు వారిని వెనక్కు తీసుకువచ్చే ఆపరేషన్ విజయవంతమైందని సీఎం వ్యాఖ్యానించారు. మంత్రి నారా లోకేష్ సహా అధికారులు కృషి చేశారని, దీనిపై ప్రజల్లో ప్రభుత్వం పట్ల మంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. వివిధ సంక్షోభ సమయాల్లో సరిగ్గా స్పందిస్తేనే ప్రజల్లో విశ్వాసం, నమ్మకం పెరుగుతాయని సీఎం అన్నారు. అమరావతిలోని సీఆర్డీఏ భవనంలో మానవ వనరుల నైపుణ్యాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రం ఇటీవల జీఎస్టీని రెండు స్లాబులకు కుదిస్తూ తెచ్చిన సంస్కరణ విజయవంతమైందని.. ఏపీలోనూ నాలా పన్ను రద్దు చేసి నెక్స్ జెన్ సంస్కరణను అమలు చేశామని సీఎం అన్నారు. దీనిపై మరింత అధ్యయనం చేసేందుకు మంత్రులు, అధికారులతో కమిటీ వేయాలని సీఎం సూచించారు. మరోవైపు చిన్న చిన్న కోర్టు వివాదాల కారణంగా ప్రభుత్వ సమయంతో పాటు ధనమూ వృధా అవుతోందని, ఆర్బిట్రేషన్ ద్వారా కొన్ని అంశాలను పరిష్కరించుకునే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఈ సమావేశానికి మంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు.

**తెలుగు సంస్కృతి, చరిత్ర, సాహిత్యం, కళలు ఉట్టిపడేలా ఎన్టీఆర్ స్మృతివనం:** తెలుగువారి ఆత్మగౌరవం ఆత్మవిశ్వాసం కలగలిపి తెలుగు వైభవంగా అమరావతిలో నిర్మించే ఎన్టీఆర్ స్మృతివనం ప్రాజెక్టును చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, భాష, సాహిత్యం, కళలు, ప్రాచీన చరిత్ర తదితర అంశాలకు పెద్దపీట వేస్తూ దీనిని చేపట్టాలని సూచించారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుపై సీఎం సమీక్షించారు. అమరావతిలోని నీరుకొండ వద్ద చేపట్టనున్న ఈ ప్రాజెక్టులోని అంశాలను అధికారులు సీఎంకు వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రాచీన తెలుగు చరిత్రతో పాటు ప్రజల మనస్సుల్లో నిలిచిపోయిన అల్లూరి, పొట్టిశ్రీరాములు లాంటి విశిష్ట వ్యక్తుల విగ్రహాలు, సంస్కృతీ సంప్రదాయాలు, భాష, లిపికి చెందిన వివరాలను కూడా తెలియచెప్పేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలుగు ప్రజల ప్రతీకగా ప్రజా రాజధాని అమరావతిని కూడా ప్రతిబింబించేలా ప్రాజెక్టు చేపట్టాలన్నారు. 182 మీటర్ల ఎత్తైన ఎన్టీఆర్ విగ్రహ స్మృతి వనం ప్రాజెక్టుకు అనుబంధంగా నీరుకొండ రిజర్వాయర్ ను తీర్చిదిద్దాలన్నారు. ప్రత్యేకించి పర్యాటకులు పెద్ద ఎత్తున సందర్శించేందుకు అనువుగా ఆకర్షణల్ని ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గుజరాత్ లో నిర్మించిన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాజెక్టును కూడా పరిశీలించాలని సీఎం పేర్కొన్నారు. అమరావతిని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై చేపట్టనున్న ఐకానిక్ వంతెన డిజైన్లను కూడా సీఎం పరిశీలించారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అంతకముందు ఎన్టీఆర్ విగ్రహ నమూనాలను పరిశీలించారు.

# మహిళా శక్తిలో భారత్ అగ్రగామి

>> కల్పించేందుకు చట్టం తీసుకువచ్చామన్నారు. అభివృద్ధి చెందిన దేశాలలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారన్నారు. మహిళలకు గౌరవం ఇవ్వడం భారతదేశంలో సంప్రదాయమని బిర్లా ఉద్ఘాటించారు.

**మహిళా సాధికారతకు ఎన్టీఆర్ ఎంతో కృషి: :రాజ్యసభడిప్యూటీ చైర్మన్ హరివంశ్‌సింగ్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత మాజీ సీఎం



మహిళా సాధికార సదస్సులో పాల్గొన్న వారికి జ్ఞాపికలను అందజేస్తున్న దృశ్యం

ఎన్టీరామారావు మహిళా సాధికారతకు ఎంతో కృషి చేశారని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌సింగ్ తెలిపారు. తిరుపతిలో జాతీయ మహిళా సాధికారత సదస్సుప్రారంభంలో ఆయన ఎన్టీఆర్‌ను గుర్తుచేసుకుని ప్రణామాలు తెలిపారు. మహిళల సాధి కారత కోసం ప్రధాని నరేంద్రమోదీ అనేక కార్యక్రమాలు చేపట్టారని వెల్లడించారు. బీహార్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం మహి ళలకు రిజర్వేషన్లు, జన్‌ధన్ యోజనలో సగానికిపైగా ఖాతాలు మహిళలవేనని చెప్పారు. ప్రధాని మోదీ, ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు చేపడుతున్న మహిళల అభివృద్ధి,సంక్షేమంకు ప్రశంసలు కురిపించారు. తిరుపతి జిల్లా సత్యవేడు శ్రీసిటీలో చంద్రబాబు నాయుడు చొరవతోనే సగానికిపైగా మహిళలు ఉద్యోగాలు చేస్తుండటం అభినందనీయమన్నారు. దేశంలోనే తొలిసారిగా నైపుణ్యగణనను ఏపిలో చేపట్టారని సింగ్ తెలిపారు.

**మహిళా భాగస్వామ్యంతోనే 'వికసిత్‌భారత్':ఎంపి పురందేశ్వరి**

మహిళల భాగస్వామ్యంతోనే వికసిత్ భారత్ సాకారమవుతుందని బిజెపి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. మహిళా సాధికారత కోసం కేంద్రం ఎన్నో పథకాలు అమలుచేస్తోందన్నారు. 'భేటీ బచావో బేటీ పడావో',మహిళా సమ్మాన్‌నిధి వంటి అనేక పథకాలు మహిళల అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ఆర్థిక సమానత్వం కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని ఆమెతెలిపారు. ఇంకా ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్, శాసనసభ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు,డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణమరాజు,ఆంధ్రప్రదేశ్ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్,దేశంలోని కేంద్రపాలి తప్రాంతాలు, వివిధ రాష్ట్రాలమహిళా మంత్రులు,ఎంపిలు, ఎమ్మెల్యేలు ,



మహిళా సాధికారత సదస్సుకు విచ్చేసిన ఏపి,తెలంగాణ మహిళా ప్రజాప్రతినిధులు

ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆసియాకప్‌లో భారత్ జయభేరి

>> శివమ్ దూబే ఏడు బబంతుల్లో పది పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. దీనితో 15.5 ఓవర్లలోనే భారత్‌మూడు వికెట్ల నష్టానికి 131 పరుగులుచేసి లక్ష్యాన్ని అధిగమించి విజయం సాధించింది. టాస్‌గెలిచి తొలుత బ్యాటింగ్‌చేసిన పాకిస్థాన్‌ను తొమ్మిది వికెట్ల నష్టానికి 127 పరుగులకే పరిమితంచేసారు. కుల్‌దీప్‌యాదవ్ 18 పరుగులిచ్చి మూడు వికెట్లు తీస్తే అక్షర్‌పటేల్ 18 పరుగులిచ్చి రెండు వికెట్లుతీసాడు. అలాగే జస్‌ప్రీత్‌బుమ్రా 28 పరుగులకు రెండు వికెట్లు తీసి పాక్ బ్యాటర్లను ఆడుకున్నారు.భారత బౌలర్ల దెబ్బకు పాకిస్థాన్ బ్యాటర్లు వణికిపోయారు. తొలి ఓవర్ మొదటి బంతికే సైమ్ అయూబ్ వికెట్ ను హార్థిక్ పాండ్య పడేసాడు. తర్వాత ఓవర్‌లో బుమ్రా మహ్మద్ హ్యారిస్‌ను ఔట్‌చేసాడు. తర్వాత స్పిన్నర్లు కుల్దీప్‌యాదవ్ అక్షర్‌పటేల్‌లు కలిపి ఐదు వికెట్లు తీయడంతో పాక్ కోలుకోలేకపోయింది. ఒకదశలో 64 పరుగులకే ఆరువికెట్లు నష్టపోయిన పాక్ చివరిలో షాహీన్ అఫ్రిది 16 బంతుల్లో 33పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు.

వేగంగా ఆడటంతో దాయాది జట్టు తొమ్మిది వికెట్ల నష్టానికి కేవలం 127 పరుగులతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. పాక్‌పై గెలిచిన భారత్ జట్టు ఆసియాకప్ సూపర్-4లోకి ప్రవేశించింది.కుల్దీప్‌యాదవ్ కేవలం 18 పరుగులే ఇచ్చి 3 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్‌గా నిలిచాడు.







# 'దేవాన్ష్' ప్రపంచ రికార్డు

## లండన్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్న మంత్రి లోకేష్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మనవడు నారా దేవాన్ష్ అందుకున్నారు. విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తనయుడు, పదేళ్ల యువ చెస్ ప్రాడిజీ నారా దేవాన్ష్ చదరంగంలో అత్యంత క్లిష్టమైన 175 పజిల్స్ ను వేగంగా పరిష్కరించారు. తద్వారా ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్ గా ప్రపంచ రికార్డ్ సాధించినందుకు గాను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డ్స్ 2025 అందుకున్నాడు. లండన్ లోని వెస్ట్ మినిస్టర్ హాల్ లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొని 'ఫాస్టెస్ట్ చెక్ మేట్ సాల్వర్175 పజిల్స్' అవార్డ్ అందుకున్నాడు. ఈ కార్యక్రమానికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. ఈ ఘనతను సాధించేందుకు నారా దేవాన్ష్ గతేడాది చెక్ మేట్ మారథాన్‌లో లాస్లో పోల్గార్ ప్రసిద్ధ చెస్ సంకలనం 5334 ప్రాబ్లమ్స్ అండ్ గేమ్స్ పుస్తకం నుంచి తీసుకున్న 175 సంక్లిష్టమైన చెక్ మేట్ పజిల్స్ ను వేగవంతంగా పరిష్కరించాడు. ఈ పజిల్స్ ఒకటి తర్వాత ఒకటి కష్టంగా మారుతూ వేగం, కచ్చితత్వం, ఆలోచనా నైపుణ్యాలను పరీక్షిస్తుంది. దేవాన్ష్ వీటన్నిటినీ అత్యంత తక్కువ సమయంలో పరిష్కరించడం ద్వారా రికార్డు సృష్టించారు. ప్రపంచ చెస్ రంగంలో అత్యుత్తమ యువ ప్రతిభావంతుల్లో ఒకరుగా దేవాన్ష్ కు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం లభించింది. ఈ విజయానికి దేవాన్ష్ అకుంఠిత శ్రమతో పాటు, తల్లి నారా బ్రాహ్మణి, తండ్రి నారా లోకేష్, కోచ్ కే. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహం అందించారు. ఈ విజయం గురించి మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ "ఈ రోజు వెస్ట్‌మినిస్టర్ హాల్‌లో దేవాన్ష్ ఈ గౌరవాన్ని అందుకోవడం ప్రత్యేకమైంది. అతని ముందుచూపు, ఆలోచనాశక్తి, ఒత్తిడిలో ప్రదర్శించిన సమయస్ఫూర్తి, చిన్న వయస్సులోనే పూర్తిగా ఆటకు అంకితం కావడం వంటి విభిన్న శైలి వల్ల ఈ విజయం సాధ్యమైంది. తండ్రిగా దేవాన్ష్ అవిశ్రాంత శ్రమని నేను దగ్గరగా చూశాను. ఈ గుర్తింపు అతని కృషికి నిజమైన బహుమతి. మేమంతా అతను సాధించిన ఈ ఘనతకు ఎంతో గర్వపడుతున్నాం అని అన్నారు. దీంతోపాటు దేవాన్ష్ మరో రెండు ప్రపంచ రికార్డులను కూడా గతంలో సొంతం చేసుకున్నాడు. 7డిస్క్ టవర్ ఆఫ్ హనోయ్‌ను కేవలం 1 నిమిషం 43 సెకన్లలో పూర్తి చేయడం, 9 చెస్ బోర్డ్స్ పై 32 పావులను సరైన పద్ధతి ద్వారా 5 నిమిషాల్లో అమర్చడంలో ప్రపంచ రికార్డులు సాధించాడు. ఈ రోజు లండన్‌లో జరిగిన అవార్డ్స్ కార్యక్రమంలో ఆయనకు లభించిన గుర్తింపు ఆయన కుటుంబానికి, అలాగే ప్రపంచ చెస్ రంగంలో భారత్ తరపున పెరుగుతున్న ఖ్యాతికి గర్వకారణంగా నిలిచింది.

**సంతోషంగా ఉంది : సిఎం చంద్రబాబు:** దేవాన్ష్ ప్రపంచ రికార్డు సాధించడంపై సీఎం చంద్రబాబు సంతోషంగా ఉందన్నారు., "మా దేవాన్ష్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు 2025 అందుకోవడం గర్వంగా ఉంది" అని తెలిపారు. నెలల తరబడి చూపిన పట్టుదల, గురువుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయంసాధ్యమైందని చంద్రబాబు పేర్కొన్నారు. దేవాన్ష్ సాధించిన ఈ రికార్డు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన దేవాన్ష్‌ను శభాష్ ఛాంప్‌అంటూ ప్రశంసించారు. అంతర్జాతీయ వేదికపై దేవాన్ష్ ప్రతిభకు గుర్తింపు లభించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



5,6గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

# పెన్నకు నీరు విడుదల

>> తొలుత అనుకున్న దానికన్నా 77 టిఎంసిల సామర్థ్యం వరకు పెంచినప్పటికీ కొన్ని పరిస్థితుల దృష్ట్యా 74 టిఎంసిల వరకు నీటిని నిలువ చేయడం జరుగుతుందన్నారు. కృష్ణానది నుండి శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ ఏర్పాటు చేయడం వలన రాయలసీమ, నెల్లూరుకి నీటి నిల్వకు అవకాశం ఏర్పడిందన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నంధ్యాల జిల్లా లో పర్యటించినప్పుడు కుందునది ప్రవాహం అధికంగా ఉందని అక్కడి నుండి నీరు పెన్నా నదికి చేరుకోవడం జరుగుతుందని గమనించామన్నారు. సోమశిల జలాశయం శంఖుస్థాపన నుండి ఎన్నో సందర్భాల్లోచేయడం జరిగిందని మంత్రి పేర్కొన్నారన్నారు. ఆదివారం నుండి 20 టిఎంసిల నీటిని విడుదల చేశామని అందులో కండలేరు జలాశయానికి, తెలుగు గంగ, కనుపూరు, కలువాయి కాలువలకు నీటిని విడుదల చేయడానికి తీసుకోవడం జరిగిందన్నారు. కండలేరు సామర్థ్యంమేరకు నీరు చేరుతుందన్నారు. ఫ్లడ్‌ఫ్లో 24 వేల క్యూసెక్కులు పెంచడానికి టైం పడుతుందన్నారు. టెంపుల్ టూరిజం పార్కుల ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రూపొందిస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ సిబ్బంది ఎప్పటికప్పుడు అవసరమైన రక్షణచర్యలు తీసుకోవాలని సూచించారు. లక్ష క్యూసెక్కుల పైన నీరు దాని ప్రభావం ఉంటుందన్నారు. ఆనం సంజీవరెడ్డి తెనాలి ద్వారా కరువు పీడిత మండలాలైన మర్రిపాడు, వింజమూరు, దుత్తలూరుకు నీటిని అందజేసి పనులు ప్రారంభించినట్లు మంత్రి ఆనం తెలిపారు. హైపవర్ కెనాల్ ద్వారా 60 నుంచి 70 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తుందని అందులో భాగంగా దీపం2కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు ఇవ్వడం, స్త్రీశక్తి, తల్లికి వందనం, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటివి ఉన్నాయన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతులకు మంచి జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

**మంత్రి ఆనంకు స్వాగతం పలికిన కేశవచౌదరి :** రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం సోమశిలలో పర్యటించారు. తొలుత సోమశిల జలాశయం నుంచి దిగువకు నీటిని విడుదల చేసే సందర్భంగా సోమశిల ప్రాజెక్ట్ చైర్మెన్ వేలూరు కేశవచౌదరి మంత్రి ఆనంకు ఘనస్వాగతం పలికారు. అనంతరం శాలువాలతో సన్మానించి బొకే అందజేశారు.

# 'డబుల్ ఇంజిన్'తో రాష్ట్రం సమగ్రాభివృద్ధి

>> సబ్కా సత్ సబ్కా వికాస్ సైతాంతిక సిద్ధాంతంతో ముందుకు సాగుతున్నారు అన్నారు. కాశ్మీర్ రాష్ట్రానికి న్యాయం చేస్తామని చెప్పినట్లు చేశామని జనజీవన స్రవంతిలో భాగస్వామ్యం చేశామని చెప్పారు. రామజన్మభూమి లో రాముని ఆలయం నిర్మించామని ముస్లిం సమాజానికి ముస్లిం మహిళలకు కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నామని పార్లమెంట్లో సవరణ తీసుకు వస్తున్నామని ఆయన తెలిపారు. బిజెపి అనేది కార్యకర్తల పార్టీ అని ప్రపంచంలో అత్యధిక రాజకీయ పార్టీగా బిజెపి ఉందని ఆయన చెప్పారు. 2024లో నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించిన నాటికి ఆర్థిక పరిస్థితి నత్త నడక నడిచేదని ఆయన తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల వల్ల ఇప్పుడు మొదటి స్థానంలో ఉందని ఇది గర్వంగా చెప్పుకుంటున్నామన్నారు. రాబోయే తరానికి జీఎస్టీ 2.0 నీ తీసుకొని సంస్కరణలో తీసుకువచ్చామని దేశంలో సెప్టెంబర్‌లో దసరా దీపావళి ఒకే నెలలో వచ్చినట్టు ఉంటుందని అన్నారు. ఆరోగ్య బీమాకు జీఎస్టీ పూర్తిగా తీసివేస్తున్నామని దేశం ఆరోగ్య దేశంగా ఉండాలని మోడీ ప్రధాన ఉద్దేశం అని చెప్పారు. రక్షణ రంగంలో ఏడు రెట్లు ప్రగతి సాధించామని మందులు తయారీ అభివృద్ధిలో కూడా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. అమృత్ భారత్ గా వందే భారత్ పేరుతో రైలు, విమానాశ్రయాలు అభివృద్ధి చేస్తున్నామని, భోగాపురం నిర్మాణం జరుగుతుందని ఆయన తెలిపారు. 17 మెడికల్ కళాశాలలు కట్టిస్తున్నామని అమరావతి రాజధాని కట్టేందుకు సహకరిస్తున్నామని అని చెప్పారు. ముఖ్యంగా దక్షిణ కోస్తా ప్రాంతంలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తిగా సహకరిస్తుందన్నారు. పాలన ఏ విధంగా ఉందో ప్రజల్లోకి తీసుకువెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని చెప్పారు. 15 నెల ముందు ఆంధ్రప్రదేశ్ పూర్తి అంధకారంలోకి వెళ్లిపోయిందని ఇప్పుడు ఆంధ్రాని చంద్రబాబు నాయుడు వెలుగులోకి తీసుకు వస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసరాజు, రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, కృష్ణయ్య, సత్యనారాయణ, పరశురామరాజు, శివ ప్రకాష్ రెడ్డి, ఆడారి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు కేంద్రం పెద్దపీట: మంత్రి అనిత

**తిరుపతిరూరల్,సెప్టెంబర్14 ప్రభాతవార్త:** మహిళల భద్రత కోసం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని రాష్ట్ర హోమ్‌శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తొలి జాతీయ మహిళా సాధికార సదస్సుకు విచ్చేసిన మంత్రి మీడియాతో మాట్లాడారు. తల్లిని చెల్లిని ఏవిధంగా గౌరవిస్తారో అలానే ఇతర మహిళలను కూడా గౌరవించాలన్నారు. మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుఅడుగు వేస్తే, అనుకున్న సాధించవచ్చునని తెలిపారు. వ్యక్తిత్వ హననం వల్ల మహిళలు ఆత్మస్థైర్యం కోల్పోతున్నారన్నారు. మహిళల శక్తిని దిగజార్చితే దేశమనుగడే ప్రశ్నార్థకంగామారుతుందన్నారు. రాష్ట్రంలో మహిళల సంరక్షణకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేష్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళను మహిళాగానే చూడాలి తప్ప...ఆట వస్తువుగా చూడరాదన్నారు.మహిళలు భయం, ఆందోళనలు మన స్సులోంచి తీసివేయాలన్నారు.

# ఆర్‌డిటి లైసెన్సులు పునరుద్ధరించాలి

## ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు

**విజయవాడ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** ఆర్‌డిటి లైసెన్సులు పునరుద్దరించాలని ఏపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు డిమాండ్ చేశారు. పలు దశాబ్దాలుగా గ్రామీణ ప్రజల అభివృద్ధికి, బలహీన వర్గాల సుస్థిర జీవితానికి ఆశాజ్యోతి వలే నిలిచిన ఆర్‌డిపై ఇటీవల కుట్రలు జరుగుతున్నాయని, ఎఫ్‌ఆర్‌సిఎ లైసెన్సు రద్దు, నకిలీ ఆరోపణలు, మతమార్పిడి పేరిట వ్యాపిస్తున్న తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలపై ప్రజలకున్న అసంతృప్తిని సేవా సంస్థలపైకి మళ్లించడం, అంతర్జాతీయ నిధులపై నియంత్రణ పెంచే ప్రయత్నం జరుగుతున్నాయని వాటిని వెంటనే నిలువరించాలని లేకుంటే ప్రజా ఉద్యమంగా ఎదిరిస్తామన్నారు.

## వారం - వర్జ్యం

15-09-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
నవమి రా.1.33
మృగశిర ఉ.7.32
వర్జ్యం : మ.3.40-5.13
దు.మ.12.29-1.18,
2) మ.2.55-3.44
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊపిరి పీల్చుకుంటారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**వృషభం:** అప్పులు ఇవ్వడం, అప్పులు తీసుకోవడం రెండు లాభించవు. ప్రయాణాలు.

**మిథునం:** పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడుతుంది. సోదరుల కలయిక.

**కర్కాటకం:** ముఖ్యమైన పత్రాలపై సంతకాలు చేయునప్పుడు బాగా పరిశీలించి సంతకాలు చేయటం మంచిది.

**సింహం:** మీ మౌనము మీ సహనము మీరు మేలు చేస్తాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కన్య :** శారీరకంగా, మానసికంగా అలసట, పని భారము అధికమవుతాయి. వస్త్ర లాభం.

**తుల :** స్థిరత్వము, ధైర్యము వలన చాలా ఫలితములు అనుకూల దిశలో పయనిస్తాయి.

**వృశ్చికం:** నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**ధనుస్సు:** వ్యవహారాలలో సన్నిహితుల సహాయం అందుతుంది. ఉద్యోగయత్నాలు ఫలిస్తాయి.

**మకరం:** విదేశీ పర్యటన అవకాశాలు ఉంటాయి. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్త వహించండి.

**కుంభం:** గృహ సంబంధమైన ఖర్చులను తగ్గించే యత్నమును, అదాయమునకు అదనపు మార్గములను అన్వేషిస్తారు.

**మీనం :** కొద్దిపాటి స్పర్థలు, చర్చలు వంటివి ఇబ్బందిని కలిగించినా, ముఖ్యమైన కార్యక్రమాలను పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అత్యాధునిక బస్‌స్టేషన్

>> మాల్స్, మల్టీ ప్లెక్స్‌లతో డిజైన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. రెండు బస్ ఎంట్రీలు, ఎగ్జిట్ వేలు 2 ఏర్పాటు చేయాలని, సోలార్ రూఫ్ టాప్‌తో సొంత విద్యుత్ అవసరాలు తీర్చుకునేలా చూడాలన్నారు. మొత్తం 13 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించ తలపెట్టిన ఈ బస్ స్టేషన్ కనీసం లక్ష మంది నిత్యం రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మాణం చేయాలన్నారు. భవిష్యత్‌లో అన్నీ ఎలక్ట్రికల్ బస్సులే నడపనున్న నేపథ్యంలో ప్రతీ బస్సుకు చార్జింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికి సంబంధించి మొత్తం 5 మోడల్స్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. వాటిని మరింత అభివృద్ధి చేయాలన్నారు. దీనికోసం స్టేక్ హోల్డర్లతో సమావేశం నిర్వహించాలన్నారు. అలాగే రాష్ట్రంలో అన్ని బస్ స్టేషన్లు ఆధునీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం సూచనలు చేశారు. తిరుపతితో పాటు కీలక నగరాల్లో బస్ స్టేషన్లు అభివృద్ధి చేయాలన్నారు,ఆయా నగరాల్లో అవసరత బట్టి ప్రాంతీయంగాను బస్‌బేలు పెరగాలన్నారు.దీని వలన కీలక ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో ఉండటమే కాకుండా, ప్రధాన స్టేషన్‌పై వత్తిడి తగ్గుతుందన్నారు.జాతీయరహదారులకు అందుబాటులో బస్‌స్టేషన్లు ఉండాలన్నారు.

# నాలుగు రోజులు వర్ష సూచన

>> కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.ఆదివారం సాయంత్రం 5 గంటల నాటికి గుంటూరులో 81మిమీ,పల్నాడు జిల్లా తుర్లపాడులో 54.5మిమీ, పెద్దకూరపాడులో 40.2మిమీ, గుంటూరు జిల్లా వంగిపురంలో 39.5మిమీ, కోనసీమ జిల్లా ముక్కములలో 39మిమీ చొప్పున వర్షపాతం నమోదైందన్నారు.గుంటూరు కురిసిన భారీ వర్షం నగరాన్ని అతాకుతలం చేసింది.కీలక రహదారులన్ని కాల్వలుగా మారాయి. జాతీయరహదారిపై వర్షపు నీరు ప్రవహించింది.



విజయవాడ బస్‌స్టేషన్‌లో మంచినీటి పాయింటును పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

## ప్రయాణికుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పించాలి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతి నిధి:** ప్రయాణికుల భద్రత, బస్టాండు పరిశుభ్రతలో రాజీపడే ప్రసక్తే లేదని.. ఆహార పదార్థాల విక్రయశాలలు కచ్చితంగా ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాల్సిందేనని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ స్పష్టం చేసారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం కలెక్టర్ విజయవాడ పండిట్ నెహ్రూ బస్టేషను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్లాట్‌ఫాంలతో పాటు ఆహార విక్రయ దుకాణాలు,హోటళ్ళు మంచినీటి పాయింట్లు, మరుగుదొడ్ల పరిస రాలను పరిశీలించారు. ఏ సమయంలోనైనా అపరిశుభ్రత అనే మాట వినిపించకూడదని.. ప్రయాణికుల ఆహార భద్రతకు భరోసా కల్పించేలా పరిశుభ్రతా చర్యలు తీసుకోవా లన్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పక్కా ప్రణాళికలతో నిరంతర పర్యవేక్షణతో ప్రయాణి కులు సంతృప్తి చెందేలా సౌకర్యాలతో సేవలం దించాలన్నారు. ప్రాంగణంలోని దుకాణాలు, స్టాళ్లు తప్పనిసరిగా ధరల పట్టికలను ప్రదర్శిం చాలని ఆదేశించారు. ప్రయాణికులకు చాలా సులభంగా అర్థమయ్యేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాత డస్ట్ బిన్ల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయాలని.. ఈగలు, దోమలు లేకుండా యాంటీ లార్వాల్ చర్యలు, పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి అని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.

## ఎపి ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి జెఎండిగా పృథ్వీతేజ్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ట్రాన్స్‌కో ఇన్‌ఛార్జి జెఎమ్‌డిగా పృథ్వీతేజ్‌ను ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ 86ను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ శుక్రవారం విడుదల చేశారు. ట్రాన్స్‌కో జెఎమ్‌డిగా ఉన్న కీర్తిని తూర్పుగోదావరి జిల్లా కలెక్టరుగా నియ మించారు. ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డిగా ఉన్న పృథ్వీతేజ్‌కు ట్రాన్స్‌కో జెఎమ్‌డికి ఎపి పవర్ కో ఆర్డినేషన్ కమిటీ మెంబర్ కన్వీనర్‌గా ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది.

# రాజంపేట టు పుంగనూరు ఎర్రచందనం స్మగ్లింగ్

## 20 దుంగలు స్వాధీనం: ఒకరి అరెస్టు



**ప్రభాతవార్త ప్రతినిధి, పుంగనూరు సెప్టెంబర్ 14** తమిళనాడు రాష్ట్రంలోని క్రిష్ణగిరి సెంట్రల్ జైలు లో కలిసిన నలుగురు నేరస్తులు ముఠాగా ఏర్పడి ఎర్రచందనం స్మగ్లింగ్ చేసి చివరకు పుంగనూరులో పట్టుబడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. క్రిష్ణగిరి చెందిన మణివన్, తిరువన్నామలై కి చెందిన రవి, కర్ణాటక హుస్కోట కు చెందిన సయ్యద్ ఆరిఫ్, తమిళనాడు హోసూరు కు చెందిన సర్దార్ అనే నిందితులు కృష్ణగిరి జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో స్నేహితులయ్యారు. శిక్ష ముగిసిన తర్వాత విడుదలైన ఈ నలుగురు ఎర్రచందనం స్మగ్లింగ్ కు పథకం రచించారు. అనుకున్నది తడవుగా కడప జిల్లా రాజంపేట అడవుల నుంచి 20 ఎర్రచందనం దుంగలను సేకరించారు. శనివారం వీటిని రవాణా చేసేందుకు ఒక ఇన్నోవా వాహనాన్ని ఏర్పాటు చేసుకుని, దుంగలను అందులో తరలించారు. అర్ధరాత్రి వేళ అక్రమ మార్గాల గుండా వాహనం ప్రయాణిస్తున్న తీరును పోలీసు నిఘా వర్గాలు గమనించాయి. పలమనేరు డి.ఎస్.పి ప్రభాకర్ ఆదేశాల మేరకు పుంగనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు, ఎస్సై హరి ప్రసాద్ సిబ్బంది కలసి ఈ వాహనాన్ని పుంగనూరు సుగాలి మిట్ట మార్గంలోని నేతిగుట్లపల్లి వద్ద అడ్డగించారు. అప్పటికే వాహనం ముందర రెండు ద్విచక్ర వాహనాల్లో మార్గం చూపుతూ ప్రయాణిస్తున్న ఇద్దరు నిందితులు పరారయ్యారు. కారులో ప్రయాణిస్తున్న మరో నిందితుడు కూడా పరారు కాగా వాహనంతో పాటు సర్దార్ అనే నిందితులు పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనిని విచారించగా తక్కిన ముగ్గురు నిందితుల వివరాలు తెలిసాయి. మొత్తం 20 ఎర్రచందనం దుంగలను, మీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎర్రచందనం విలువ 34 లక్షల రూపాయలుగా నిర్ధారించారు. తక్కిన ముగ్గురు నేరస్తులను కూడా అదుపులో తీసుకున్నందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డిఎస్పి ప్రభాకర్ తెలిపారు. రాజంపేట అడవుల నుంచి పుంగనూరు అడవుల వరకు పల్లె దారులలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ గతంలో పలు వాహనాలు పట్టుబడ్డాయి. పుంగనూరు అడవులను అడ్డుగా పెట్టుకుని ఎర్రచందనం రాత్రికి రాత్రే చెన్నై హార్బర్ చేర్చేందుకు సినీ ఫక్కీలో నేరస్తులు చేస్తున్న విశ్వ ప్రయత్నాలను పోలీసులు భగ్నం చేస్తున్నారు.

## నాలుగో ఆర్థిక సంఘం అమలు పొడిగింపు

**విజయవాడ, సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** నాలుగవ ఆర్థిక సంఘం అమలు గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. కొద్ది రోజుల క్రితమే ఐదో ఆ ర్థిక సంఘం తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించారు, ఎప్పుడో కాలపరిమితి దాటిపోయిన నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు కాలాన్ని మరికొంత కాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. నాలుగో ఆర్థిక సంఘం కాలంలో చేయాల్సిన అనేక కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడంతో దానిని వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు పొడిగిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2018 లోనే నాలుగ ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మూడేళ్ల పాటు కొనసాగే ఈ ఆర్థిక సంఘం ఇచ్చే నివేదికలను 2021 నుంచి 2024 మధ్య కాలంలో అమలు చేయాలని కూడా నిర్ణయించారు. ఇదే సమయంలో నాలుగో ఆర్థిక సంఘం కాలపరిమితి ముగిసిపోయిన రెండేళ్ల వరకు కొత్త ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడంతో కొంతమంది న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, 2023 లో ఐదో ఆర్థిక సంఘాన్ని ఏర్పాటుచేశారు. అయితే ఇప్పటికీ నాలుగో ఆర్థిక సంఘం నివేదిక మాత్రం పూర్తిగా అమలు కాకపోవడం గమనార్హం. ప్రధానంగా స్థానిక సంస్థల అభివృద్ధికి చేయాల్సిన కార్యక్రమాలు ఆగిపోయాయన్న విమర్శలు కూడా ఉన న్నాయి. 2024లోనే ఈ నివేదిక అమలు పూర్తికావాల్సి ఉందని, అయితే అనేక కారణాలతో ప్రగతి కనిపించ లేదని అధికారులు చెబుతున్నారు. అందుకే ఈ అమలు కాలాన్ని మరికొంత కాలం పొడిగించాల్సి వచ్చిందని వారంటున్నారు. కాగా ఐదో ఆర్థిక సంఘం కూడా కొద్ది రోజుల క్రితమే తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. దీని అమలు కూడా ప్రారంభం కావాల్సి ఉంది. ఇంకా నాలుగో ఆర్థిక సంఘం సిఫార్సులే పూర్తిగా అమలు కాని నేపథ్యంలో ఇక ఐదో ఆర్థిక సంఘం సిఫార్సుల అమలు ఎప్పుడు ప్రారంభమవుతాయె చూడాల్సి ఉంది.

## సిఎం చంద్రబాబు తిరుపతి పర్యటన రద్దు

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు ఆదివారం తన తిరుపతి పర్యటనను రద్దు చేసుకున్నారు.తిరుపతిలో నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగుతున్న జాతీయ మహిళా సాధికారిత సదస్సుకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరుకావాల్సి ఉంది. అయితే అధికారుల సూచనలను అనుసరించి సీఎం తన పర్యట నను రద్దు చేసుకున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారికంగా ప్రకటించారు., అమరావతి తిరుపతి మార్గంలో దట్టమైన మేఘాలు కమ్ముకోవడంతో హెలికాప్టర్ ప్రయా ణం సురక్షితం కాదని ఏవియేషన్ అధికారులు తెలిపారు. దీంతో సిఎం చంద్రబాబు పర్యటనకు అనుమతి ఇవ్వలేదు. మరోవైపు, తిరుపతిలోని రాహుల్ కన్వెన్షన్ హాల్లో జరిగే మహిళా సాధికారతపై జాతీయ సదస్సులో లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా, ఏపీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, బీజేపీ ఎంపీ పురందరేశ్వరి సహా పలు రాష్ట్రాలకు చెందిన 100 మంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నేటి నుంచి రెండు రోజుల పాటు జరుగుతుంది.

## విజయవాడలో డయేరియాపై ఆందోళనపడాల్సిన అవసరం లేదు: కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని డయేరియాపై ఎవ్వరూ ఆందోళనపడాల్సిన అవసరం లేదు అని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ... డయేరియాపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తున్నామన్నారు. విజయవాడ రాజరాజేశ్వరి పేటలో ప్రతి ఇంటికీ హైజీన్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సబ్బులు, హ్యాండ్ వాష్, పినాయిల్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. డయేరియాపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, సహాయం కోసం కంట్రోల్ రూమ్ నంబర్ 91549 70454ను సంప్రదించాలని సూచించారు.

# తిరుమలలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

- వాహనసేవల వీక్షణకు 35 ఎల్ఇడిస్క్రీన్లు



**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి పదిరోజుల్లో ఆరంభంకానున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయనున్న సామాన్యభక్తులకు అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లుచేస్తున్నట్లు టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఇప్పటికే తిరుమలలో ఆలయ మాఢవీధుల్లో ఏర్పాట్లు దాదాపు పూర్తికావస్తున్నాయన్నారు. ఈ ఏడాది బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వీక్షణకు భక్తులకు తిరుమలఅంతటా 35 ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లుపై ఆదివారం సాయంత్రం టిటిడి ఇఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవితో కలసి ఛైర్మన్ బిఆర్‌నాయుడు మాఢవీధుల్లో తనిఖీ చేశారు. పదిరోజుల్లో మొదలుకానున్న స్వామివారి వాహనసేవల వీక్షణకు విచ్చేసే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు,అందులో ఉండే భక్తులకు నిరంతరాయంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గరుడసేవరోజు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా భద్రత, సౌకర్యాలు ఏర్పాటుచేస్తామన్నారు. వైద్యసేవలు, మరుగుదొడ్లు, తాగునీరు. అన్నప్రసాదాలు, కాఫీ, పాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఆలయ మాఢవీధుల్లో, ఆలయం ముందు, వాహనమండపం ప్రాంతాల్లో గ్యాలరీలు ఏర్పాటు పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. వాహనసేవలు జరిగే సమయంలో భక్తులు గ్యాలరీల్లోకి సులభంగా చేరుకునేలా, తిరిగి వెలుపలకు వెళ్ళేలా భద్రత సిబ్బంది చర్యలు తీసుకుంటారన్నారు.

## సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతి తీసుకొచ్చింది మీరు, పిపిపి విధానంపై దుష్ప్రచారం చేస్తారా..

- మాజీ సిఎం జగన్‌కు మంత్రి సత్యకుమార్ యాదవ్ లేఖ



**విజయవాడ.సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతి మీరు తీసుకొచ్చిన మీరు, పీపీపీ విధానంపై దుష్ప్రచారం చేస్తారా !అంటూ ఏపీ ఆరోగ్యశాఖా మంత్రి వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు లేఖ రాసారు.రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలను రూ.8,480 కోట్లతో నిర్మించాలని నాటి మీ ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నాలుగేళ్ళలో రూ.1450 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందనే విషయం మరిపోయారా ?అని మంత్రి సత్యకుమార్ జగన్‌ను ప్రశ్నించారు.ఈ లెక్కన చూస్తే 17 కళాశాలల నిర్మాణం పూర్తి చేసి 150 ఎంబిబిఎస్ సీట్ల చొప్పున ప్రవేశాలు కల్పించడానికి మీకు 23 ఏళ్ళు పడుతుంది'.అని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మీ ప్రణాళిక ప్రకారం 17 వైద్య కళాశాలలు 2023-24 సంవత్సరంలో మొదలై 2025-28 నాటికి 2,550 ప్రవేశాలు జరగాలి. మీ నిర్వాకంతో నిర్మాణాలు గుంతల స్థాయిలోనే ఉండిపోయాయి' అని మంత్రి విమర్శించారు. 'ఆర్థిక సమస్యలు లేకుండా ఉండేందుకే మీ ప్రభుత్వం సెల్ఫ్ ఫైనాన్సింగ్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. వైద్య కళాశాలల నిర్మాణం తలకు మించిన భారమని భావించి రూ.12 లక్షలు,రూ.20 లక్షల వార్షిక ఫీజులతో సెల్ఫ్ ఫైనాన్సింగ్ పద్ధతిని ప్రవేశపెట్టారు...ఇప్పుడు పీపీపీ విధానంపై ఎందుకు దుష్ప్రచారం చేస్తున్నారు? భారీ అంచనాలు రూపొందించి నాలుగేళ్ళలో ఏడాదికి రూ.363 కోట్ల చొప్పున మాత్రమే ఖర్చు చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాదిన్నరలో రూ.6,379 కోట్లు ఖర్చు చేయాలని అంటున్నారు. ఇదేం ద్వంద్వ వైఖరి? పాడేరు కళాశాలలో 100 సీట్లు కోల్పోడానికి జగనే కారణం.చిత్తశుద్ధి లేకపోవడం వల్లే రెండో దశ లోని 5 కళాశాలలు 700 సీట్లు కోల్పోయాయి.

పులివెందుల కళాశాల నిర్మాణానికి రూ.412 కోట్లు ఖర్చుచేసి మార్కాపురం,మదనపల్లె,ఆదోని వైద్యకళాశాలల నిర్మాణంలో ఎందుకు వివక్ష చూపారు' అని లేఖలో ప్రశ్నించారు.'కార్పొరేట్ సంస్థలు నడుపుతూ రూ.వేల కోట్ల వ్యాపారం చేసే జగన్‌కు పీపీపీకి ప్రైవేటీకరణకు మధ్య తేడా తెలియదా?పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టులకు అవసరమైన నిధులు,నైపుణ్యాల కోసం ప్రైవేటు భాగస్వామిని ఎంచుకుంటారు. అలా అమలయ్యే ప్రాజెక్ట నియంత్రణ పూర్తిగా ప్రభుత్వం చేతిలో ఉంటుంది' అని సత్యకుమార్ యాదవ్ వివరించారు. మళ్ళీ అధికారం లోకి వస్తే పీపీపీ కళాశాలలను రద్దు చేస్తామని జగన్ హెచ్చరించడం హాస్యాస్పదమని మంత్రి పేర్కొన్నారు.

### ప్రముఖులకు మొమెంటోలు అందచేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు



**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో ప్రారంభమైన జాతీయ మహిళా సాధికారత సదస్సుకు విచ్చేసిన ప్రముఖులకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు తనదైన శైలిలో మెమెంటోలను అందజేశారు. లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా, అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎంపి దగ్గుబాటి పురందేశ్వరికి,రాష్ట్రమంత్రి పయ్యావుల కేశవ్‌కు శ్రీవేంకటేశ్వరస్వామి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

## ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలి : సిఐటియు రాష్ట్ర కమిటీ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** పని గంటల పెంపు బిల్లును ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నర్సింగరావు ఒక ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పని గంటలు పెంచుతూ రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో కార్మిక చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెడతామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి ప్రకటించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించడమంటే బిల్లును ప్రవేశపెట్టి తమ మందబలంతో ఆమోదింపజేసుకుంటామని చెప్పటం మినహా మరొకటి కాబోదని పేర్కొన్నారు. అంతకు ముందు మంత్రివర్గం ఆమోదం పొందిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టకుండా రద్దు చేయాలని కోరారు. కార్మికులు ఎక్కువ సెలవులు పొందే విధంగా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పటం కార్మికులను మోసగించటానికేనని తెలిపారు. కర్ణాటక బిజెపి ప్రభుత్వం మొదటగా 2023లో ఫ్యాక్టరీల చట్టానికి సవరణలు చేసి పని గంటలు రోజుకు 12 గంటలు చేసిందని పేర్కొన్నారు. వారానికి 48 గంటల పని కొనసాగుతుందని, వారంలోపే 48 గంటలు పూర్తయితే మిగతా రోజులు వేతనంతో కూడిన సెలవు దినాలుగా పరిగణించబడతాయని చెప్పిందని తెలిపారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేయకుండా కొనసాగిస్తోందని పేర్కొన్నారు. గుజరాత్ బిజెపి ప్రభుత్వం 2025 జులైలో 12 గంటల పని దినం బిల్లు పాస్ చేసిందని తెలిపారు. అలాగే కార్మిక సంఘాలతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించకుండా బిల్లు పెట్టేందుకు సిద్ధమవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని వెల్లడించారు.

# తిరుమల సమాచారం

## మహిళలను ముందుకు తీసుకెళ్లేలా ప్రధాని మోడీ కార్యక్రమాలు

- పలువురు మహిళా ప్రతినిధులు



**తిరుమల,సెప్టెంబర్ 14ప్రభాత వార్తప్రతి నిధి:** దేశంలో మహిళలను ముందుకు తీసుకెళ్ళేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక పథకాలు ,కార్యక్రమాలు అమలుచేస్తున్నారని ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి,పలువురు మహిళా ప్రజా ప్రతినిధులు తెలిపారు. తిరుపతిలో మొదటిసారిగా జాతీయ మహిళా సాధికారత సదస్సు శ్రీవారిపాదాల చెంత ప్రారంభం కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మహిళా శక్తితో దేశం ఆర్థికంగా, సామాజికంగా పురోభివృద్ధి చెందుతందన్నారు. తిరుపతి సదస్సుకు విచ్చేసిన ఎంపి పురందేశ్వరి, మాజీ గవర్నర్ తమిళిసై, ఇన్ఫోసిస్ అధినేత, ఎంపి సుధానారాయణమూర్తి ,ఏపి మంత్రులు అనిత,సవిత, మహారాష్ట్ర ఎంపి రోహిణి, సంధ్యారాణి, ఎంఎల్‌ఎ పరిటాల సునీత,తమిళనాడు మంత్రి గాంధీ ఆదివారం ఉదయం తిరుమలేశుని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు



**తిరు మల, సెప్టెంబర్ 14ప్రభాత వార్త ప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆదివారం ఉదయం నైవేద్యవిరామసమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ నగేశ్ బీమపాక , ఏపి హైకోర్టు జడ్జి జస్టీస్ టిసిడి శేఖర్‌లు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. కుటుం బంతో కలసి వచ్చిన వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనంచేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.టిటిడి అదనపు ఇఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## యాచకులు, అనధికార వ్యాపారుల తరలింపు

**తిరుమల,సెప్టెంబర్14ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభం కానున్న నేపథ్యంలో తిరుమల నుండి యాచకులు, అనధికార వ్యాపారులను ఆదివారం టిటిడి విజిలెన్స్, తిరుమల పోలీసులు తరలించారు. భద్రతను దృష్టిలో ఉంచుకుని కఠిన చర్యల దిశగా తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదివారం ఉదయం తిరుమలలో పర్యటించారు. కళ్యాణకట్ట, ఎస్వీషాపింగ్ కాంప్లెక్స్,ఆస్థానమండపం ప్రాంతాల్లో 82మంది యాచకులు, అనధికార వ్యాపారులను తిరుపతికి తరలించారు. వారి అనుమానితుల వేలిముద్రలను సేకరించారు. హోటళ్ళు, టీ దుకాణాలు ,చిల్లరదుకాణాల యజమానులు తిరుమలలోపనిముగిసిన తరువాత కార్మికులకు తిరుపతిలో వసతి కల్పించాలని పోలీసులు సూచించారు.

## విశాఖపట్నం నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్,సెప్టెంబరు14, ప్రభాతవార్త** విశాఖపట్నం నుంచి తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి తిరుపతి స్పెషల్ ట్రైన్ ఈ నెల 15 నుంచి నవంబర్ 24 వరకు ప్రతి సోమవారం అందుబాటులో ఉంటుంది. అదే విధంగా, తిరుపతివిశాఖపట్నం రైలును ఈ నెల 16 నుంచి నవంబర్ 25 వరకు ప్రతి మంగళవారం నడపనున్నట్లు వివరించారు. ఈ మార్గంలో మొత్తం 22 సర్వీసులు నడుస్తాయి.ఇక తిరుపతి నుంచి అనకాపలి - తిరుపతి మధ్య అక్టోబర్ 5 నుంచి అక్టోబర్ 27 వరకు మొత్తం 8 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అదేవిధంగా సంబల్‌పూర్ ఇరోడ్ మధ్య కూడా రైల్వే శాఖ ప్రత్యేక సర్వీసులను ప్రకటించింది. సంబల్‌పూర్ నుంచి ఇరోడ్ వెళ్లే రైలు సెప్టెంబరు 17 నుంచి నవంబర్ 26 వరకు ప్రతి బుధవారం ప్రయాణిస్తుంది.తిరుగు ప్రయాణంలో ఇరోడ్ సంబల్‌పూర్ రైలు సెప్టెంబరు 19 నుంచి నవంబర్ 28 వరకు ప్రతి శుక్రవారం సర్వీసు అందిస్తుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గంలో కూడా మొత్తం 22 ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైల్వే శాఖ సూచించింది.

## ప్రధాని జన్మదిన సందర్భంగా 'సేవాపక్షోత్సవాలు'



కోలా ఆనంద్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు 'సేవా పక్షోత్సవాలు' నిర్వహించుటకు బిజెపి నిర్ణయించిందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ ఆదివారం మీడియాకు తెలిపారు.ఈ మేరకు పార్టీ నాయకులు అమలు చేయటానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా మెడికల్ క్యాంపులు, స్వచ్ఛ భారత్, మొక్కలు నాటడం, దివ్యాంగులకు సత్కారం, క్రీడల పోటీలు, అన్నదానాలు నిర్వహిస్తామని వివరిం చారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోనరేంద్ర మోదీ జన్మదిన కార్యక్రమాలను భారీ ఎత్తున నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ నెల 17న రక్తదానం నిర్వహిస్తామన్నారు. బిజెపి నాయకుల ప్రధాన కార్యక్రమాలను శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధికార ప్రతినిధి కొండేటి గోపాల్, పట్టణ మాజీ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు, జిల్లా కార్యదర్శి కూనాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం 'చదవటం మాకు ఇష్టం' కార్యక్రమం

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతిని ధి:** ఏపీ పౌరగ్రంథాలయ సంస్థ ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచేందుకు ప్రతి ఆదివారం నిర్వహించే చదవటం మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహిస్తుంది.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఒక్కో అంశంపై అవగాహన కల్పిస్తోంది.నిష్ణాతుల మార్గదర్శనంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై మక్కువను పెంచుతుంది.ఈ ఆదివారం విజయవాడలో ఠాగూర్ గ్రంథాలయంలో మాతృభాషపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రతి ఒక్కరికీ మన మాతృభాష అయిన తెలుగు తెలిసి ఉండాలి. విద్యార్థులు మాతృభాష నేర్చుకోవడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలు, సాహిత్యం తెలుసుకుంటారు. పాఠ్యాంశాలు కూడా సులభంగా అర్థం చేసుకోవచ్చు అని తెలుగు ఉపాధ్యాయురాలు వల్లభనేని సుమతి గారు విద్యార్థులకు తెలియజేశారు.

ప్రతి ఆదివారం ఆమె విద్యార్థులకు అక్షరాలు నేర్పించడం, చదవటం రాయటం , బోధన తదితర అంశాలు లో శిక్షణ ఇస్తున్నారు. ఈ విషయం అమెరికాలో ఉన్న వారి సుమతి కుమారుడు వల్లభనేని వంశీ మాతృభాష మీద మక్కువతో విద్యార్థులకు అక్షరాలతో కూడిన పదాలు నేర్చుకునే పుస్తకాలను బహుకరించారు.

ACHARYA N.G RANGA AGRICULTURAL UNIVERSITY
Administrative Office, Lam, Guntur-522034: A.P.
e-Procurement Tender Notice
Tenders are invited from the eligible contractors, for Tender Notice No. 06-08, dated 11.09.2025 Civil work - 1 No, Electrical work - 2 Nos, through e-procurement. Details can be had from www.angrau.ac.in or from O/o the Estate Officer at the above address. Schedules can be downloaded through http://www.apeprocurement.gov.in. For the works 06-08, downloading starts from 15.09.2025 @ 3.00 PM onwards & ends on 29.09.2025 upto 3.30 PM. For details contact: TPA to Estate Officer: 9490008945.
Sd/- ESTATE OFFICER
DIPR.No.4422PP/CL/Advt/1/1/2022-23, Date: 12.09.2025

నీవు జీవితంలో అభివృద్ధి చెందాలంటే నిత్యం నూతన మార్గాలను అన్వేషించాలి.

-రాబర్ట్ ఆంథోనీ

# ఎరువుల సమస్యకు 'సేంద్రియ' పరిష్కారాలు

**ఎరువుల సమస్యకు శాశ్వత పరిష్కారాలు సాధించాలంటే దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించడం అత్యంత అవసరం. దీనివల్ల నేల సారం పెరగడంతో పాటు, రసాయనాల వల్ల కలిగే హాని తగ్గుతుం ది. అంతేకాకుండా, నానో ఎరువుల ఉత్పత్తిని పెంచడం. ఇవి తక్కువ మోతాదులో ఎక్కువ పోషకాలను అందిస్తాయి. వీటిని వాడటం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గ తుంది. ఎరువుల ఉత్పత్తిలో కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి పరిశోధన, అభివృద్ధి రంగంలో పెట్టుబడులను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించవచ్చు. అలాగే, ఎరువుల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడా నికి, సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి అంతర్జా తీయ స్థాయిలో వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకోవడం అవసరం.**

డి. జయరాం

భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోంది. పంటల దిగుబడిని పెంచడంలో, ఆహార భద్రతను నిర్ధారించడంలో ఎరువులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అయితే దేశీయంగా ఎరువుల ఉత్పత్తి, వినియోగంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. మనదేశంలో అత్యధికంగా ఉపయోగించే ఎరువు యూరియా. దీనికి ప్రధాన కారణం, ఇందులో నత్రజని శాతం ఎక్కువగా ఉండడం. మొక్కల ఎదుగుదలకు నత్రజని అత్యంత అవసరమైన పోషక పదార్థం. ఇది ఆకుల పెరుగుదలకు, కిరణజన్య సంయోగ క్రియకు దోహదపడుతుంది. యూరియా తక్కువ ధరలో లభిస్తుంది. దీనిని రైతులు సులభంగా వాడవచ్చు. అందుకే, దేశంలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారతదేశంలో మొత్తం యూరియా వినియోగం దాదాపు 357 లక్షల టన్నులు. అయితే యూరియాను ఎక్కువగా వాడటం వల్ల నేల సారం తగ్గిపోవడం, భూగర్భ జలాలు కలుషితం కావడం వంటి పర్యావరణ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం, దేశంలో అధికంగా వాడుతున్న ఎరువులలో యూరియా తర్వాత డైఅమ్మోనియం ఫాస్ఫేట్, మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ ఉన్నాయి. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా, డైఅమ్మోనియం ఫాస్ఫేట్ వంటి ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా నానో యూరియా విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. 500 మిల్లీలీటర్ల నానో యూరియా బాటిల్ ఒక బస్తా సంప్రదాయ యూరియాకు సమానమని నిపుణులు చెబుతున్నారు. ఇది మొక్కలకు అధిక నత్రజనిని అందించి, పర్యావరణానికి హాని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే నీటి కాలుష్యం, నేల కాలుష్యాన్ని తగ్గిస్తుంది. యూరియాకు ప్రత్యామ్నాయంగా డీఏపీని విస్తృతంగా ఉపయోగిస్తున్నప్పటికీ దానిలో ఫాస్ఫేట్, నత్రజని పోషకాలు మాత్రమే ఉంటాయి. పొటాష్, ఇతర పోషకాలు ఇందులో ఉండవు. అందువల్ల, అన్ని పోషకాలు లభించే మిశ్రమ ఎరువుల వాడకం ముఖ్యమని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. భారతదేశంలో ఎరువుల ఉత్పత్తి కోసం కొన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు ఉన్నాయి. వీటిలో ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్, బ్రహ్మపుత్ర వ్యాలీ ఫర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, అలాగే కోరమాండల్ ఇంటర్నేషనల్ వంటి ప్రైవేట్ సంస్థలు ఉన్నాయి. అయితే మన దేశీయ అవసరాలకు తగ్గట్టుగా ఎరువులను ఉత్పత్తి చేయలేకపోవడం ఒక ప్రధాన సమస్య. పెరుగుతున్న జనాభా, వ్యవసాయ భూమి విస్తీర్ణం, అధిక పంటల దిగుబడి లక్ష్యాల కారణంగా ఎరువుల అవసరం భారీగా పెరిగింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం భారత దేశం తన ఎరువుల అవసరాల్లో దాదాపు 30శాతం దేశీయంగా ఉత్పత్తి చేస్తుండగా, మిగిలిన 70శాతం దిగుమ



తులపై ఆధార పడుతోంది. ఈ లోటును పూడ్చుకోవడానికి మనం భారీగా ఎరువులను దిగుమతి చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. మనదేశం ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించలేకపోవడానికి కొన్ని ప్రధాన కారణాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది ముడిసరుకుల కొరత. ఎరువుల ఉత్పత్తికి అవసరమైన సహజ వాయువు వంటి ముడిసరుకులు మన దేశంలో తక్కువగా ఉన్నాయి. ఈ కారణంగా, వాటిని మనం దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. అంతేకాకుండా, ఎరువుల పరిశ్రమల్లో ఆధునిక సాంకేతికత, మౌలిక సదుపాయాలు తగినంతగా లేకపోవడం కూడా ఒక కారణం. దీనివల్ల ఉత్పత్తి సామర్థ్యం తక్కువగా ఉంటుంది. ఈ లోటును పూడ్చుకోవడానికి భారతదేశం భారీగా ఎరువులను దిగుమతి చేసుకుంటుంది. తన ఎరువుల అవసరాలను తీర్చడానికి చైనా, కెనడా, జోర్డాన్, రష్యా, మొరాకో వంటి దేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది. ఈ దిగుమతులకు భారీగా విదేశీ మారక ద్రవ్యం అవసరమవుతుంది. మన దేశం ఎక్కువగా యూఎస్ డాలర్లలో చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఎరువుల ధరలు అంతర్జాతీయ మార్కెట్లో హెచ్చుతగ్గులకు లోనైనప్పుడు, దాని ప్రభావం మన దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ఈ విదేశీ మారక ద్రవ్యాన్ని మనం ఎగుమతులు పెంచడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా సమకూర్చుకుంటున్నాం. అయితే దిగుమతులపై అధికంగా ఆధారపడటం వల్ల దేశీయ ఆర్థిక వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. ఎరువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే అనేక సవాళ్లను అధిగమించాలి. ముఖ్యంగా ముడిసరుకుల లభ్యతను పెంచడం ఒక పెద్ద సవాలు. సహజ వాయువు నిల్వలను పెంచడం, కొత్త ఎరువుల ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా ఈ సమస్యను కొంత వరకు పరిష్కరించవచ్చు. మూసివేసిన ఎరువుల ఫ్యాక్టరీలను పునఃప్రారంభించడం కూడా ఒక మంచి పరిష్కారం. రసాయన ఎరువుల ఉత్పత్తి, వినియోగం వల్ల పర్యావరణానికి హాని జరుగుతుంది. దీనికి పరిష్కారంగా, సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించడం, నానో యూరియా వంటి ఆధునిక, పర్యావరణహిత ఎరువులను ప్రోత్సహించడం అవసరం. రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించడం, సేంద్రీయ ఎరువుల ఉత్పత్తిని ప్రోత్సహించడం వల్ల పర్యావరణానికి హాని తగ్గించవచ్చు. ఎరువుల సమస్యకు శాశ్వత పరిష్కారాలు సాధించాలంటే దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించడం అత్యంత అవసరం. దీనివల్ల నేల సారం పెరగడంతో పాటు, రసాయనాల వల్ల కలిగే హాని తగ్గుతుంది. అంతేకాకుండా, నానో ఎరువుల ఉత్పత్తిని పెంచడం. ఇవి తక్కువ మోతాదులో ఎక్కువ పోషకాలను అందిస్తాయి. వీటిని వాడటం వల్ల రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. ఎరువుల ఉత్పత్తిలో కొత్త సాంకేతికతలను అభివృద్ధి చేయడానికి పరిశోధన, అభివృద్ధి రంగంలో పెట్టుబడులను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించవచ్చు. అలాగే, ఎరువుల కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి, సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి అంతర్జాతీయ స్థాయిలో వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకోవడం అవసరం. ఈ చర్యలన్నీ తీసుకున్నట్లయితే భారతదేశంఎరువుల రంగంలో స్వయంసమృద్ధి సాధించి, రైతులకు భరోసా కల్పించడంతోపాటు, ఆహార భద్రతను పటిష్టంచేయగలదు. •

## పౌష్టికాహార లోపం

ప్రపంచ జనాభాలో పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న బాలల్లో దాదాపు ఇరవైశాతంపైగా భారత్‌లోనే ఉన్నారని ఐక్యరాజ్యసమితి నివేదిక ఏనాటి నుంచో వెల్లడిస్తున్నది. ఐదు సంవత్సరాల్లోపు పిల్లల్లో నలభైశాతం మంది పిల్లలు తక్కువ బరువుతో పుడుతున్నారని, వారిలో ఏడు శాతం మంది పిల్లలు పుట్టిన ఐదేళ్లలోపే మరణిస్తున్నారని ఆ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈభూమ్మీద పుట్టిన వారికి ఎవరికైనా రాజ్యాంగం కల్పించిన హక్కే జీవించే హక్కు. అలాంటిది కన్నులైనా సరిగ్గా తెరవని పసిగుడ్డులకు సరైన ఆహారం అందక చనిపోతే దానికి బాధ్యత వహించాల్సింది ప్రభుత్వాలే. తల్లీబిడ్డకు పోషకాహారం సకాలంలోఅందివ్వకపోతే ఆ పాపం పాలకులదే అవుతుంది. అందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ యునిసెఫ్ నిర్వహించిన అనేక అధ్యయనాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అనారోగ్య పరిసరాలు, వాతావరణంలో కలుషిత నీరు, డయేరియా వంటి రోగాలబారిన పడి ఆస్పత్రులపాలవుతున్నారు. పిల్లల్లో పోషకాహారలేమి ఉన్నప్పుడు వారికి బలవర్ధక ఆహారం అందివ్వాలని ప్రభుత్వాలు ఐసిడిఎస్ వంటి పథకాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించినా ఫలితాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఇలా పోషకాహారలేమితో బాధపడుతున్న కారణంగా భారతదేశం ఆర్థికంగా నష్టపోతున్నది. మరొకపక్క పాఠశాలల్లో పారిశుధ్య సౌకర్యం లేకపోవడం వల్ల అంటువ్యాధులు ప్రబలిపోతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడం పరిశుభ్రత ఇక్కడి సమస్య. జనాభాలో దాదాపు ముప్పైఆరు శాతం మందికి సరైన శానిటేషన్ సౌకర్యాలు లేవు. ఇక సమగ్రశిశువు అభివృద్ధి పథకం కింద మాతాశిశు సంరక్షణ కోసం వారికి పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీలు లక్ష్యానికి దూరంగా ఉన్నాయని ఎన్నోసార్లు కాగ్ చురకలు అంటించింది. మాతాశిశు సంక్షేమంపై జరుగుతున్న నిర్లక్ష్యానికి మచ్చుతునకే పౌష్టికాహారలోపం. సరైన పోషకాలు అందకపోతే పసిపిల్లల ఎదుగుదలపై ప్రభావం చూపిస్తుంది. అందుకే అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు శ్రేష్ఠమని డాక్టర్లు చెబుతుంటారు. మాతృస్తన్యం ద్వారానే పౌష్టికాహారం మేలైన పద్ధతిలో అందించే వీలుంది. ఈ విషయంపై అవగాహన కల్పించడంలోనూ, వైద్యశాఖ అంతగా కృషి చేయలేకపోతున్నదేమోననిపిస్తున్నది. దేశంలోని బాలలందరికి సమగ్రంగా అంగన్‌వాడీ ప్రయోజనాలు అందించాలని దేశ సర్వోన్నత న్యాయస్థానం ఏనాడో మార్గదర్శక సూత్రాలను జారీ చేసినా వాటిని అధ్యయనం చేసి చర్యలు తీసుకున్న సందర్భాలు కూడా లేవనే చెప్పొచ్చు. పిల్లలకే కాదు ముప్పైఏళ్లు దాటిని వారెందరో దేశంలో పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. భారత్‌లో గత మూడు దశాబ్దాలుగా ప్రజల ఆర్థికస్థితిగతుల్లో వచ్చిన మార్పులు ఆహారపు అలవాట్లను మార్చేశాయి. మరొకపక్క వ్యవసాయోత్పత్తులు గణనీయంగా పెరిగినా ఇప్పటికీ దేశంలో పదిహేను శాతానికిపైగా జనాభా అర్థాకలితో అలమటిస్తున్నారు. మొత్తం నూట పదిహేడు దేశాల నుంచి సేకరించిన సమాచారంతో రూపొందించినప్రపంచ ఆకలి సూచి 2019లో భారత్‌ది 102వస్థానం. దేశంలో దాదాపు ఇరవై కోట్ల మంది పౌష్టికాహార సమస్యతో బాధపడుతున్నారు. ఇందులో పదిహేను నుంచి నలభైతొమ్మిదేళ్ల వయస్సున్న మహిళల్లో యాభైఒక్కశాతం అత్యంత బలహీనంగా ఉంటున్నారని ఆహార వ్యవసాయ సంస్థ నివేదిక పేర్కొంది. చాలా మంది రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నారు. చిన్నారుల స్థితిపై యునిసెఫ్ గతంలో ఇచ్చిన నివేదిక ప్రకారం చనిపోతున్న ఐదేళ్లల్లోపు పిల్లల్లో అరవైతొమ్మిదిశాతం సరైన పౌష్టికాహారం లభించక ప్రాణాలు విడుస్తున్నారనే విషయం అందరిని ఆందోళనకు గురిచేస్తున్నది. దాదాపు నాలుగున్నర కోట్ల మంది పిల్లలు వయసుకు తగ్గ ఎత్తుకు పెరగడం లేదు. రెండున్నర కోట్ల మందికిపైగా చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు ఉండటం లేదు. దేశంలో అత్యధికుల ఆహారంలో పిండిపదార్థాల శాతమే ఎక్కువ ఉంటుందని, మాంసకృతుల వంటి ఇతర పోషకాల శాతం చాలా పరిమితమేనని నివేదికలు వెల్లడిస్తున్నాయి. గ్రామీణుల్లో అరవైశాతం శక్తి కేవలం పిండిపదార్థాల రూపంలో వస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో ఉండేవారికి యాభైఒక్క శాతం పిండిపదార్థాల శక్తి వస్తున్నది. దేశంలో పాలు, కూరగాయలు, మాంసం ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతున్నా అవి అవసరాన్ని తీర్చలేకపోతున్నాయి. ఒక వ్యక్తి నిత్యం తీసుకునే ఆహారంలో మూడువందల గ్రాముల కూరగాయలు ఉండాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో ప్రస్తుతం దాదాపు ఇరవై కోట్ల టన్నుల కూరగాయలు యేటా ఉత్పత్తవుతున్నాయి. ఇప్పటికీ పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న వారిలో పదిహేను శాతం, గ్రామీణుల్లో తొమ్మిది శాతం మాత్రమే నిత్యం అవసరమైన మేరకు కూరగాయలను తింటున్నారు. దేశంలో దాదాపు ఇరవై తొమ్మిది కోట్ల టన్నుల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతంలో తొమ్మిదిశాతం, పట్టణ ప్రాంతాల్లో దాదాపుపదిహేను శాతం మాత్రమే తీసుకుంటున్నారని సర్వేలు చెబుతున్నాయి. సమతుల ఆహారాన్ని తీసుకోకపోవడానికి ఆర్థిక సమస్యలు కారణమైనా అవగాహనలోపం కూడా దీనికి తోడవుతున్నది. ఇంకొక పక్క కల్తీ కూడా ప్రజారోగ్యంపై కాటు వేస్తున్నది. ఈ కల్తీని నిరోధించేందుకు పాలకులు తీసుకొంటున్న చర్యలు ఫలితాలివ్వలేక పోతున్నాయి. ఫలితంగా ఎందరో అనారోగ్యం పాలౌతుండగా, పౌష్టికాహారం లోపం దీనికి తోడౌతున్నది. కొత్త చట్టాలు, నూతన పథకాలు తెస్తే తెండి ఉన్న వాటిని త్రికరణ శుద్ధిగా అమలు చేసేందుకు కృషి చేయాలి.

> మితిమీరిన ఆశలకు పోయేవారే ఎక్కువగా మోసాలకు గురి అవుతూ ఉంటారు.
>
> అరిస్టాటిల్



> అవసరానికి ఆదుకొనే స్నేహితులుండడం అదృష్టం. అసలు స్నేహితుల అవసరం రాకపోవడం ఇంకా అదృష్టం.
>
> ఆస్కార్‌వైల్డ్



# ప్రజావాక్కు



### సమస్యగా మారుతున్న ఇ -వేస్ట్

**ఈ డిజిటల్** యుగంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు(ఈవేస్ట్) ఒక తీవ్రమైన సమస్యగా మారుతోంది. మొబైల్, కంప్యూటర్, టీవీ, ఫ్రిజ్ వంటి పరికరాల వినియోగం వేగంగా మారుతూఉండటం ఈసంక్షోభాన్ని మరింతపెంచుతోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం, భారతదేశంలో 2023వ సంవత్సరంలో సుమారు 17 లక్షల టన్నుల ఈవేస్ట్ ఉత్పత్తి అయింది. అయితే, దీనిలో కేవలం 30 మాత్రమే అధికారికంగా ప్రాసెస్ చేయబడింది. మిగిలిన వ్యర్థాలు అనధికారిక రంగాల్లో సరైన భద్రతా చర్యలు లేకుండా నిర్మూలించబడుతున్నాయి. దీని వల్ల వాయు, జల, మట్టికాలుష్యం వంటి తీవ్రమైన సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈవ్యర్థాలలో సీసం, పాదరసం, క్యాడ్మియం వంటి విషపదార్థాలు ఉంటాయి

- సి.సాయిరుత్విక్, నల్గొండ

### రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య భిక్ష పెట్టండి

**తెలంగాణకు**సాగు, త్రాగు, పరిశ్రమలకు ఇతరత్రా ఉపయోగపడుతున్న విధంగా సింగరేణి కూడాఅదేవిధంగా బృహత్తర విస్తృత స్థాయిలో నిధులు అందించి దాదాపు ప్రతి ఒక్క రంగానికి నిధులు సమ కురుస్తూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నది. ప్రతిసంవత్సరం గణనీయమైన లాభాలుగడుస్తున్నది. కానీ బొగ్గును ఉత్పత్తి చేసి లాభాలు గడించుటకు సర్వశక్తులు ధార పోసిన రిటైర్డ్ ఉద్యోగుల పట్ల సింగరేణి తల్లి కనికరం చూపడం లేదు. వైద్యసౌకర్యాలు అందక ఆచేతనస్థితిలో బతుకుతున్నారు.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

### పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం

**భారతదేశంలో** మత్తు పదార్థాల వినియోగం ప్రమాదకరంగా పెరుగుతోంది. పట్టణాల్లోనే కాకుండా గ్రామాల్లో కూడా డ్రగ్స్ సులభంగాలభించడం, యువత వాటి వలలో చిక్కుకోవడం గమనార్హం. కుటుంబవ్యవస్థల బలహీనత, మానసిక ఒత్తిడులు, మిత్రుల ప్రభావంవంటి కారణాలు యువతను మత్తు పదార్థాలవైపు నడిపిస్తున్నాయి. అలాగే, భారత్ రెండు ప్రధాన మత్తు పదార్థాల ఉత్పత్తి ప్రాంతాల మధ్య ఉండటం వల్ల అక్రమంగా డ్రగ్స్ ప్రవేశించే అవకాశాలు పెరిగాయి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పిల్లలను ఆటలాడిద్దాం

**క్రీడలు** కేవలం ఉల్లాసానికే కాదుమానసిక వికాసం, శారీ రక బలానికి ఎంతో అవసరం. తల్లిదండ్రులు తమ పిల్లల బాల్యాన్ని ఆటలకు దూరం చేస్తున్నారు. వసతులు లేమి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లకొరత, పాఠశాలల్లో పోటీత త్వం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. పాఠశాలస్థాయి నుంచి చదువులపై ఒత్తిడి అధికమవుతుంది. ఉద యం 7 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు క్లాసులే క్లాసులు. అదనపు బోధనతో వారి విరామ సమయాన్ని ఉపాధ్యాయులు లాగేసుకుంటున్నారు. దొరికిన కాస్త విరామ సమయం స్మార్ట్‌ఫోన్లు ఆకర్షిస్తున్నాయి. ఈ ప్రతికూలతలు పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. ప్రతిపాఠశాలలోవ్యాయామ ఉపాధ్యాయులు నియామకం చేసి క్రీడాపరికరాలు అందజేయాలి.

- సి. చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

### ప్రమాదంలో ప్రాథమిక హక్కులు

**హక్కుల** గురించి మాట్లాడడడం రాయడం ఒక మృగ్యం అయిపోతున్న పరిస్థితిలో ఉన్నాం. సంచార స్వేచ్ఛ లేదు జైళ్లలో కనీసం విచారణలేకుండా కుక్కబడినపరిస్థితి ఉంది. దళితులలో ఆదివాసులలో ఈతీవ్రత మరింత ఎక్కు వ అయితే రాజ్యాంగం ఆశించింది అందించింది ఇదేనా అనే భావన కలుగుతుంది. ఇవ్వాళ ఆదివాసులు తమకు ఏమి కావాలి అని దానిని వాళ్లే నిర్ణయించుకుంటారు అనిరాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ దాని అమలులో మాత్రం ఆ ఛాయలు కనిపించవు. నిరసన తెలిపేం దుకు అవకాశం లేదు. చివరికి తనకు నచ్చిన ఆహారం తినే స్వేచ్ఛకూడా లేదు. రాజ్యాంగ సభచర్చలలోఎక్కువ కాలం నలిగిన ప్రాథమిక హక్కుల ఉనికే ప్రమాదంలో ఉంది.

- భారత అవినాష్, జనగామ

### తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి

**దశాబ్దాలుగా** అన్ని రంగాల్లో వెనకబడి కుంగిపోతున్నా తెలగ కులాన్ని బీసీగా గుర్తించాలి. గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలో కాపు కులంతో తెలగ కులాన్ని జతచేయడం వల్లనే ఉత్తరాంధ్రలో ఉన్న తెలగ కులాన్ని బీసీగా గుర్తించడం లేదు. ఎందుకంటే కాపులు ఆర్థికంగా బలమైన వారు కాని తెలగ కులస్టులు కేవలం వ్యవసాయాన్ని నమ్మి ఆర్థికంగా ఎదగలేకపోయారు. రిజర్వేషన్లు లేకపోవడం వల్ల ఉద్యోగులు సంపాదించలేకపోయాం. రాజకీయాల్లో రాణించలేకపోయం. అందుకే మా జీవితాల్లో ప్రగతి సూర్యోదయాన్ని చూడలేకపోయాం.

-జి.అశోక్ కుమార్, విశాఖపట్నం

మనవి **ఎడిట్ పేజీకి..**


ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రజాస్వామ్యం కోసం వేదిక ఇచ్చారు.. స్పందన ఎక్కడ?

సోరుపాక అనిల్ కుమార్

ప్రభుత్వాన్ని మనం ప్రజల సేవకుడిగా చూడాలని నేర్పారు. దేశ అభివృద్ధికి, సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిని అందించాల్సిందేనని భావిస్తాం. అందుకే ప్రతి కుటుంబం తన ఆదాయంలో కొంత భాగాన్ని పన్నుల రూపంలో చెల్లించి, ప్రభుత్వంపై నమ్మకంతో జీవిస్తోంది. తన సమస్యను చెప్పుకునేందుకు, తన కష్టాలను వినిపించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వేదికలు ఉన్నాయని నమ్ముతూ ముందడుగు వేస్తుంది. గ్రామాల్లో నీటి సమస్య వచ్చినా, పట్టణాల్లో విద్యుత్ నిలిచిపోయినా, ఆసుపత్రిలో మందులు అందక బాధపడుతున్నా, స్కాలర్‌షిప్ అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా ఇలా ఎన్ని సమస్యలు ఉన్నా ఇవన్నీ ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఈమెయిల్ ఐడీలు, టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు. కానీ వాటి వలన ఎటువంటి స్పందన ఉండటం లేదు. ఫిర్యాదు చేసిన తర్వాత రోజులు, వారాలు గడిచినా పరిష్కారం లేకపోవడం అనుభవంగా మారుతోంది. సమస్య ఎక్కడికి వెళ్లిందోకూడా తెలియని పరిస్థితులు చాలాచోట్ల కనిపిస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న సేవలు పేరు కోసం మాత్రమేనా? సమస్యను వినేందుకు ఉన్న నెంబర్లు కేవలం రూపకల్పనగా మిగిలిపోయాయా? అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరి మనసులో కలుగుతున్నాయి. ప్రజల బాధను పట్టించుకోకుండా ప్రభుత్వ కార్యాలయాలు వ్యవహరించడంతో నమ్మకం క్రమంగా తగ్గుతోంది. ప్రతి వ్యక్తి చెల్లించే పన్నుల ద్వారా ప్రభుత్వ సేవలపై ఆధారపడుతూ జీవిస్తాడు. అలాంటి సమయంలో స్పందన లేకపోతే నిరాశ ప్రభుత్వంపై నమ్మకం తగ్గుతోంది. అలాంటప్పుడు సమస్యను పరిష్కరించుకునేందుకు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. వ్యవస్థపై అసహనం పెరిగి, సామాజిక సంక్షోభంగా మారుతుంది.




ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలతో మాత్రమే పరిమితం కాదు. రోజువారీ సేవల ద్వారా, సమస్యలపై స్పందించే విధానాల ద్వారా ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. అధికారుల పని కేవలం ఆదేశాలు ఇవ్వడం కాదు ప్రజల మాట విని, తక్షణంగా స్పందించి, అవసరమైన చర్యలు తీసుకోవడం ముఖ్యమైన బాధ్యత. ఒక ఫోన్‌కాల్‌కు కూడా సమాధానం అందని పరిస్థితిలో ఉన్న కార్యాలయాలు ప్రజల సమస్యలను పరిష్కరించగలవా? అనే ప్రశ్న ఎన్నోచోట్ల మారుమ్రోగుతోంది. స్పందించకపోవడం వల్ల ప్రజలు అసహనంతో నిండిపోతున్నారు. మధ్యవర్తుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సేవలపై విశ్వాసం తగ్గిపోతోంది. ఇది వ్యక్తిగత సమస్యగానే కాదు, సమాజ స్థాయిలో ప్రభావాన్ని చూపే పెద్ద సంక్షోభంగా మారుతోంది. న్యాయంగా సేవలు అందకపోతే సామాజిక అసమానతలు, అసంతృప్తి, నిరుత్సాహం పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వానికి ప్రజల నుండి వినిపిస్తున్న సమస్యను వినాలి. సమస్యను తెలిపిన తర్వాత కనీసం స్పందన ఇవ్వడం కూడా కష్టంగా మారితే, ప్రభుత్వం నిజంగా ప్రజల కోసం పనిచేస్తుందా? పేరు కోసం మాత్రమే ఈ సేవలను అందిస్తున్నదా? అనే ప్రశ్నలు సామాన్యుల మనసుల్లో కలుగుతున్నాయి. ఫిర్యాదులను సమయానికి స్వీకరించేలా, పారదర్శకంగా వాటి స్థితిని తెలియజేసేలా వ్యవస్థను బలపరచాలి. అందుబాటులో ఉన్న నెంబర్లు పనిచేస్తున్నాయా? సమాధానాలు అందుతున్నాయా? సమస్యలను వినేందుకు అధికారులు శ్రద్ధ చూపుతున్నారా? అన్నది కేవలం కార్యాలయాల పనిగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలి. ప్రజల సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రభుత్వానికి గౌరవం పెరుగుతుంది. ప్రజలు కూడా నమ్మకంతో ముందడుగు వేయగలరు. ఇప్పటికైనా ప్రభుత్వం జాగ్రత్తగా ఆలోచించి, ప్రతి ఫిర్యాదును గౌరవంగా స్వీకరించేలా వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంది. ప్రజల మాట వినాలి టోల్ ఫ్రీ నెంబర్లకు మెయిల్స్‌కి వెంటనే స్పందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్రభుత్వం నిజమైన సేవకుడిగా నిలబడగలదు. •

# రాహుల్ గాంధీ 'సామాజిక న్యాయం'పై సందేహాలు!

మన్నారం నాగరాజు

రాహుల్ గాంధీ ఇటీవల కాలంలో 'సామాజిక న్యాయం' అనే నినాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. దేశవ్యాప్తంగా పాదయాత్రలు చేస్తూ ప్రజలతో మమేకమవుతూ, ముఖ్యంగా వెనుకబడిన వర్గాల సమస్యలను వెలికితీస్తానని చెబుతున్నారు. కానీ ప్రజలు, ముఖ్యంగా బీసీ సమాజం అడుగుతున్న ప్రశ్న మాత్రం మరింత బలంగా మారుతోంది. మీ సామాజిక న్యాయం నినాదం నిజంగా చిత్తశుద్ధితోనా? లేక ఎన్నికల ప్రయోజనాల కోసమా? రాహుల్ గాంధీ రోడ్లమీద ప్రజలతో మాట్లాడుతూ బీసీల పేర్లు ప్రస్తావించడం, వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం ఒక విషయం. కానీ అదే మాటలను పార్లమెంట్‌లో బలంగా వినిపించడం, రాజ్యాంగ బలంతో అమలు చేయించడం మరో విషయం. ఈ రెండవ దశలో రాహుల్ గాంధీ కనిపించకపోవడం బీసీలలో అనుమానాలను పెంచుతోంది. భారతదేశంలో బీసీల సంఖ్య జనాభాలో సగానికి పైగా ఉంటుంది. సర్వేల ప్రకారం కనీసం52శాతం నుంచి 55శాతం వరకు జనాభా బీసీలదే. ఓట్ల పరంగా చూసినా, రాజకీయ ప్రభావం పరంగా చూసినా వారు కీలక పాత్రధారులు. కానీ ఆశ్చర్యకరంగా, ఇప్పటివరకు వారికి తగిన రాజకీయ గౌరవం దక్కలేదు. బీసీల కోసం బలమైన చట్టాలు, నిర్ణయాలు పార్లమెంట్‌లో ఆమోదించబడ్డ ఉదాహరణలు చాలా అరుదు. కాంగ్రెస్‌పార్టీ దాదాపు ఆరు దశాబ్దాలకు పైగా ఈ దేశాన్ని పాలించింది. కానీ ఆ కాలంలో బీసీల కోసం ఒక ప్రత్యేకమైన, సుస్థిరమైన బిల్లును తీసుకురావడంలో విఫలమైంది. రిజర్వేషన్లను కాపాడేలా తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే ప్రయత్నం చేయడంలో వెనకబడిపోయింది. ఇది బీసీలలో పెద్ద ఆవేదనగా మారింది. ఇప్పటిరోజుల్లో రాహుల్ గాంధీ రోడ్ల మీద 'రాజ్యాంగాన్ని కాపాడాలి, సామాజిక న్యాయం జరగాలి' అని తరచుగా చెబుతున్నారు. కానీ అదే విషయాన్ని పార్లమెంట్‌లో బలంగా ఎందుకు చెప్పలేకపోతున్నారు? ఉదాహరణకు తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన కామారెడ్డిలో బహిరంగ సభలో మాట్లాడుతూ 'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తాం' అని ప్రకటించారు. నిజంగా అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీలో బిల్లును కూడా ఆమోదించారు. కానీ ఆ బిల్లును రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్పించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడంలో మాత్రం ఒక్క అడుగు కూడా వేయలేదు. రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు ఆమోదం ఒక దశ మాత్రమే. దానిని రాజ్యాంగ పరిరక్షణలోకి తేవడం అత్యవసరం. కానీ ఆ పని జరగకపోవడంతో బీసీలు కాంగ్రెస్ చిత్తశుద్ధిని సందేహిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో బీసీల కోసం ఒకరోజు దీక్ష చేశారు. అది కేవలం తెలంగాణ బీసీలకే కాకుండా దేశవ్యాప్తంగా బీసీల సమస్యలను ప్రతిబింబించింది. అలాంటి సమయంలో జాతీయ నాయకుడిగా రాహుల్ గాంధీ ఆయన పక్కనే ఉండాల్సింది. కానీ ఆయన గైర్హాజరు కావడం 'బీసీల పట్ల నిజమైన చిత్తశుద్ధి ఎక్కడుంది?' అనే ప్రశ్నను మరింత బలంగా నిలబెట్టింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి బీసీల కోసం నిరసన చేస్తున్నప్పుడు జాతీయ నాయకుడు దూరంగా ఉండటమే బీసీలలో అసంతృప్తిని పెంచింది.


రాహుల్ గాంధీ

భారతదేశంలో ఉన్న అత్యున్నత పదవులు ఇప్పటి వరకు ఎక్కువగా ఎలైట్ వర్గాలకేపరిమితం అయ్యాయి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని వంటి పదవుల్లో ఒక బీసీకి కూడా స్థానం దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ ఇన్ని దశాబ్దాల పాటు అధికారంలో ఉన్నప్పటికీ ఒక బీసీని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా కూడా నిలబెట్టలేదు. ఇది బీసీ సమాజంలో గాయాన్ని మరింతగా ముద్ర వేసింది. మీరు మాటల్లో సామాజిక న్యాయం అంటారు, కానీ పదవుల్లో ఆ న్యాయం ఎందుకు కనబడదు అని వారు ప్రశ్నిస్తున్నారు. రాహుల్ గాంధీ బీసీలకు ఇచ్చే హామీలు, కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలవుతున్నాయా అన్నది ప్రజలు పరిశీలిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి దాదాపు ఇరువై నెలలు పూర్తయ్యాయి. ఈ కాలంలో బీసీల కోసం ఏం జరిగిందని అడిగితే స్పష్టమైన సమాధానం లేదు. బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించామని చెప్పారు కానీ అవి పూర్తిగా ఖర్చయ్యాయా అన్న సందేహం ఉంది. కార్పొరేషన్లలో పదవులు అన్నీభర్తీ అయ్యాయా? సేవాకులాలు, ఉత్పత్తి కులాలకు సరైన సహాయం అందిందా? ఇవన్నీ ఇంకా సమాధానం లేని ప్రశ్నలుగానే ఉన్నాయి. ఇంత కాలం పాలన సాగినా బీసీల జీవన ప్రమాణాల్లో గణనీయమైన మార్పు కనబడకపోవడంతో కాంగ్రెస్ నిజంగా బీసీలను గుర్తిస్తున్నదా అనే అనుమానం కలుగుతోంది. బీసీలు ఒక పెద్ద ఆశతో కాంగ్రెస్ వైపు చూశారు. రాహుల్ గాంధీ చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలు నెరవేరతాయని వారు నమ్మారు. కానీ ఇప్పుడు ఆ నమ్మకం కుంగిపోతోంది. కార్పొరేషన్ల నిధులు అరకొరకగా ఖర్చు చేయడం, పదవులు అరకొరకగాఇవ్వడం, ఉపాధి రుణాలు, పరిశ్రమల విధానాల్లో బీసీలకు ప్రాధాన్యం లేకపోవడం ఇవన్నీ బీసీలను నిరాశలో ముంచుతున్నాయి. ఒకవేళ నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికీ కొంత ఫలితం కనబడేది. ఇంకో ప్రధాన అంశం ఏమిటంటే, రాహుల్ గాంధీకి జాతీయ నాయకుడిగా ఒక బాధ్యత ఉంది. ఆయన కేవలం రోడ్ల మీద పాదయాత్రలు చేయడం, సభల్లో ప్రసంగాలు ఇవ్వడం మాత్రమే కాదు. కాంగ్రెస్ పార్టీ పాలిస్తున్న రాష్ట్రాల్లో బీసీలకు ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా లేదా అన్నది ఆయన గమనించాలి. తెలంగాణలో రిజర్వేషన్ బిల్లు కేంద్రంలో అగ్నిపరీక్ష ఎదుర్కొంటున్నప్పుడు ఆ బిల్లును అమలు చేయించే వరకు ఆయన కృషి చేయాలి. రాష్ట్రాల్లో బీసీ బడ్జెట్ నిజంగా ఖర్చవుతోందా లేదా అని ఆయన ప్రశ్నించాలి. కానీ ఆయన ఆ పాత్రలో కనబడకపోవడం మరోసారి బీసీలలో అనుమానం పెంచుతోంది. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ తరచుగా "రాజ్యాంగాన్ని కాపాడాలి" అని చెబుతున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 నుండి 21 వరకు సమానత్వ హక్కులు, స్వేచ్ఛ హక్కులు, జీవన హక్కులు ఉన్నప్పటికీ బీసీలకు అవి పూర్తిగా దక్కుతున్నాయా అన్నది పరిశీలించాలి. సమానత్వం అన్న పదం పుస్తకాలలో ఉండటం సరిపోదు. అది రాజకీయాల్లో, అధికార పదవుల్లో, నిర్ణయాలలో ప్రతిబింబించాలి. కానీ ఇప్పటి వరకు బీసీలు ఆ అనుభవం పొందలేకపోయారు. ప్రజాస్వామ్యం కాపాడాలంటే రాహుల్ గాంధీ నిజంగా పార్లమెంట్‌లో బీసీల కోసం నిలదీయాలి. ఒకరోజు అయినా బీసీలకు మద్దతుగా స్పష్టమైన బిల్లు ప్రవేశపెట్టాలి. లేకుంటే ఆయన నినాదాలు ఎన్నికల మసాలాగా మారిపోతాయి. తెలంగాణ బీసీలు కూడా ఇప్పుడు అదే ప్రశ్నిస్తున్నారు. మీరు కామారెడ్డిలో రిజర్వేషన్లు ఇస్తామని చెప్పారు, అసెంబ్లీలో బిల్లు పెట్టారు, కానీ ఢిల్లీలో ఒత్తిడి ఎందుకు చేయలేకపోతున్నారు? రేవంత్ రెడ్డి దీక్షలో ఎందుకు పాల్గొనలేదు? కాంగ్రెస్ పార్టీ ఇరువై నెలల పాలనలో బీసీల కోసం ఒక పెద్ద అడుగు ఎందుకువేయలేదు? మొత్తానికి రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ బీసీలపట్ల చూపుతున్న వైఖరి ఎన్నికల నినాదాల వరకే పరిమితమైందన్న భావన బలపడుతోంది. బీసీ సమాజం ఇన్ని ప్రశ్నలు అడుగుతోంది. నిజంగా బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికీ ఆలస్యం చేయకుండా పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలి. రాష్ట్రాల్లో హామీల అమలును నిర్ధారించాలి. లేకపోతే కాంగ్రెస్ మాటలను కేవలం ఓట్ల కోసం వేసిన జాలరుగా భావించి దూరమవుతారు. •

5_5.qxd 9/15/2025 12:20 AM Page 1



# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఘనంగా ఎస్పీకి వీడ్కోలు పలికిన పోలీసు సిబ్బంది

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా పోలీసు సిబ్బంది ఆదివారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ దామోదర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. విజయనగరం జిల్లాకు ఆయన బదిలీ కావడంతో ఈ వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ దామోదర్ పోలీసు సిబ్బందితో కలిసి నిర్వహించిన విధులను గుర్తుచేసుకున్నారు.

## బీజేపీలో చేరిన పోతుల సునీత దంపతులు

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలో చేరికలు పెరిగాయి. గతంలో వైసీపీ పార్టీ నుంచి గెలిచిన వారు ఓడిపోయిన వారు ఆ పార్టీకి రాజీనామా చేసి కూటమిలోని పార్టీలలో చేరిపోతున్నారు. ఈ క్రమంలో వైసీపీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన పోతుల సునీత దంపతులు ఆదివారం బీజేపీలో చేరారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో పోతుల సునీత, పోతుల సురేష్ పార్టీలో చేరగా వారికి నడ్డా పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కాగా పోతుల సునీత 2017లో టీడీపీ నుంచి మొదటి సారి ఎమ్మెల్సీగా గెలవగా, 2014 ఎన్నికల్లో చీరాల నుంచి టీడీపీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019లో చీరాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు ప్రయత్నించింది. అయితే టీడీపీ టిక్కెట్ ఇవ్వకపోవడంతో 2020లో రాజీనామా చేసి నాటి అధికార వైసీపీలో చేరింది. అనంతరం ఆమెకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలోకి చేర్చుకుని ఎమ్మెల్సీ ఇచ్చారు. సంవత్సరం కిందట కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసింది. అయితే ఇంత వరకు శాసనమండలి చైర్మన్ మోషన్ రాజు ఎమ్మెల్సీ పదవికి రాజీనామా అది ఇంకా ఆమోదం తెలుపలేదు. అయితే మొదట ఆమె తిరిగి టీడీపీలో చేరనున్నట్లు వార్తలు వచ్చినప్పటికి చివరికి బీజేపీలో చేరిపోయారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలు నగర పరిధిలోని పేర్నమిట్ట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. నగరంలోని సమతా నగర్‌కు చెందిన రాయిని శేషయ్య బైక్‌పై ద్విచక్ర వాహనంపై పేర్నమిట్ట వెళ్తుండగా ఇన్నోవా వాహనం ఢీకొట్టింది.గమనించిన స్థానికులు తీవ్రంగా గాయపడిన శేషయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. ఘటనపై ఒంగోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సీఎం సహాయ నిధి నుంచి 394 మందికి సాయం




**చీమకుర్తి,సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

నియోజకవర్గంలో పేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి 394 మందికి 2 కోట్ల 23 లక్షల 93 వేల రూపాయలు మంజూరు చేయించామని సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్ తెలిపారు. మరో నాలుగు రోజుల్లో లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి అందజేస్తామని వారు తెలిపారు. చీమకుర్తి పట్టణంలో సూర్య నగర్, క్రిస్టియన్ పాలెం,దీన్నేపురం, ఏకల్య నగర్ లలో ఆదివారం ఏర్పాటైన సభలకు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముప్పూరి చలమయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బిఎన్ వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్)కింద మంజూరైన 21 మంది లబ్ధిదారులకు 15,58,148 లక్ష రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. మద్దిపాడు ఏఎంసి చైర్ పర్సన్ మన్నం ప్రసాదరావు, జనసేన పార్టీ అధ్యక్షులు తాతినేని శ్రీరామ్, చీమకుర్తి సొసైటీ అధ్యక్షులు పూనాటి వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, రావిపాటి రాంబాబు, కందిమల్ల గంగాధర్‌రావు, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, నర్రా నాగరాజు, జనసేన నాయకులు రామకృష్ణారెడ్డి, సురేష్, బ్రహ్మయ్య, కృష్ణ, శ్రీకాంత్, గణ ,దుర్గ,అనిల్ , హేమంత్, అంజి తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలులో రోశయ్య విగ్రహ ఆవిష్కరణ

### - ఆర్యవైశ్య నేతలకు ఘన స్వాగతం



**కనిగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఆర్యవైశ్యభవన్ వద్ద అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆర్యవైశ్య ముద్దబిడ్డ, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు ఘన స్వాగతం లభించింది. ఆర్యవైశ్య వాసవి సత్ర సముదాయాలజాతీయ అధ్యక్షులుదేవకి వెంకటేశ్వర్లు , కనిగిరి మాజీఆర్యవైశ్య మండల అధ్యక్షుడు రాచపూడి వెంకటేశ్వర్లు, కొలిపాకుల రమేష్,రాచర్లనరేష్, రాచపూడి సునీల్‌కుమార్ తదితరులు గజమాలతో స్వాగతం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు రోశయ్య ప్రజాసేవా తపన, రాజకీయ జీవితం, సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి రోశయ్య చూపిన కృషి తరతరాలకు స్పూర్తి దాయకమని అభిప్రాయ పడ్డారు.



## జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్‌రాజు



**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా ఎస్పీగా వి.హర్షవర్ధన్‌రాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన తిరుపతి ఎస్పీగా పనిచేస్తూ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆదివారం వేదమంత్రోచ్ఛరణల మధ్య పూజలు కార్యక్రమాలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ నేర నియంత్రణకు కృషి చేస్తామని మంచి పోలీసింగ్ అందిస్తామని అన్నారు. నూతన ఎస్పీని జిల్లాలోని పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఏపీలో కొత్తగా మూడు నియోజకవర్గాలు ఏర్పాటు

### - ఆ నియోజకవర్గాలన్ని పక్క జిల్లాలోకి

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త జిల్లాల ఏర్పాటు జిల్లాల సరిహద్దుల మార్పు, కొత్త రెవెన్యూ డివిజన్లు, కొత్త మండలాలు, గ్రామాల పేర్ల మార్పు వంటివి తెరపైకి వచ్చాయి. ఈ మేరకు మంత్రుల కమిటీకి ప్రతిపాదనలు అందుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జిల్లా విభజనపై ఏర్పడిన గందరగోళాన్ని సరిదిద్దాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. అసెంబ్లీ సమావేశాలకు ముందే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఉప సంఘం లక్ష్యంగా భావిస్తుంది. కొత్త జిల్లాల ఏర్పాటుతో పాటు మండలాలు, గ్రామాల సరిహద్దులు, పేర్ల మార్పులపై కూడా అధ్యయనం చేస్తున్నారు. ఈ విషయమే ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాల్లో కలెక్టర్లు కూడా అర్జీలు తీసుకుంటున్నారు. కానీ రెండు మూడు జిల్లాల ఏర్పాటయ్యే అవకాశం ఉందంటున్నారు. కొన్ని చోట్ల హద్దులు మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే జనగణన ఉండటంతో 2026 జనవరి 1 నుంచి 2027 మార్చి 31 వరకు జిల్లాలు, మండలాలు గ్రామాల సరిహద్దులు పేర్ల మార్పులకు వీలుండదు అంటున్నారు. 2025 డిసెంబర్ 31లోగా అవన్నీ పూర్తిచేసి అమల్లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ప్రకాశం జిల్లా మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. గిద్దలూరు, కనిగిరి, దర్శి,మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాలతో మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. బాపట్ల జిల్లాలోని అద్దంకి,నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గాలను తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని అంటున్నారు.ఈ రెండు నియోజకవర్గాలను ప్రకాశం జిల్లాలో కలిపితే ఒంగోలు, కొండపి, సంతనూతలపాడుతో కలిపి మొత్తం ఐదు నియోజకవర్గాలు అవుతాయి. దీనివల్ల రెండు జిల్లాలు సమానంగా ఉంటాయని అంటున్నారు. అమరావతిని కేంద్రంగా చేసుకుని కొత్త అర్బన్ జిల్లాను ఏర్పాటుచేసే ఆలోచనలు జరుగుతున్నాయి. రాజధాని ప్రాంతంలోని 29 గ్రామాలు, గుంటూరు జిల్లాలోని మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటితో పాటు పెద్దకూరపాడు, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలు కూడా అమరావతికి దగ్గరగా ఉన్నాయి. ఈ ప్రాంతాల అన్నింటిని కలిపి కొత్త అర్బన్ జిల్లాగా చేస్తే ఐదు నియోజకవర్గాలు అవుతాయి. గుంటూరు జిల్లాలో గుంటూరు తూర్పు, పశ్చిమ ప్రత్తిపాడు, పొన్నూరు,తెనాలినియోజకవర్గాలను కలిపితే ఐదు నియోజకవర్గాలు అవుతాయి. ప్రస్తుతం కృష్ణా జిల్లాలో ఉన్న గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాలను ఎన్టీఆర్ జిల్లాలో కలపవచ్చు. ఈ రెండు నియోజకవర్గాలు విజయవాడ నగరంలో కలిసి ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ తూర్పు, పశ్చిమ మధ్య తిరువూరు, మైలవరం, గన్నవరం, పెనమలూరుతో కలిపి మొత్తం ఏడు నియోజకవర్గాలు అవుతాయి. కృష్ణ జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉండే అవకాశం ఉంది. ఈ మార్పుల వల్ల జిల్లాల స్వరూపం మారుతుంది. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. రంపచోడవరం, చింటూరు డివిజన్‌లోని నాలుగు మండలాలను కలిపి కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. రంపచోడవరం నుంచి పాడేరుకు 187 కిలోమీటర్లకు పైగా దూరం ఉంది. దీని వల్ల పరిపాలన పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కొత్త జిల్లా ఏర్పాటుతో ప్రజలకు మరింత చేరువగా పరిపాలన అందుతుందని ఆశిస్తున్నారు. విశాఖపట్నం జిల్లాలో శృంగారపుకోట నియోజకవర్గాన్ని చేర్చడం, తూర్పుగోదావరి జిల్లాలో మండపేట నియోజకవర్గాన్ని కలపాలి, కాకినాడ జిల్లాలోకి రామచంద్రాపురం నియోజకవర్గాన్ని తేవాలి. అలాగే కైకులూరు నియోజకవర్గాన్ని కృష్ణ జిల్లాలోకి చేర్చాలి. రైల్వే కోడూరును తిరుపతి జిల్లాలో చేర్చాలి అనే ప్రతిపాదనలు ఉన్నాయి.


# నెట్‌ను నెట్టేశారు.. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే ఇదే తంతు

- ఆగిపోయిన ఆన్‌లైన్ బోధన
- హాట్‌స్పాట్ ఆన్ చేసి యాప్‌లో నమోదు
- నిరూపయోగంగా ట్యాబ్‌లు, స్మార్ట్ టీవీలు
- ఇది ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ తీరు

**ఒంగోలు, ప్రభాతవార్త**

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులకు, ఆన్‌లైన్ బోధనను అందించేందుకు గత వైసీపీ ప్రభుత్వం వినూత్న సంస్కరణలు అమల్లోకి తీసుకువచ్చింది. ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ సిలబస్, టోఫెల్ 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ తదితరులను చేరువ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వీటికి మంగళం పాడేలా అడుగులు వేస్తుంది. ప్రైవేటు వ్యవస్థకు ప్రాధాన్యతనిస్తూ సర్కారు బడులను నిర్వీర్యం చేస్తుందనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఏ ప్రభుత్వ స్కూల్‌లో నెట్ పనిచేయడం లేదనే విషయం విస్మయానికి గురి చేస్తుంది. ప్రభుత్వ విద్యాసంస్థను నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం పావులు కదుపుతుందనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ఈ పరిణామాల క్రమంలో హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్లలో హాట్‌స్పాట్‌పాట్‌ను ఆన్ చేసుకుని యాప్‌లో నమోదు చేస్తున్న పరిస్థితి నెలకొంది.మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్స్ అరకొరగా వస్తుండడంతో అక్కడ సమస్య తప్పడం లేదు. ఇంటర్నెట్ నిలిచిపోవడంతో ఆ పాఠశాలలో ఇంటరాక్టివ్, ఫ్లాట్ ప్యానల్స్, స్మార్ట్ టీవీలను పక్కన పడేశారు. దీంతో అవి నిరూపయోగంగా మారుతున్నాయి.ప్రభుత్వ పాఠశాలలో హెడ్ మాస్టర్లు, ఉపాధ్యాయులు తమ సెల్‌ఫోన్లోని హాట్‌స్పాట్‌ను ఆన్ చేస్తున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరు,మధ్యాహ్న భోజన వివరాలు,బాత్రూమ్ ఫొటోలు, మార్కుల ఎంట్రీ, లెసెన్ వీడియోలను షేర్ ఈట్ ద్వారా ప్లే చేయాల్సి ఉంటుంది. అయితే డేటా మొత్తం యాప్‌ల నమోదుకే సరిపోతుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్నెట్ సౌకర్యాన్ని పూర్తి స్థాయిలో కల్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ఆన్‌లైన్ బోధనకు నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. తొలుత అన్ని స్కూళ్లల్లో ఏపీ ఫైబర్ నెట్, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, జియో తదితర సంస్థలతో ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసి అందులో పాఠాల కంటెంట్‌ను అప్లోడ్ చేసి ఇంటికెళ్లి చదువుకునే అవకాశాన్ని కల్పించారు. స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేశారు. 1నుంచి 5వ తరగతి విద్యార్థులకు స్మార్ట్ టీవీలు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఐఎఫ్‌టీల ద్వారా బోధనను శ్రీకారం చుట్టారు.

# విశాఖలో కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసిన బీజేపీ నేత డాక్టర్ ఏలూరి...



**ఒంగోలు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ చేపట్టిన సారథ్యం రాష్ట్రవ్యాప్త పర్యటన ఆదివారం ముగిసింది.. ఈ సందర్భంగా విశాఖలో భారీ బహిరంగ సభ నిర్వహించారు.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్రమంత్రి జేపీ నడ్డా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.. అనంతరం ఫార్మా పరిశ్రమల అభివృద్ధి గురించి సమావేశం జరిగింది.. ఈ సమావేశంలో నడ్డా పాల్గొన్నారు.. ఈ సందర్భంగా పీవీఎన్ మాధవ్ తో కలిసి బీజేపీ నేత, ప్రముఖ ఫార్మా కంపెనీ అధినేత డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి నడ్డాను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో ఫార్మా రంగ అభివృద్ధి,విస్తరణపై చర్చలు జరిపారు..డాక్టర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ,నడ్డా ఆధ్వర్యంలో భారత ఫార్మా రంగం అద్భుతంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు..ఎన్నడూ లేనివిధంగా గత పదేళ్లలో భారత ఔషధ ఎగుమతులు గణనీయంగా పెరిగాయని తెలిపారు..ఆంధ్రప్రదేశ్‌లో ఫార్మా రంగానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని.. విశాఖపట్నం దేశవ్యాప్తంగా ఫార్మా హబ్‌గా ఎదగగల సామర్థ్యం కలిగి ఉంది. దీనికి కేంద్రం నుంచి మరింత మద్దతు లభిస్తే,పరిశ్రమల విస్తరణ వేగవంతమవుతుంది, వేలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని పేర్కొన్నారు..అదేవిధంగా మెడికల్ డివైసెస్ అభివృద్ధికి కేంద్రం నుంచి ప్రత్యేక సహకారం ఇవ్వాలని నడ్డా గారిని అభ్యర్థించానన్నారు. వైద్యరంగంలో సాంకేతికతను పెంచడానికి, నాణ్యమైన పరికరాలను దేశీయంగానే తయారు చేసుకోవడానికి ఇది కీలకమని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 36 రకాల క్యాన్సర్ మందులపై జీఎస్టీ రద్దు చేసినందుకు నడ్డాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం వేలాది రోగులకు ఆర్థిక భారం తగ్గించడమే కాక,చికిత్స సులభతరం చేస్తుందని అభిప్రాయపడ్డారు. విశాఖపట్నం భవిష్యత్తులో దేశ ఫార్మారంగానికి ప్రధాన కేంద్రంగా నిలవాలని.. కేంద్రం నుంచి సహకారం మరింత పెరిగితే ఈ లక్ష్యం త్వరలోనే నెరవేరుతుంది అని విశ్వాసం వ్యక్తం చేశారు ఏలూరి.

# సీజ్ చేసిన అక్రమ రేషన్ బియ్యం విచారణ నత్తనడక

### - నివేదిక ఇచ్చి చేతులు దులుపుకున్న అధికారులు

**కనిగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలో వెలుగులోకి వచ్చిన రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో అధికారులు చూపుతున్న అలసత్వంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని ఒక రేషన్ షాపు వద్ద అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 232 బస్తాల బియ్యాన్ని ప్రజా సంఘాలు పట్టుకొని అధికారులకు అప్పగించగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సీజ్ చేశారు. సీజ్ చేసిన వాటిలో 136 బస్తాలు మధ్యాహ్న భోజన పథకానికి కేటాయించినవి, 96 బస్తాలు తెల్లకార్డుదారుల రేషన్ బియ్యం, పేద పిల్లల కోసం కేటాయించిన బియ్యం, పేద ప్రజలకు ఇచ్చే రేషన్ బియ్యం దోపిడికి గురవడం స్థానికుల్లో ఆగ్రహానికి దారితీసింది. అయితే, ఘటన బయటపడి 15 రోజులు గడిచినా విచారణ ముందుకు కదలకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చి పక్కకు తప్పుకోవడం, అక్రమ రవాణా వెనుక ఉన్న పెద్దలపై చర్యలు తీసుకోకపోవడం ఎవరినో కాపాడుతున్నారా..? అన్న చర్చనీయాంశంగా మారింది. అసలు ఈ బియ్యం ఏ రేషన్ షాపు డీలర్‌ది..? మధ్యాహ్న భోజన పథకం బియ్యం ఏ పాఠశాల నుంచో..? అనే ప్రశ్నలకు సమాధానం రాకపోవడం విచారణపై మరింత అనుమానాలు రేకెత్తిస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధికారులు సీజ్ చేసి గోదాముకు తరలించిన అక్రమ రేషన్ బియ్యం విచారణ చేసి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



# జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు ప్రమాణ స్వీకారం మహోత్సవం

### - పాల్గొన్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, మాజీ రాజ్యసభ సభ్యులు టిజే వెంకటేష్

**దర్శి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా దర్శికి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకులు బొగ్గవరపుసుబ్బారావు ఆదివారం ప్రమాణ స్వీకారం మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.ముందుగా పొదిలి రోడ్డులోని దద్దాలమ్మ గుడి దగ్గర నుండి అద్దంకి రోడ్డులోని శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపం వరకు భారీ బైక్ ర్యాలీ ఆర్యవైశ్య సంఘ నాయకులు,కార్యకర్తలు. అనంతరం శ్రీనివాసపద్మావతి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రకాశం జిల్లాలోనిఆర్యవైశ్య సంఘం నాయకులు, కార్యకర్తలు,మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా వచ్చిన రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం మహాసభ గౌరవఅధ్యక్షులు,

**మాజీ మంత్రి టీజీ వెంకటేష్ :**

మరో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు శిద్దా లక్ష్మీ పద్మావతిలనుగజమాలతోసత్కరించిదర్శి,జిల్లాఆర్యవైశ్య సంఘం నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులకి ఎల్లప్పుడూ అండగా ఉంటామని, ఆర్యవైశ్యుల సమస్యల కోసం ముందు ఉంటామని వారు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్,కడియాలలలిత్‌సాగర్,దర్శినియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ,దర్శిలోనిఆర్యవైశ్య సంఘం నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.









6_6.qxd 9/15/2025 12:21 AM Page 1



# అక్రమ వేటపై మత్స్యకారుల బహిష్కరణ



**సింగరాయకొండ,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త**
మండలంలోని పాకల, ఊళ్ళపాలెం తీర ప్రాంత మత్స్యకార గ్రామాల్లో శనివారం దండోరా మోగింది. చెన్నై రాష్ట్రము కడలూరు ప్రాంతాల నుండి వచ్చిన పెద్ద సోనా బోట్లు సముద్రంలోకి దూసుకువచ్చి అక్రమ వేట సాగిస్తున్నాయని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆ సోనా బోట్లు దెబ్బకు వలల దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని, వేగంగా దూసుకు వెళ్తన్న ఈ బోట్లు స్థానిక బోట్లను చిదిమేస్తూ మత్స్య సంపదను దోచుకెళ్తున్నారు.అక్రమ వేట ఆపే వరకు మూడు రోజులపాటు వేటను బహిష్కరించాలని నిర్ణయించినట్లు ప్రకాశం, నెల్లూరు జిల్లాల మత్స్యకార సంఘాల నాయకులు తెలిపారు. చిన్నతరహా మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటోందని, అధికార యంత్రాంగం తక్షణమే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## అద్దంకి నియోజకవర్గంలో వైసీపీ ప్రతి కార్యకర్త నా కుటుంబ సభ్యుడే

## పార్టీ నూతన ఇన్చార్జి డాక్టర్ సురేష్ కుమార్

- త్వరలో అన్ని గ్రామాలు పర్యటిస్తా - ప్రతి కార్యకర్తను కలుసుకుంటా
- అంతర్గత లోపాలను సరి చేద్దాం - పార్టీ విజయానికి పాటుపడదాం
- అద్దంకిలో త్వరలో శాశ్వత స్థిర నివాసం - వైద్యశాల ఏర్పాటు





**అద్దంకి రూరల్ సెప్టెంబర్ 14,ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గంలోని వైసీపీ కార్యకర్తలను పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అభిమానులను తన కుటుంబ సభ్యులుగా పరిగణించి ఆదరిస్తానని అద్దంకి నియోజకవర్గ వైసిపి నూతన ఇన్చార్జి డాక్టర్ చింతలపూడి సురేష్ కుమార్ అన్నారు. పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి అద్దంకి నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగించిన నేపథ్యంలో ఆదివారం నరసరావుపేటలో ఉంటున్న అద్దంకి నియోజకవర్గంలోని కార్యకర్తలను నేతలను సురేష్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి అద్దంకి నియోజకవర్గం అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తను నాయకుడిగా అద్దంకిలో అడుగు పెట్టడం లేదని వైసీపీ కుటుంబ సభ్యుడిగా మాత్రమే అద్దంకి వస్తున్నానన్నారు. త్వరలో నేను నియోజకవర్గ బాధ్యతలు స్వీకరించి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలుపర్యటిస్తానని ప్రతికార్యకర్తకుటుంబాన్ని కలుసుకుంటా నని తెలిపారు. పార్టీలో సంస్థ కథ లోపాలు ఏమైనా ఉంటే వాటిని అందరి సహకారంతో శాశ్వతపరిష్కారం వైపు అడుగులు వేద్దామన్నారు.పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త ఐక్యంగా కృషి చేయాలన్నారు.

### ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

అద్దంకి నియోజకవర్గంలోని వైసీపీ కార్యకర్తల కష్టసుఖాల్లో ఒక కుటుంబ సభ్యుడిగా అండగా నిలుస్తానని డాక్టర్ చింతలపూడి సురేష్ కుమార్ అన్నారు. త్వరలో అద్దంకిలో పార్టీ కార్యాలయాల్లో అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నానని సురేష్ కుమార్ తెలిపారు.

### అద్దంకిలో శాశ్వత నివాసం వైద్యశాల ఏర్పాటు

పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని నూతన ఇంచార్జ్ సురేష్ కుమార్ తెలిపారు. త్వరలో అద్దంకిలో శాశ్వత నివాసం వైద్యశాల ఏర్పాటు కూడా ప్రణాళికలు రూపొందిస్తున్నారని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త సంపూర్ణ సహకారంతో రానున్న ఎన్నికల్లో అద్దంకి గడ్డపై వైసీపీ జెండా ఎగురవేసి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని సురేష్ కుమార్ పిలుపునిచ్చారు.సురేష్‌కుమార్ కలిసిన వారిలో డాక్టర్ కారసాని శ్రీనివాస్ రెడ్డి, మాదిరెడ్డి నరసింహారెడ్డి నాగభూతు రామాంజనేయులు, ఇల్లూరి యోగి రెడ్డి, మాగులూరి రమణారెడ్డి,ఇప్పల అయ్యప్పరెడ్డి సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి అద్దంకి కొరిశపాడు మండలాలకు చెందిన పలువురు నాయకులు ఉన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ఆర్యవైశ్య నాయకులకు ఘన సత్కారం




**సంతనూతలపాడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
వాసవి క్లబ్ ప్రతినిధులైన జి.శరత్‌బాబు, చెక్కా సుబ్బారాయుడు, కొంజేటి సురేష్‌బాబు, జి.బ్రహ్మానందం, పి.రాజేష్‌లు జిల్లా ఆర్యవైశ్య సంఘం సహాయ కార్యదర్శులు ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడంతో సంతనూతలపాడు వాసవి క్లబ్ ప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు. దర్శిలో ఆదివారం జరిగిన జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన ప్రమాణ స్వీకారం వేడుకల్లో వాసవి క్లబ్ ప్రతినిధులు శరత్ బాబు, సుబ్బారాయుడు సహాయ కార్యదర్శులుగాను, సురేష్ బాబు, బ్రహ్మానందం, రాజేష్‌లు ఉపాధ్యక్షులుగా ప్రమాణం చేశారు. రాష్ట్ర మంత్రి టీజీ భరత్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ ముఖ్య అతిథులుగా పాల్గొన్న జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రమాణ స్వీకారం వేడుకల్లో జిల్లా అధ్యక్షులుగా బొగ్గవరపు సుబ్బారావు ప్రమాణ స్వీకారం చేశారు. వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాదరావు, వాసవి క్లబ్ జిల్లా డిప్యూటీ గవర్నర్ అమరా వేణు, జిల్లా ప్రతినిధి జివిఎల్ ప్రసాదరావు, సంతనూతలపాడు వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, మాజీ అధ్యక్షులు జి.ఐఢి నారాయణ తదితరులు జిల్లా ఆర్యవైశ్య సంఘం సహాయ కార్యదర్శులు, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వాసవి క్లబ్ ప్రతినిధులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

## మై టీడీపీ యాప్ నమోదుపై టీడీపీ కార్యకర్తలకు అవగాహన

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం నాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో టీడీపీ ప్రతినిధులు మైటీడీపీ యాప్ నమోదుపై టీడీపీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు మల్లవరపు రామకృష్ణారావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి సురేష్‌బాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు నార్నే మాధవిలత సంతనూతలపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు బొద్దు శంకర్‌బాబు, బాపట్ల పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామిచౌదరి, బాపట్ల పార్లమెంట్ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తన్నీరు శ్రీనివాసరావు, టీడీపీ నేతలు పోసినేనిశ్రీరామ్మూర్తి, రావుల సుబ్బారావు, నల్లగట్ల సుబ్బారావు, నలమోతు శ్రీనివాసరావు, నాదెండ్ల ఆంజనేయులు, కుంచాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## అద్దంకి వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ ఆశోక్‌కుమార్‌కు అభినందనలు








**అద్దంకి, సెప్టెంబరు 14, ప్రభాతవార్త**
అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి ఆశోక్‌కుమార్‌ను ఆదివారం నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన పార్టీ నేతలు,కార్యకర్తలు,కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సంతమాగులూరు మండలం నుండి మద్దిరెడ్డి నరసింహారెడ్డి,కొరిశపాడు మండలం నుండి మాజీ జడ్‌పిటిసి ముత్తవరపు రమణయ్య,మాజీ ఎంపిపి అన్నెంజిరెడ్డి,అద్దంకి నుండి వడ్లవల్లి ఆంజనేయులు, మణికేశ్వరంకు చెందిన రామిరెడ్డి, పోలిరెడ్డి తదితరులు ఆశోక్‌కుమార్‌ను కలిసి, దుశ్శాలవాలతో సత్కరించి,పూలమాలలతో అభినందించి,బోకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## అద్దంకి పట్టణంలో మూడు ప్రమాదాలు, నలుగురికి గాయాలు







**అద్దంకి , సెప్టెంబరు 14, ప్రభాతవార్త**
అద్దంకి పట్టణంలోని మార్కెట్‌యార్డు, రాజీవ్‌కాలనీ, భవానీ సెంటర్లలో అదివారం వేరు వేరుగా జరిగిన ప్రమాదాలలో పలువురు గాయపడ్డారు. రాంనగర్ వద్ద, బైక్,ఆటో ఢీకొన్న సంఘటనలో బైక్‌పై వెళుతున్న వేణు, రోహిత్‌కు గాయాలు అయ్యాయి. రాజీవ్‌కాలనీ వద్ద జంక్షన్ వద్ద బైక్‌పై నుండి జారిపడిన వడ్లమూడి వెంకటేశ్వరరావు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. భవానీ సెంటర్‌లో బైక్, లారీ ఢీకొన్న ప్రమాదంలో వై.అంజయ్యకు కాలికి తీవ్రగాయాలు అయ్యాయి. ఆయా ప్రమాదాలలో తీవ్రగాయాలు అయినవారికి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

## నెల రోజులపాటు గాలికుంటు టీకాల మాసోత్సవం

**అద్దంకి , సెప్టెంబరు 14 ప్రభాతవార్త**
అద్దంకి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు ఆధ్వర్యంలో అద్దంకి, కొరిశపాడు మండలాల పరిధిలోని పశుపోషకులకు అద్దంకి ఏరియా పశువైద్య శాఖ ద్వారా ఈనెల 15 నుండి వచ్చేనెల 15వరకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు డాక్టర్ బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది పశుపోషకుల వద్దకు వచ్చినప్పుడు వారికి సహకరించి, పశువులకు టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ టీకాల వలన పశువులకు జ్వరం రావడం, పాడిగేదలు పాలు తక్కువగా ఇవ్వడం లాంటివి వుండవని, డాక్టర్ పేర్కొన్నారు.

## విశ్వకర్మ జయంతిని జయప్రదం చేయండి



**జె.పంగులూరు , సెప్టెంబరు 14 ప్రభాతవార్త**
మండలంలోని పంగులూరు మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17న నిర్వహించనున్న శ్రీ భగవాన్ విశ్వకర్మ జయంతిని జయప్రదం చేయాలని మండల సంఘ అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మండలంలోని కస్యాపురం గ్రామంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం వద్ద సెప్టెంబర్ 17 విశ్వకర్మ జయంతి సందర్భంగా శ్రీ గాయత్రీ సమేత విశ్వకర్మ భగవానుని యజ్ఞ మహోత్సవం, మండల విశ్వబ్రాహ్మణ సేవా సంఘం 21వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల తాసిల్దార్ పి. సింగారావు, ఎస్సై బి. వినోద్ బాబు, గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల వెంకటరావు హాజరవుతున్నారు అన్నారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా పతాక ఆవిష్కరణ, విశ్వకర్మ భగవాన్ ని యజ్ఞం మహోత్సవం జరుగుతాయన్నారు. గత 20 సంవత్సరాలుగా సంఘానికి సేవలందించిన పలువురికి సన్మాన కార్యక్రమం, అనంతరం భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘీయులు, మండల ప్రజలకు ఆహ్వాన పత్రికలు పంపిణీ చేస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా మండల విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు మచ్చా. వెంకటేశ్వర్లు కోరారు.ఈ సమావేశంలో సంఘ గౌరవ అధ్యక్షులు తక్కెళ్ళపాటి రామకృష్ణ ,కార్యదర్శి తక్కెళ్ళ పాటి నాగేంద్రప్రసాద్, ట్రెజరర్ రావినూతల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కాజన. అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవతి భగవన్నారాయణ ఆర్యవైశ్య రాష్ట్ర అధ్యక్షునిగా

### నియామకం జరగడం అయినముక్కల గ్రామానికి గౌరవప్రదమైన గుర్తింపు



**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
కృషి, నిబద్ధత ఉంటే మనిషి ఎంతటి స్థాయికి ఎదగగలడో దేవతి భగవన్నారాయణ జీవితం సాక్ష్యంగా నిలిచింది. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం అయినముక్కల గ్రామం స్వర్గీయ దేవతి బాలకోటయ్య, వెంకట లక్ష్మమ్మల ఏకైక మగ సంతానం దేవతి భగవన్నారాయణ, చదువుకుంటున్న చిన్ననాటి నుండే చలాకిగా ఉండే భగవన్నారాయణ విద్యా, వాణిజ్య రంగాలలో ఎదిగి కృషి పట్టుదల నిబద్ధతతో ప్రత్యేక స్థానం సంపాదించారు. వ్యాపార రంగంలో తన ప్రతిభను చాటుకుంటూనే గ్రామీణ అభివృద్ధి, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, పేదలకు ఆర్థిక సహాయం, వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాల వంటి మరెన్నో సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో విశ్వాసాన్ని గెలుచుకున్నారు. వ్యాపార వృత్తిగా ఉన్నప్పటికి మానవ సేవ, మాధవసేవ తన ప్రవృత్తిగా చేసుకొని పలు సామాజిక ఆధ్యాత్మిక కార్యక్రమాలలో దేవతి, భగవన్నారాయణ విరాళాలు అందిస్తూ సామాజిక ఆధ్మాతిక సేవలో ముందుకు సాగారు. అదే క్రమంలో ఆర్యవైశ్య మహాసభలో క్రమంగా ఎదిగి, నాయకత్వ నైపుణ్యం ప్రదర్శించి, సమాజ సమస్యలు పరిష్కరించడంలో కృషి చేశారు. ఆయన కృషి నిజాయితీకి వచ్చిన గుర్తింపే ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలో రాష్ట్ర స్థాయి అధ్యక్షుడిగా నియమించబడడము. పెద్దదోర్నాల మండలం అయినముక్కల గ్రామానికి చెందిన వేవతి భవన్నారాయణ అది ప్రపంచ ఆర్యవైశ్య మహాసభలో రాష్ట్రస్థాయి అధ్యక్షునిగా నియమింపటం సామాన్యం కాదు కానీ ఆయన సేవలు గుర్తించి తెచ్చి పెట్టాయి. దేవతి భగవన్నారాయణ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం అయినముక్కల గ్రామానికి పేరు, ప్రతిష్ఠలు తెచ్చి పెట్టింది. గ్రామ ప్రజలు, ఆర్యవైశ్య సమాజ పెద్దలు, వ్యాపార వర్గాలు ఆయన నియామకాన్ని హర్షిస్తూ అభినందనలు తెలుపుతున్నారు. ఈ నియామకం పట్ల అయినముక్కల గ్రామం రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిందని ఇక్కడి ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయన నియామకం సమాజానికి, రాష్ట్రానికి, గ్రామానికి గర్వకారణమని ప్రతి ఒక్కరూ అభిప్రాయపడ్డారు. అయినముక్కల నుండి మంగళగిరి వెళ్లిన దేవతి భగవన్నారాయణ అక్కడ స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. వ్యాపార రంగంలో రాణించి డీబీఎన్ సంస్థలు నెలకొల్పాడు. దేవతి భగవన్నారాయణ ఆర్యవైశ్య కుటుంబంలో జన్మించి స్వశక్తితో అంచలంచెలుగా ఎదిగి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టరేట్ పొందారు. రియల్ ఎస్టేట్ రంగం,బిల్డరు,ఫైనాన్స్ రంగాలలో ఉన్నత స్థితికి చేరిన దేవతి భగవన్నారాయణ అందరికి అందుబాటులో ఉంటూ మంచి పేరు తెచ్చుకున్నారు. అటువంటి మంచి వ్యక్తి దేవతి భగవన్నారాయణ మరెన్నో పదవులు అందుకొని ఆధ్యాత్మిక,సామాజిక వాణిజ్య, ఆర్థిక,సేవరంగాల్లో రాణించాలని ఆశిద్దాం.

## గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు




**తాళ్లూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడు గ్రామంలో వెలిసిన జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం గంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పుచ్చకాయల విజయలక్ష్మీ అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వర శర్మ, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాతో పాటు పలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌ఏ కాటూరి ప్రసాదు సిబ్బంది పర్యవేక్షించారు.

## రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆత్రేయకు ఘన సత్కారం



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
గుంటూరులో ఆదివారం నాడు ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రధానోత్సవ వేడుకల్లో సంతనూతలపాడు మండలం చిలకపాడు హైస్కూల్ ఉపాధ్యాయులు పరాంకుశం మరుత్ కుమార్ ఆత్రేయను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు జే.శ్రీకాంత్ ప్రధాన కార్యదర్శి పి.పురుషోత్తమ శర్మ, కోశాధికారిగా కే.వెంకటసుబ్బారావు, కన్వీనర్ మంగళంపల్లి అంజిబాబు తదితరులు ఉపాధ్యాయులు పీఎం కే.ఆత్రేయను రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఎంపిక చేసి ఘనంగా సత్కరించారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఎంపికైన ఆత్రేయను పలువురు ఉపాధ్యాయులు ఈ సందర్భంగా అభినందించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పి.తక్కెళ్ళపాడు గ్రామంలో ఆదివారం నాడు టీడీపీ నేత ప్రేముల జక్రయ్య కుమార్తె ప్రేముల కుమారి, అల్లుడు ప్రకాశ్‌ల నిశ్చితార్థ వేడుకల్లో సంతనూతపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మండల టీడీపీ ప్రధానకార్యదర్శి రావులపల్లి సురేష్‌బాబు, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు నార్నే మాధవిలత, మాజీ సర్పంచ్ గ్రామ పార్టీ అధ్యక్షులు నలుమోతుశ్రీనివాసరావు,టీడీపీ నాయకులు వలేటితిరుపతిస్వామి,బి.వెంకటరావు, ఎన్.లక్ష్మీనారాయణ, ఎన్.రాజేష్,పి.లక్ష్మీనారాయణ, టి.చిన్నమాధవరావు,డి.శ్రీనివాసరావు, జి.హరికృష్ణ, ఈ.కమలహాసన్, పి.చిన్న, పి.లోకేష్ తదితరులు నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో ఉన్నారు.

## కొత్త కలెక్టర్ సారు మీరైనా లెక్కలు తేలుస్తారా..!

- బల్లికురవ మండలంలో ఉపాధి హామీ అవినీతి చిట్టా విప్పండి సారూ
- శ్రావణ, భాద్రపద ముహూర్తాలు దాటిపోయాయి
- పీడీ రెండు రోజులు ఉండి సాధించింది ఏమిటి
- తనిఖీలలో వెలుగు చూసిన అంశాలు ప్రజలకు చెప్పాల్సిందే
- పత్రికల కథనాల ఆధారంగా కోర్టుకు వెళ్లేందుకు సిద్ధం
- అవినీతి పెరిగిపోతే పరాయి దేశాలు తీరు చూస్తున్నారుగా






**బల్లికురవ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
కొత్త కలెక్టర్ సారు బల్లికురవ మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులలో అవినీతి అనకొండ లెక్కలు మీరైనా తేలుస్తారా అంటూ మండల ప్రజానీకం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులలో పతాక స్థాయికి చేరిన అవినీతి బాగోతం సామాజిక తనిఖీల బృందాల సాక్షిగా వెలుగు చూశాయి. ఆగష్టు 6,7 తేదీల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం అర్ధరాత్రి వరకు కొనసాగింది. మండలంలోని ఇరవై ఒక్క పంచాయతీల పరిధిలోని 32 గ్రామాలలో మూడున్నర కోట్లకు పైగా అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీ బృందాలు గుర్తించాయి. ప్రజా వేదికలో ఆయా గ్రామాల నేతలు ఉపాధి కూలీలు, స్థానిక నేతలు నానా రగడ సృష్టించారు. ప్రజా వేదికకు హాజరైన పీడీ విజయలక్ష్మీ సిబ్బందికి అరదండాలు అంటించారు. అంతటితో సరి.. చేయాల్సిందంతా చేసి మెక్కాల్సినదంత మెక్కి దోచుకొని దాచుకున్నా వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని ఓ చిరుద్యోగిని పత్రికల వారికి సమాచారం అందించాడంటూ దండించటం కొసమెరుపు. మండలంలో 21 పంచాయతీలలో రూ.12 కోట్ల వ్యయంతో 645 ఉపాధి హామీ పనులలో నెలకొన్న అవినీతి లెక్కలను ముగించారు. మరి ముహూర్త బలం చాలకనేమో వివరాలను వెల్లడించలేదు. శ్రావణమాసం వెళ్లిపోబోతుంది. బాద్రపద మాసంలోనైనా అవినీతిని కొత్త పుంతలు తొక్కించిన క్షేత్ర సహాయకుల చేతివాటాన్ని, ప్రభుత్వ సొమ్ము తిలాపాపం తలాపిడికెడు అన్న చందంగా బొక్కిన వారి నుండి ఎంత మేరకు కక్కిస్తారోనని మండల ప్రజలు వేచి చూశారు. భాద్రపద మాసం ముగిసిపోయింది. ఉపాధిహామీ పనుల అవినీతి ఆటకెక్కినట్లేనని ప్రజలు భావిస్తున్నారు. అవినీతి నిగ్గు తేల్చేందుకు పత్రికలలో వచ్చిన కథనాల ఆధారంగా కోర్టులకు వెళ్లేందుకు ప్రజలు సిద్ధపడుతున్నారంటే అవినీతిపై పోరుబాట ప్రారంభమైంది. పరాయి దేశాలలో పెరిగిపోయిన అవినీతి కారణంగా ప్రజల తిరుగుబాటు ఏ స్థాయిలో ఉందో చూస్తున్నారు కదా. అయినా మనలో స్పందన కలగదే. పనులలో వెలుగు చూసిన కోట్ల రూపాయల అవినీతిని వెలికి తీసేందుకు పాత కలెక్టర్ జిల్లా కలెక్టర్ వెంకట మురళి చీరాల ఆర్డీఓను కన్వీనర్‌గా, సంయుక్త కలెక్టర్ నాగిరెడ్డిని విచారణ అధికారిగా నియమించినందుకు సార్థకత ఏర్పడుతుంది అనుకున్నారు అంతా. ఆ కమిటి కూడా తవ్వింది కానీ పట్టింది ఏమిటో ఇంత వరకు చెప్పలేదు. కమిటీ సేకరించిన ఉపాధి హామీ లెక్కలను కొత్త కలెక్టర్ గారైన ప్రజలకు వెల్లడించాలని ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు. శృతిమించుతున్న అవినీతిపై పోరుబాటకు సిద్ధమవుతున్నారు. అక్షర కథనాలని సాక్ష్యాలుగా పొందుపరచుకుంటూ న్యాయస్థానాల మెట్లు ఎక్కేందుకు సిద్ధమవుతున్నారు. అవినీతి అధికారులు తస్మాత్ జాగ్రత్త.

## జగనన్న కాలనీ సమస్యలపై చైర్మన్ అబ్దుల్ గఫార్ ప్రత్యేక దృష్టి

- త్వరితగతిన పరిష్కారానికి హామీ



**కనిగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
జగనన్న కాలనీలోని మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ తెలిపారు. ఆదివారం ఆయన కాలనీలో పర్యటించి స్థానికులతో నేరుగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు రోడ్లు దెబ్బతిన్నాయని, వీధి దీపాలు లేవని,చెట్ల పొదలతోఇబ్బందులు ఏర్పడుతున్నాయని, స్మశానవాటిక స్థలం సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, కొంత మంది ప్రాంతాల్లో విద్యుత్ అందడం లేదని వివరించారు. చైర్మన్ వెంటనే స్పందించి విద్యుత్ దీపాల ఏర్పాటు, చెట్ల తొలగింపు, విద్యుత్ అంతరాయం సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని, స్మశానవాటిక స్థల సమస్యపై తహసీల్దార్‌తో చర్చించి పరిష్కారం చూపిస్తామని, రహదారి నిర్మాణంకోసం శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో మైనింగ్‌శాఖ నిధులు అందించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.

7_7.qxd 9/15/2025 12:23 AM Page 1



## జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 690 కేసులు పరిష్కారం



**గిద్దలూరు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త**
జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశముల మేరకు గిద్దలూరు కోర్ట్ ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్అదాలత్ నందు మొత్తం690 కేసులు పరిష్కరించి కక్షిదారులకు రూ.92,90,097లు అందించారు. లోక్అదాలత్ నందు రెండు బెంచ్‌లు ఏర్పాటు చేసి సివిల్ మరియు క్రిమినల్ కేసులను పరిష్కరించారు. సివిల్ బెంచ్‌కు ప్రిసైడింగ్ ఆఫీసర్ గా ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్, మెంబర్లుగా జి.ఆనంద్‌కుమార్ షేక్.ఫాజిల్ వ్యవహరించారు. క్రిమినల్ బెంచ్‌కు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె. భరత్ చంద్ర మెంబర్లుగా మోడి.పిచ్చయ్య మరియు వివిఎన్ సుధీర్ కుమార్ వ్యవహరించారు.

### పరిష్కరించబడిన కేసుల వివరములు...
లోక్ అదాలత్‌లో 16 సివిల్ కేసులకు రూ.69,67,639లు, 33 క్రిమినల్ కేసులకు రూ.18,05,938లు, 93 అడ్మిషన్ కేసులకు రూ.9,300లు, 540 పెట్టి కేసులకు రూ.54వేలు, ఒక బ్యాంకు పిఎల్‌సి కేసుకు రూ.4,50,000లు, 7 టెలిఫోన్ పిఎల్‌సి కేసులకు రూ.3,220 లు. మొత్తం 690 కేసులకు 92,90,097 రూపాయలు కక్షిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు బార్ అసోసియేషన్ కమిటీ మెంబర్లు, సీనియర్ జూనియర్ న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంకులు మరియు టెలిఫోన్ అధికారులు, కక్షిదారులు మరియు కోర్టుల సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి. మధుసూధనరావు పాల్గొన్నారు.

## రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**గిద్దలూరు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త**
ఉపాధ్యాయ సమస్యలపై ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు యూటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గిద్దలూరు మండల అధ్యక్షులు డాక్టర్ మొగ్రి.పిచ్చయ్య తెలిపారు. పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం రణభేరి కార్యక్రమానికి సంబంధించి గోడపత్రికావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా కార్యదర్శి ఎం సత్యనారాయణ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఆర్థిక, విద్యా రంగ సమస్యల సాధనకు ఈనెల 15 నుంచి 19 వరకు బైక్ జాత కార్యక్రమం నిర్వహించడం జరుగుతుదని, అప్పటికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించని ఎడల యూటీఫ్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 న విజయవాడలో రణభేరి కార్యక్రమం నిర్వహించడము జరుగుతుందన్నారు. ఆర్థిక సమస్యలపై పోరాటం నిర్వహించబోతున్నామన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటిన ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. ప్రధాన కార్యదర్శి ఈ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ డి.ఏలు, అరియర్స్, పిఆర్సీ వంటివి ఇవ్వకపోవడం ఉపాధ్యాయులను కలతకు గురి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షులు డాక్టర్ మొగ్రి.పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శి ఈ.వెంకటేశ్వర్లు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, యూటిఎఫ్ నాయకులు జయచంద్ర రెడ్డి, మండలశాఖ బాధ్యులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

### మార్కాపురం మెడికల్ కళాశాల ప్రభుత్వ నిర్వహణలోనే ఉండాలి - సిపిఎం డిమాండ్





**మార్కాపురం రూరల్, సెప్టెంబర్ 14,(ప్రభాతవార్త**
మార్కాపురం మెడికల్ కళాశాలను పూర్తిగా ప్రభుత్వ నిర్వహణలో కొనసాగించాలన్న డిమాండ్‌తో సిపిఎం జిల్లా బృందం ఆదివారం కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కె మాబు మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశం ప్రాంతానికి మెడికల్ కళాశాల అత్యవసరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో మెడికల్ కాలేజీని పూర్తిగా ప్రభుత్వం చేత పూర్తి చేస్తామని హామీ ఇచ్చిన, ఇప్పటి వరకు ఆ హామీ నెరవేరలేదని విమర్శించారు. ఎర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి, దర్శి ప్రాంతాల్లో నివసించే పేద, దళిత, గిరిజన ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలంటే మెడికల్ కళాశాల అవసరమని తెలిపారు. "ఇక్కడి ప్రజలకు చిన్నపాటి వ్యాధి సోకినా ఒంగోలు, కర్నూలు, గుంటూరు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రయాణంలోనే ప్రాణాలు కోల్పోతున్న దుస్థితి నెలకొందని" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పి 4 విధానం ద్వారా మెడికల్ కళాశాలను ప్రైవేటుకు అప్పగించే ప్రభుత్వ యత్నాన్ని ఆయన ఖండించారు. ఇది కార్పొరేట్లకు ప్రజల ప్రాణాలను అప్పజెప్పడమేనని అన్నారు. ప్రైవేట్ వైద్యం అంటే డబ్బుతో కొనాల్సిన వ్యవస్థేనని, ప్రభుత్వం తక్షణమే పి 4 విధానాన్ని రద్దు చేసి, కాలేజీని పూర్తిగా ప్రభుత్వ నిర్వహణలోనే నడిపించాలన్నారు. ఇటీవల కళాశాల నిర్మాణ పనుల్లో కొనసాగుతున్న జాప్యాన్ని కూడా ఆయన విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాలేజీ నిర్మాణాన్ని ఆలస్యం చేయడం దారుణమని, వెంటనే నిర్మాణాన్ని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డి సోమయ్య, డీకేఎం రఫీ, గుమ్మ బాలనాగయ్య, పి రూబెన్, ఎస్‌కె నన్నేసా, ఎస్‌కె మహబూబ్ బాషా, ఏనుగుల సురేష్ కుమార్, ఎస్‌కె నబి, టి రవికుమార్, జి రాజశేఖర్ రెడ్డి, తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ పుట్టినరోజు వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

**మార్కాపురం రూరల్, సెప్టెంబర్ 14,(ప్రభాతవార్త**
దేశ ప్రధాని నరేంద్ర మోడీ పుట్టినరోజు సెప్టెంబర్ 17 సందర్భంగా 15 రోజులపాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. ఈ మేరకు పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు అధ్యక్షతన ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్ నేత పివి కృష్ణారావు మాట్లాడుతూ "ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన నాయకుడు నరేంద్ర మోడీ పుట్టినరోజు సందర్భంగా పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారని తెలిపారు. సమీక్ష సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు శానాల సరోజిని, ఎం చిన్నయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ప్రవీణ్, మార్కాపురం రూరల్ అధ్యక్షులు జి శేషిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు గుమ్మ రాఘవేంద్ర, పొదిలి టౌన్ అధ్యక్షులు యద్దం మహేష్, రూరల్ అధ్యక్షులు రమణారెడ్డి, కొనకల మిట్ల అధ్యక్షులు సురేష్, తర్లుపాడు అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, శివప్రసాద్, వెంకటేశ్వర్లు, ప్రసాద్,శ్రీనివాసులు,రాజు యాదవ్,రామ్మూర్తి, సుజాత,నారాయణమ్మ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## వెలగొండ ప్రాజెక్టు పూర్తి పనులకు వెంటనే చర్యలు చేపట్టాలి

### - రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జయంతిబాబు డిమాండ్




**మార్కాపురం రూరల్, సెప్టెంబర్ 14,(ప్రభాతవార్త**
వెలగొండ ప్రాజెక్టును 2026 వరద సీజన్ నాటికి పూర్తి చేస్తామని చెప్పే కూటమి ప్రభుత్వం మాటలకే పరిమితమవుతుందా? అని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జె. జయంతి బాబు ప్రశ్నించారు. మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం గ్రామంలో ఆదివారం జరిగిన రైతు సంఘం 8వ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రాజెక్టు పనుల తీరుపై తీవ్రమైన ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 ఏళ్ల క్రితమే ప్రారంభమైన వెలుగొండ ప్రాజెక్టు ఇప్పటికి పూర్తికాకపోవడం ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయాన్ని నిరక్ష్యం చేసి కార్పొరేట్‌పరంగా మార్చాలని చూస్తున్నాయని మండిపడ్డారు. రైతులు లాభం లేదని అనుకునే పరిస్థితిని సృష్టించినందుకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలన్నారు. గత సంవత్సర కాలంగా పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని,100 శాతం రైతులు అప్పుల్లోనే ఉన్నారని తెలిపారు.

### వ్యవసాయ రంగాన్ని లాభదాయకంగా మార్చాలి :
రైతుల ఆత్మహత్యలు నివారించాలంటే వ్యవసాయ రంగాన్ని లాభదాయకంగా మార్చాలని, ఇందుకోసం వెలుగొండ ప్రాజెక్టు పనులు తక్షణమే యుద్ధప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో మార్కాపురం మండల రైతు సంఘం కమిటీ ఎన్నికలు నిర్వహించారు. మండల అధ్యక్షులుగా ఓర్సు అడివయ్య, కార్యదర్శిగా గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి,కాయకాకుల శ్రీనివాసులు, పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి,రేపని తిరుపతయ్య, దుగ్గెంపూడి వెంకటరామయ్య, సంపతి శ్రీనివాసులు, పిన్ని కల్లూరయ్య, వెంకటరెడ్డి సభ్యులుగా ఎన్నికయ్యారు. మహాసభలో రైతు సంఘం జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య, సీఐటీయూ పట్టణ కార్యదర్శి పందిటి రూబెన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మా బాలనాగయ్య,మండల కార్యదర్శి తురక ఏడుకొండలు తదితరులు మహాసభలో సందేశాలు ఇచ్చారు.మార్కాపురం మండలంలోని అనేకగ్రామాల నుండి రైతులు పెద్దసంఖ్యలో హాజరై, భూముల ఆన్లైన్ సమస్యలు,నీటి వసతుల కొరత,గిట్టుబాటు ధరలలేమి తదితర అంశాలపై చర్చించారు.

## కంభం పరిసర ప్రాంత ప్రజలకు ఈఎన్‌టి సేవలు



**కంభం, సెప్టెంబరు 14 ,ప్రభాతవార్త**
కంభం పట్టణంలోని బస్టాండ్ సెంటర్ మాలిక్ పాలడైరీ ప్రక్కనగల జగదీష్ వైద్యశాలలో ప్రజలకు ఈఎన్‌టి సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ కొల్లా వంశీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంభం పరిసర ప్రాంత ప్రజలు ఈఎన్‌టి, జనరల్ సమస్యలపై సుదూర ప్రాంతాలకు వెళ్ళాల్సిన అవసరం లేకుండా ప్రజలకు అందుబాటులో సేవలందించడంకోసం జగదీష్ హాస్పిటల్‌లో వైద్య సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ అవకాశాన్ని కంభంపట్టణ,పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ఎస్‌వికెపి విద్యార్థులు



**కంభం, సెప్టెంబరు 14, ప్రభాతవార్త**
కంభం పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు శ్రీ సత్యసాయి జిల్లాలో ఈ నెల 24వ తేదీ నుండి 27వ తేదీ వరకు జరిగే 51వ బాలురు, బాలికల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ జంకె సాయిబాబా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు బి గౌతమి భాయ్, ఎం రూపా, ఎం.లోకేష్ నాయక్‌లను కళాశాల ఛైర్మన్ అండ్ కరస్పాండెంట్ రావూరి కాశీరంగ జనార్ధన్‌రావు, డైరెక్టర్ డా॥పాలకొలను జయరామిరెడ్డిలు, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి సత్తాచాటాలని వారు విద్యార్థులకు సూచించారు.

## ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా షహనాజ్ బేగం బాధ్యతల స్వీకరణ



**తాళ్లూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
తాళ్లూరు మండల ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా షేక్ షహనాజ్‌బేగం శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో దారా హనుమంతరావును డిప్యూటేషన్‌పై పుల్లలచెరువు మండలానికి బదిలీ చేశారు. విఠలాపురం, తాళ్లూరు పంచాయతీ కార్యదర్శి షహనాజ్ బేగంకు పూర్తి అదనపు బాధ్యతలతో ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీవోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. పలువురు అధికారులు అభినందనలు తెలిపారు.

## చిన్నారులు కార్తీక్, గౌతమ్‌లను ఆశీర్వదించిన మాజీ మంత్రి మేరుగ



**నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
తిమ్మనపాలెం గ్రోత్ సెంటర్ దగ్గర వైఎస్సార్‌సీపీ అభిమాని, చాట్ల శామ్యూల్ ధనలక్ష్మీ కుమారులు కార్తీక్, గౌతమ్‌ల నూతన వస్త్రాలంకరణ వేడుక ఆదివారం జరిగింది. ఈ వేడుకకు మాజీ మంత్రి, సంతనూతలపాడు వైసీపీ ఇన్‌ఛార్జ్ మేరుగ నాగార్జున పాల్గొని చిన్నారులు కార్తీక్, గౌతమ్‌లను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పోలవరపు శ్రీమన్నారాయణ, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, రాష్ట్ర మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి కంచర్ల సుధాకరరావు, ప్రకాశం జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మారెళ్ళ బంగారుబాబు, మద్దిపాడు మండల ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, ప్రకాశం జిల్లా యువజన విభాగం సెక్రటరీ కాకర్ల వెంకటేష్, కొత్తకోట గ్రామ సర్పంచ్ ఉన్నం సురేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ దుడ్డు వినోద్ కుమార్, నాగులుప్పలపాడు మండల పార్టీ ఉపాధ్యక్షులు కాటూరి ఆదయ్య, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కుక్కల గోపిరెడ్డి, మారెళ్ళ శ్రీనివాసరావు, గోపాల్‌రెడ్డి, రాఘవరావు, మద్దిపాడు మండలం పబ్లిసిటి అధ్యక్షులు గద్దె జాలయ్య, మద్దిపాడు మండలం కల్చర్ వింగ్ అధ్యక్షులు కావూరి ఏసేబు, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల శ్రమకు తగ్గ ప్రతిఫలితం సాధించడమే సీఐటీయు లక్ష్యం




**పామూరు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం సాధించటం సీఐటీయు లక్ష్యమని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ అన్నారు. ఆదివారం ఇరువురు రోడ్డులో ఉన్న షాదీఖానలో సీఐటీయు ఎనిమిదో మహాసభ షేక్ అల్లాబక్షు అధ్యక్షతన జరిగింది. ముందుగా అమరవీరుల సంతాప సభ కే.మాల్యాద్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులు, కర్షకులు అమాయక ప్రజలపై భారాలు మోపి కక్ష, రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక ఐక్యమై ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్నామని నరేంద్ర మోడీ పాలనలో 10 గంటలు పెంచేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాలపై కోత విధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు పరం చేస్తున్నారని దీని వల్ల కార్మికులకు తీవ్ర మైన నష్టం వస్తుందని కార్మికులు ఐక్యమై వ్యతిరేక చట్టాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీఐటీయు మాజీ జిల్లా నాయకులు సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ కార్మిక సమస్యలు ప్రభుత్వానికి ముడిపడి ఉన్నాయని వాటిని పరిష్కరించాల్సింది ప్రభుత్వాలేనని అన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమీ మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. నిత్యవసర వస్తువులు ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతుందన్నారు. ఈ మహాసభలో వి.శ్రీను, సుబ్బమ్మ, చెన్నమ్మ, సుబ్బరత్తమ్మ పాల్గొన్నారు. మహాసభలో 16 సంఘాల సభ్యులు హాజరయ్యారని తెలిపారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నేత చిట్టెంశెట్టి

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**




శ్రీకాకుళం కేంద్రంలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజవరపు రామ్మోహన్ నాయుడుని ఆదివారంనాడు మండల టీడీపీ నాయకులు చిట్టెంశెట్టి శ్రీనివాస రావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## 27 మంది బాధితులకు రూ.13లక్షల 52వేలు సీఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామ పరిధిలోని పీర్లమాన్యం, క్రిస్టియన్‌పాలెం వడ్డెరపాలెం, శాంతినగర్ లలో 27 మంది బాధిత లబ్దిదారులకు ఆదివారం నాడు 13 లక్షల 52 వేల రూపాయల సీఎం రిలీఫ్ చెక్కులను సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. బాధిత లబ్దిదారులు గృహాలకు వెళ్లి ఈ చెక్కులను ఎమ్మెల్యే విజయన కుమార్ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు, అలియాస్ బాబు, సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్‌బాబు, టీడీపీ రాష్ట్ర మహిళా నాయకులు ఆరికట్ల సుమతి, మాజీ ఎంపీపీ వివరం గోవిందు, మాజీ వైస్ ఎంపీపీ వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ డైరక్టర్ తెళ్ళ వరమ్మ, టీడీపీ నాయకులు కరిచేటి శ్రీనివాసరావు, దాసరి కోటేశ్వరరావు, తెళ్ళ చిన్న, అట్లూరి బ్రహ్మయ్య, పత్తిపాటిశ్రీనివాసరావు, పి.వెంకటేశ్వరరావు, తిరుపతి స్వామి, మల్లవరపు రామకృష్ణారెడ్డి, తన్నీరు వెంకటరావు, కైలా శ్రీనివాసరావు, తన్నీరు వెంటేశ్వర్లు, పి.బ్రహ్మయ్య, అనిల్, బత్తుల శ్రీనివాసరావు,కల్లూరు వెంకటేశ్వర్లు,మలగా వెంకటరావు, వాసు, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

## భారతి, నారాయణరెడ్డి దంపతులను సన్మానించిన గణేష్ ఉత్సవ కమిటీ



**సీఎస్‌పురం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
మండలంలోని అయ్యలూరివారిపల్లి సర్పంచ్ ముత్యాల భారతి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి దంపతులను బెంగుళూరులో ఘనంగా సన్మానించారు. బెంగుళూరులోని మడివాలలో గణేష్ విగ్రహం ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ముత్యాల భారతి నారాయణరెడ్డిలను ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహుకరించారు.

## రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలి




**సీఎస్‌పురం, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు అన్నారు. స్థానిక నారాయణస్వామి కాంప్లెక్స్ లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మూడవ మండల మహాసభ అంకెపల్లి వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయంపై ఆసక్తి తగ్గిపోయి వలస బాట పడుతున్నారు. ప్రభుత్వం ఇతర దేశాల నుంచి దిగుమతులను ప్రోత్సహిస్తూ మన దేశంలో రైతులు పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. స్వామినాథన్ కమీషన్ ప్రకారం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు. భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకే ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తుందని, ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో ధాన్యం కొరత ఏర్పడిఆహార భద్రత లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత పాలకులపై ఉందని ఎవరు అధికారంలో ఉన్నా ప్రజల సమస్యలు, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని అధికారంలో ఉన్న పాలకులపై పోరాటం చేస్తామన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం రైతులు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పిల్లి తిప్పారెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడంలో ప్రభుత్వాలు తీవ్రంగా చేస్తున్నాయన్నారు. పాదయాత్ర చేస్తున్న రాజకీయ నాయకులు, ప్రజల సంక్షేమం కోసం కాక వారి రాజకీయ లబ్ది కోసమే పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పాలకులు స్పందించి వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఊసా వెంకటేశ్వర్లు, ఎం.రత్నారెడ్డి, నారా భాస్కర్‌రెడ్డి, గుడిపాటి నారాయణ, పోర్ల లక్ష్మయ్య, యారవ వెంకట సుబ్బయ్య, అజీజ్ భాష, రైతులు పాల్గొన్నారు.

## పిచ్చి కుక్క దాడిలో 40 మందికి పైగా గాయాలు



**దర్శి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
దర్శి పురపాలక సంఘం పరిధిలో పొదిలి రోడ్డులో, చౌటపాలెం రోడ్డులో పిచ్చికుక్క ఆదివారం సాయంత్రం 9 గంటల సమయంలో స్వైర విహారం చేసింది. ఈ సంఘటనలో సుమారు 40 మందిని గాయపరిచింది. గాయపడిన 40 మంది దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. మొత్తంగా దర్శి పట్టణం పరిధిలో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని బాధితులు వాపోయారు. పురపాలక సంఘం వారు ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజలు కోరుతున్నారు.

8_8.qxd 9/15/2025 12:23 AM Page 1



## పోలవరంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ



**దర్శి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదేశాల ముండ్లమూరు మండలం పోలవరం గ్రామంలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ముండ్లమూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ వింతా శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఇంటింటికి తిరిగి చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ సూపర్ సిక్స్ పథకాలు కుటుంబంలో ఎంత మందికి అందుతున్నాయో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మారెడ్డి, దర్శి నియోజకవర్గ రైతు సంఘ అధ్యక్షుడు బంక నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సూదిదేవర అంజయ్య, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బిక్కాలెడ్డి, జడ్పీటీసీ రత్నంరాజు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్యులు త్యాగాలకు స్ఫూర్తి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ





**దర్శి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
దర్శిలో జరిగిన ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ఆదివారం దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్, మాజీ మంత్రి ఆర్యవైశ్య ప్రముఖులు శిద్దా రాఘవరావు, చిరామ్ సత్యనారాయణ, పోనుగొండ సుబ్బారాయుడు, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లాలోని ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్‌లక్ష్మీ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు త్యాగాలకు స్ఫూర్తి తరతరాలుగా సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకం అనాడు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్రం కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగం చేసిన మహనీయులు అదే స్ఫూర్తి ప్రతి ఆర్యవైశ్యులలో ఉందని నేను బలంగా నమ్ముతున్నాను. కష్టపడి వ్యాపారాలు చేసుకొని సంపాదించుకున్న మంచి ఆర్యవైశ్యులు వర్గంలో ప్రతికుటుంబంలోను కనిపిస్తుంది. వారు సంపాదించిన సొమ్ములో కొంత భాగం వారి సమాజం కోసం, వారి వర్గం కోసం పాటుపడడం వారిలో దాతృత్వానికి ప్రత్యేకగా చెప్పవచ్చు. ఆర్యవైశ్యుల సత్రాలు, దేవాలయాల నిర్మాణాలు, ఆర్యవైశ్యుల హాస్టల్ భవనాలు, నిరుపేద విద్యార్థులకు చదువులు చదివించడం చేయూతనివ్వడం ఇలా ఆర్యవైశ్యులు సమాజ సేవలో తాము సంపాదించిన సంపాదనలో కొంత భాగాన్ని ఖర్చు చేయడం అన్ని వర్గాలకు స్ఫూర్తిదాయకమన్నారు. మన కూటమి ప్రభుత్వం అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాన్ని గుర్తించి రాజధాని అమరావతిలో 58 అడుగుల విగ్రహం ఏర్పాటు ఆరెకరాల స్మృతి వనాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇలా ఆర్యవైశ్యుల అభ్యున్నతికి మన ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావుకి, కార్యవర్గానికి డాక్టర్ లక్ష్మీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లాలోని ఆర్యవైశ్య ప్రముఖులు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, మహిళలు ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు అవసరం



**చీరాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వ సేవలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తమ మొత్తం జీవితాన్ని ప్రభుత్వానికి అంకితం చేస్తారు. ఉద్యోగ జీవితం పూర్తయిన తర్వాత వారు సమాజంలో విలువైన అనుభవం,జ్ఞానం, ప్రతిభ కలిగిన వనరుగా నిలుస్తారు. కానీ ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం పట్ల సమగ్ర దృష్టితో వ్యవస్థీకృత చర్యలు తీసుకున్న ప్రత్యేక సంస్థ లేకపోవడం ఒక లోటు. ఈ నేపథ్యంలో రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు అత్యవసరంగా ఉంది అని విశ్రాంత ఇంజనీర్, సీనియర్ రాజకీయ వేత్త నక్కల వెంకటరమణ అభిప్రాయపడ్డారు. ప్రభాతవార్తతో ఆయన మాట్లాడుతూ

**అవసరమేమిటి..? :**
ఆర్థిక భద్రతః పెన్షన్ లేదా గ్రాట్యూటీ సరిపోని సందర్భాల్లో ఆర్థిక సమస్యలు తలెత్తుతుతాయి. కార్పొరేషన్ ద్వారా రుణాలు అత్యవసర ఆర్థిక సాయం అందించవచ్చు.

**ఆరోగ్యపరిరక్షణ :** వయసు పెరిగే కొద్ది ఆరోగ్య సమస్యలు అధికమవుతాయి. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక మెడికల్ స్కీములు, డిస్కౌంట్ హెల్త్ కార్డులు, రిటైర్డ్ ఉద్యోగుల కోసం ప్రత్యేక ఆసుపత్రి విభాగాలు ఏర్పాటు చేయవచ్చు.

**సామాజిక భద్రత :**
పదవీ విరమణ తర్వాత ఒంటరితనం, సామాజిక విస్మరణ కలగవచ్చు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్‌లను బలపరిచి, సాంస్కృతిక/ వినోద కార్యక్రమాలు నిర్వహించవచ్చు.
సలహా ఉపాధి అవకాశాలుః అనుభవజ్ఞులైన రిటైర్డ్ ఉద్యోగులను ప్రభుత్వ సలహా బోర్డుల్లో, శిక్షణా కార్యక్రమాల్లో వినియోగించుకోవచ్చు.

**కార్పొరేషన్ ద్వారా అందించగల సౌకర్యాలు :**
హెల్త్ కేర్ స్కీములుః మెడికల్ ఇన్సూరెన్స్, ప్రైవుటు/ ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాషలెస్ ట్రీట్మెంట్.
ఫైనాన్షియల్ సపోర్టుః తక్కువ వడ్డీ రుణాలు, అత్యవసర సహాయక నిధి

**వెల్ఫేర్ హాస్టల్స్,రిటైర్మెంట్ హోమ్స్ :** సహజీవనం, భద్రత కలిగిన వసతి.
సాంస్కృతిక, శిక్షణా కేంద్రాలుః రిటైర్డ్ ఉద్యోగులు తమ ప్రతిభను వినియోగించుకునే నివేదికలు

**కానూను సాయం :** పెన్షన్ గ్రాడ్యూటీ, పీఆర్సీ, లేదా ఇతర బకాయిలకు సంబంధించిన వివాదాలలో న్యాయ సహాయం

**వనరుల వినియోగం :** ప్రభుత్వానికి అనుభవజ్ఞులైన సలహాదారుల ఫూల్.

**ప్రభుత్వానికి కలిగే లాభాలు:** రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుంది,
రాబోయే తరాల ఉద్యోగులు సేవా మనోభావంతో పని చేస్తారు, వృద్దాప్యంలో ఉద్యోగులు గౌరవప్రదంగా జీవించేలా చేస్తుంది. అనుభవజ్ఞులైన రిటైర్డ్ ఉద్యోగుల జ్ఞానాన్ని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో ఉపయోగించుకోవచ్చు.

**ముగింపు :**
రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు జీవితాంతం ప్రభుత్వానికి సేవ చేసి, చివర్లో నిర్లక్ష్యం అనుభవించడం సమాజానికి, ప్రభుత్వానికి అనుకూలం కాదు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా వారికి ఆర్థిక, వైద్య, సామాజిక రక్షణ కల్పించడం వారి అనుభవాన్ని ప్రభుత్వ సేవలో కొనసాగించడం అత్యంత సమంజసం.

## మెడికల్ అసోసియేషన్ జోనల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దులూరి



**చీరాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
కొత్తపేట రావి సుబ్బారాయుడు కళ్యాణ మండపం నందు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జోనల్ సమావేశంలో ముఖ్య అతిధులుగా చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సమావేశంలో పాల్గొనడం ఆనందాన్ని కలిగించిందన్నారు. వ్యక్తిగత, కుటుంబ జీవితాన్ని త్యాగం చేస్తూ పని చేయగలగేది వైద్య వృత్తి మాత్రమే అన్నారు. మారుతున్న నేటి సమాజంలో మనిషి జీవన శైలిలో వచ్చిన అనూహ్య మార్పులతో కొత్త రోగాలు, వైరస్‌లు వంటివి వస్తున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి విపత్తుల నుంచి ప్రజలను రోగ విముక్తులు చేయాలంటే నిపుణులైన వైద్యులు అత్యాధునిక వైద్య సేవలు అందించాలి. అందుకే ఆ దిశగా కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి భరోసా, ప్రతి వ్యక్తికి రక్షణ, ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందించే విధంగా రూ.25లక్షల ఆరోగ్య రక్ష, ప్రజల ఆరోగ్య భద్రతకు కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మకమైన నిర్ణయం అని అన్నారు.

## బాధితులకు అండగా సీఎం సహాయనిధి

### - ఎమ్మెల్యే మద్దులూరి





**చీరాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
బాధితులకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 120 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంక్షేమ నిధి సీఎంరిలీఫ్ ఫండ్ నుండి వచ్చిన రూ.1,02,00,000 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్యశాలలో కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని, మెరుగైన వైద్య నిమిత్తం వివిధ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందిన బాధితులకు వారు చెల్లించిన నగదు రసీదులను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే విచారించిన అనంతరం క్షతగాత్రులకు ముఖ్యమంత్రి సహాయనిధి కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు మెరుగైన సమాజాన్ని అందించాలనే ఆలోచన విధానంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని ఆయన సేవలు రాష్ట్రానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ స్థాయిలో వైద్యం పొందలేని బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్యకి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి బాలినేనిని కలిసిన చీరాల నియోజకవర్గ జనసేన నాయకులు



**చీరాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పిలుపు మేరకు హైరాబాద్‌లోని వారి నివాసమందు వారిని మర్యాద పూర్వకంగా కలిసిన చీరాల నియోజకవర్గ జనసేన పార్టీ కార్యవర్గ సభ్యులు చీరాల నియోజకవర్గ జనసేన పార్టీ స్థితిగతులు, కూటమి ప్రభుత్వ పనితీరు గురించి తెలుసుకున్నారు. నియోజకవర్గ స్థితిగతుల గురించి ఆయనకు తెలియజేయడం జరిగింది. ఆయన సూచనల మేరకు చీరాల నియోజకవర్గంలో జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి గూడూరు శివరామ ప్రసాద్, తోట రాజశేఖర్, వేటపాలెం జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఉగిరాల మార్కండేయులు, పట్టణ నాయకులు అనుమకొండ కిషోర్, యువ నాయకులు ఎర్రిచర్ల, అశోక్ కుమార్ తదితరులు ఉన్నారు.

## బాపట్ల జిల్లా నూనత ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఉమామహేశ్వర్



**చీరాల, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా నూతన ఎస్పీగా బి.ఉమామహేశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత బాపట్ల జిల్లా ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న తుషార్ డూడి చిత్తూరు జిల్లాకు బదిలీ కాగా, సీఐడీ విభాగంలో ఎస్పీగాబాధ్యతలు నిర్వహిస్తున్న బి.ఉమామహేశ్వరరావు బాపట్ల జిల్లాకు బదిలీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత మూడవ ఎస్పీగా బి.ఉమామహేశ్వరరావు బాధ్యతలు స్వీకరించనున్నారు. డీఎస్పీగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గురజాల, కడప జిల్లాలోని కడప సబ్ డివిజన్లలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అదిలాబాద్ పట్టణంలో విధులు నిర్వహించారు. అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది అదిలాబాద్, వరంగల్ అర్బన్ జిల్లాలో అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్యాడర్‌లో ఎస్పీగా పదోన్నతి పొందిన అనంతరం ఇంటెలిజెన్స్, విజిలెన్స్, సీఐడీ విభాగాలలో బాధ్యతలు నిర్వహించారు.



## ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

### - కనిగిరి నాయకులకు కీలక పదవులు





**కనిగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం దర్శిలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కనిగిరి ఆర్యవైశ్య నాయకులు అనేక కీలకపదవులు చేపట్టడం విశేషం. జిల్లా ఉపాధ్యక్షులుగా అద్దంకి రంగ రమేష్(చిన్నబాబు), దర్శి సుబ్రహ్మణ్యం(యువరాజ్), జిల్లా జాయింట్ సెక్రటరీలుగాపైడిమర్రి సత్యనారాయణ, ఏల్చూరి శివశంకర్, జిల్లా ఈసీ సభ్యులుగా పాలువాది జై రామచంద్ర, జవ్వాజి వెంకటేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కనిగిరి ఆర్యవైశ్య నాయకులు కోట వెంకట సురేష్‌కుమార్, పట్టణ ఆర్యవైశ్య నాయకులు నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా గజమాలతో, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఆర్యవైశ్య సంఘ నాయకులు, సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజాల ఆదిరెడ్డిని పరామర్శించిన వైసీపీ నేతలు



**కనిగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ జిల్లా అధికార ప్రతినిధి రాజాల ఆదిరెడ్డి ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకున్న విషయం తెలిసిందే. ఆదివారం ఆయన నివాసంలో పలువురు వైసీపీ నాయకులు ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎరువారిపల్లి ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మాజీ అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ లతీఫ్, వెంకట్రావు, అమర్నాథ్‌రెడ్డి(నాని), మహబూబ్ భాషా తదితరులు హాజరయ్యారు. వారు రాజాల ఆదిరెడ్డితో కాసేపు ముచ్చటిస్తూ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. వైసీపీ నాయకులు మాట్లాడుతూ రాజాల ఆదిరెడ్డి పార్టీ కోసం ఎన్నో కష్టాలు పడ్డారు. ఆయన సహకారం మరువలేనిది. ఆరోగ్యవంతంగా తిరిగి ప్రజల్లోకి రావాలని కోరుకుంటున్నాం అని తెలిపారు.

## అజీజ్‌పురం పఠాన్ వివాహ వేడుకలో నేతల సందడి



**కనిగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
కనిగిరి మండలం అజీజ్‌పురం గ్రామానికి చెందిన పఠాన్ వారి వివాహ మహోత్సవం ఆదివారం కందుకూరులోని లక్ష్మీ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి యేరువారిపల్లి మాజీ ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరంరెడ్డితో పాటు సర్పంచ్ దమ్ము వెంకటయ్య, కనిగిరి వైఎస్సార్‌సీపీ మండల మైనార్టీ అధ్యక్షులు కాశీం, తిరుపతయ్య తదితరులు వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ వినతిపత్రం



**కనిగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న నాన్చివేత వైఖరిపై ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసన వారం లో భాగంగా కనిగిరి జోన్ ఉపాధ్యాయ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డిని అమరావతి మైదానంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న డీఏ, ఐఆర్, పీఆర్సీ బకాయిలు వంటి సమస్యలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల ఆవేదనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, రాష్ట్ర కౌన్సిలర్ పి.రాజ్ కుమార్, జోన్ నాయకులు కే.రామ్మోహన్, ఒంగోలు వెంకటేశ్వర్లు, తోటశ్రీనివాసులు, జేఎస్ ఆనంద్‌బాబు, ఏ.హజరత్‌రెడ్డి, కేవీబీభాస్కర్‌రెడ్డి, డిసుబ్బరాయుడు, కేవీ సుబ్బయ్య, నజీర్ భాషా, వై.రాములు, గోపాలకృష్ణ, మచ్చల ప్రసాద్, పాకల శ్రీనివాసులు, సాల్మన్, పెన్నా వెంకటేశ్వర్లు, షేక్ హుస్సేన్, జి.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి టౌన్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా మోహనమురళి

### - ఎమ్మెల్యే ఉగ్రకు కృతజ్ఞతలు



**కనిగిరి, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
కనిగిరి టౌన్ తెలుగుదేశం పార్టీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా బొందలపాటి మోహన మురళి నియమితులయ్యారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశీస్సులతో ఈ నియామకం అమరావతి మైదానంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మోహన మురళి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తరువాత మాట్లాడుతూ పార్టీ బలపరచడంలో తన వంతు కృషి చేస్తానని, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. టౌన్ పార్టీ ఉపాధ్యక్షుడు షేక్ ఫిరోజ్, టౌన్ తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవికి కృతజ్ఞతలు తెలిపారు.

## జాతీయ రహదారిలో మందుబాబులు కారుతో బీభత్సం

### - ఆటో ఢీకొట్టి పలు వాహనాలపైకి దూసుకెళ్లిన కారు - జాతీయ రహదారిలోని హాయ్ రెస్టారెంట్ సమీపంలో ఘటన

### - ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలు








**చీరాల టౌన్, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త**
మద్యం మత్తులో కారును అతి వేగంగా నడిపిన కొందరు యువకులు జాతీయ రహదారిపై బీభత్సం సృష్టించిన ఘటన ఆదివారం చీరాలలో చోటు చేసుకుంది. బాపట్ల జిల్లా చీరాల బైపాస్ రోడ్డులో మన్నం అపార్టుమెంట్ వద్ద ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. రామాపురం బీచ్ నుండి చీరాలకు వస్తున్న కారు ముందుగా స్కూటీని ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఘటన చూసి ప్రజలు గుమ్మిగూడడంతో ఆగకుండా యువకులు కారును అతివేగంగా నడుపుతూ బైపాస్ రోడ్డులోని హాయ్ రెస్టారెంట్ వద్ద మరో ఆటోను ఢీకొట్టారు. ఢీకొట్టిన ఆటో బోల్తా పడి అందులో ప్రయాణిస్తున్న ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం సెలవు కావడంతో స్థానిక కాలేజీ మైదానంలో క్రికెట్ ఆడిన యువకులు ఆటోలో స్వగ్రామం రామనగర్ వెళ్తుంగా ప్రమాదం జరిగిందని, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్కూటీపై ప్రయాణిస్తున్న వ్యక్తి తన ఇంటికి మంచి నీటి క్యాన్ తీసుకెళ్తుంగా ఈ ప్రమాదానికి గురయ్యాడు. ప్రమాదం తర్వాత కారు అదుపు తప్పి రహదారి పక్కనున్న కాలువలోకి దూసుకుపోయింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, రెండో పట్టణ ఎస్సై వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక విచారణలో యువకులు చిలకలూరిపేటకు చెందిన వారని పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ప్రమాదంలో గాయపడిన వారిలో స్కూటీ డ్రైవర్ పరిస్థితి ఆందోళన కరంగా ఉందని తెలిసింది. కాగా ప్రమాదానికి కారణమైన కారులోని యువకులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల











**ఒంగోలు, ప్రభాతవార్త**
ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డు ఆర్యవైశ్య భవన్ నందు కి.శే కొనిజేటి రోశయ్య విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. దర్శి నందు జిల్లా ఆర్యవైశ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్నారు.

15-9Pg5 9_15-9Pg5.qxd 9/15/2025 12:48 AM Page 1





# వలసలపై లండన్‌లో భారీ నిరసనలు

## మరోవైపు వలసదారులకు మద్దతుగా ర్యాలీలు

## హింసాత్మకంగా మారిన లండన్ వీధులు




**లండన్, సెప్టెంబరు 14:** యునైటెడ్ కింగ్‌డమ్ రాజధాని లండన్‌లో శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫార్‌రైట్ కార్యకర్త టామీ రాబిన్‌సన్ నిర్వహించిన యునైట్ ది కింగ్‌డమ్ ర్యాలీ హింసాత్మకంగా మారింది. వలస విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఈ ప్రదర్శనలో నిరసనకారులు పోలీసులతో ఘర్షణకు దిగారు.

ఈ ఘటనల్లో 26 మంది పోలీసు అధికారులు గాయపడగా, 25 మందిని అరెస్ట్ చేశారు. మెట్రోపాలిటన్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం ఈ ర్యాలీకి ఊహించిన దానికంటే చాలా ఎక్కువ సంఖ్యలో సుమారు 1.10లక్షల నుంచి 1.5 లక్షల మంది ప్రజలు హాజరయ్యారు. ప్రదర్శన చివరి దశలో కొంతమంది నిరసనకారులు అదు పుతప్పి పోలీసులపై బాటిళ్లు విసిరి దాడులకు పాల్పడ్డారు. ప్రత్యర్థి వర్గాల నిరసనకారులను వేరుచేయడానికి ఏర్పాటు చేసిన బారికేడ్లను ఛేదించడానికి ప్రయత్నించారు. ఈ దాడుల్లో నలుగురు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరికి పళ్లు విరగగా, మరొకరికి వెన్నెముకకు గాయమైందని, ఇంకొకరికి ముక్కు విరిగి ఉండొచ్చని అధికారులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అదనపు బలగాలను మోహరించాల్సి వచ్చింది. టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ఓ వీడియోలో మాట్లాడుతూ భారీగా, అనియంత్రితంగా వస్తున్న వలసలతో బ్రిటన్ నాశనమవుతోందని వ్యాఖ్యానించారు. మా దేశాన్ని మాకు తిరిగి ఇవ్వండి, పడవలను ఆపండి వంటి ప్లకార్డులతో నిరసనకారులు కవాతు నిర్వహించారు. ఇదే సమయంలో స్టాండ్ అప్ టు రేసిజం సంస్థ ఆధ్వర్యంలో సుమారు 5,000మందితో వలసదారులకు మద్దతుగా మరో ప్రదర్శన కూడా జరిగింది. వేల మంది నగర వీధుల్లోకి వచ్చి తమ నిరసనలను తెలియజేశారు. ఒకవైపు వలసదారులపై వ్యతిరేకతను వ్యక్తంచేస్తూ ఆందోళనలు జరగగా మరోవైపు జాత్యహంకారాన్ని ఖండిస్తూ 'స్టాండప్ టు రేసిజమ్' అనే నినాదంతో మరో ర్యాలీ జరిగింది. ఈ రెండు ర్యాలీల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసులు భారీఎత్తున మోహరించారు.

అయినప్పటికీ ర్యాలీలు హింసాత్మకంగా మారడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. లండన్ వీధుల్లో వలసదారుల వ్యతిరేక ర్యాలీలో వేలమంది పాల్గొన్నారు. వలసలవల్ల తమ దేశంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయని, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని వారు ఆందోళనవ్యక్తంచేశారు. ఈ నిరసనకారులు తమ డిమాండ్లను గట్టిగా వినిపించడానికి నినాదాలు చేస్తూ ప్లకార్డులు పట్టుకుని నగరంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ తీశారు. కానీ ఈ ర్యాలీలో కొంతమంది నిరసనకారులు హద్దులు దాటడంతో హింసాత్మకంగా మారింది. పోలీసులపై వాటర్ బాటిళ్లు, రాళ్లు రువ్వారు. దాంతో పోలీసులు 26 మందిని అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో నగరంలో మరో నిరసన ర్యాలీ కూడా జరిగింది.

స్టాండ్ అప్ టు రేసిజమ్ అనే సంస్థనాయకత్వంలో జాత్యహంకారానికి వ్యతిరేకంగా 5వేల మంది ర్యాలీలో పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, ఐక్యతను ప్రోత్సహించాలని నిరసనకారులు కోరారు. వివిధ జాతులు, సంస్కృతుల ప్రజలు ఒకే దేశంలో సామరస్యంగా జీవించాలని పిలుపునిచ్చారు. శాంతియుతంగా తమ నిరసనను తెలియజేశారు. ప్లకార్డులు, బ్యానర్‌లు పట్టుకుని, నినాదాలు చేస్తూ, జాత్యహంకార వివక్షను ఖండిస్తూ ముందుకు నడిచారు.



# భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌కు నిరసనగా టీవీల ధ్వంసం

## భారీ ఆందోళనలు జరిపిన శివసైనికులు

**ముంబయి, సెప్టెంబరు 14:** ఆసియా కప్ 2025లో భాగంగా భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య ఆదివారం జరగనున్న క్రికెట్ మ్యాచ్ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ మ్యాచ్ ను వ్యతిరేకిస్తూ శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ థాకరే వర్గం) పార్టీ కార్యకర్తలు ముంబైలో ఆందోళన చేపట్టారు. పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ దూబే నేతృత్వంలో నిరసనకారులు టీవీ సెట్లను పగలగొట్టి, కేంద్ర ప్రభుత్వానికి, బీసీసీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆనంద్ దూబే మాట్లాడుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశమని, అలాంటి దేశంతో అన్ని రకాల సంబంధాలను తెంచుకోవాలని డిమాండ్ చేశారు. మ్యాచ్ నిర్వహణకు అనుమతి ఇవ్వడం ద్వారా మోదీ ప్రభుత్వం మన సోదరీమణుల సిందూరాన్ని అవమానిస్తోందని తీవ్రంగా ఆరోపించారు. దీనికి గుర్తుగా మహిళా కార్యకర్తలు చేతిలో సిందూరం పట్టుకుని నిరసన తెలిపారు. దుబాయ్ లో జరగనున్న ఈ మ్యాచ్ ను మేము వ్యతిరేకిస్తున్నాం. ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతున్నామని దూబే అన్నారు. పహల్గామ్ లో తమ ఆప్తులను కోల్పోయిన సోదరీమణులు, తల్లులు ఈ మ్యాచ్ ను ఎలా చూడగలరని ఆయన ప్రశ్నించారు. ప్రధాని మోదీ ఈ మ్యాచ్ ను ఆపాలి వారి మనోభావాలతో ఆడుకోవద్దు, బీసీసీఐకి, జైషాకు తమ తప్పు తెలిసేలా విరాళాలు పంపుతున్నామని ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత క్రికెటర్లు కూడా ఈ మ్యాచ్ ను బహిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆటగాళ్లు ఈ మ్యాచ్ ను బహిష్కరిస్తే, మేము వారికి అండగా నిలుస్తాం. అలా కాకుండా ఆడితే మాత్రం, వారి తీరును కూడా ఖండిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ నిరసనల మధ్య, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో భారత కాలమానం ప్రకారం రాత్రి 8:00 గంటలకు భారత్‌పాకిస్థాన్ మ్యాచ్ ప్రారంభం కానుంది.

# యుద్ధాల ఆంక్షలతో సమస్యలు పరిష్కరించలేరు

## చైనా తీవ్ర స్పందన



**బీజింగ్, సెప్టెంబరు 14:** తమ దేశంపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై చైనా తీవ్రంగా స్పందించింది. యుద్ధాలు, ఆంక్షల ద్వారా సమస్యలను పరిష్కరించలేమని, అవి పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయని గట్టిగా బదులిచ్చింది. వివాదాస్పద అంశాల పరిష్కారానికి శాంతియుత చర్చలకే తాము కట్టుబడి ఉన్నామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పష్టం చేశారు. స్లోవేనియా పర్యటనలో భాగంగా ఆ దేశ ఉప ప్రధాని తాన్యా ఫజోన్‌తో సమావేశం అనంతరం వాంగ్ యీ విలేకరులతో మాట్లాడారు. చైనా ఎప్పుడూ యుద్ధాలలో పాల్గొనదు, వాటిని ప్రోత్సహించదు. చర్చల ద్వారా రాజకీయ పరిష్కారాలను ప్రోత్సహించడమే మా విధానం అని అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం గందరగోళం, ఘర్షణలతో నిండి ఉందని, ఈ సమయంలో బహుళపాక్షిక విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. చైనా, యూరప్‌లు ప్రత్యర్థులుగా కాకుండా మిత్రులుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు, డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధం ముగిసే వరకు నాటో కూటమి చైనాపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలి. రష్యాపై చైనాకు బలమైన పట్టు ఉంది. ఈ భారీ సుంకాలు ఆ పట్టును విచ్ఛిన్నం చేస్తాయి. తద్వారా ఈ భయంకరమైన యుద్ధానికి ముగింపు పలకవచ్చు అని ట్రంప్ పోస్ట్ చేశారు. గతంలో కూడా ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. అమెరికాకు వ్యతిరేకంగా జిన్‌పింగ్ కుట్ర పన్నుతున్నారని విమర్శించారు. అయితే, ఆసక్తికరంగా, ఈ ఆరోపణలు చేసిన కొన్ని గంటలకే చైనా నాయకత్వంతో తన వ్యక్తిగత సంబంధాలు చాలా బాగున్నాయని చెప్పడం గమనార్హం.

# జెన్‌జడ్ ఉద్యమంలో మృతులకు 'అమరవీరుల హోదా'

## నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కర్కి

**ఖాట్మండు, సెప్టెంబరు 14:** జెన్‌జడ్ యువత చేపట్టిన భారీ ఆందోళనల కారణంగా కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం కుప్పకూలిన కొన్ని రోజులకే ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి తాజాగా కీలక ప్రకటనలు చేశారు. తమ ప్రభుత్వం కేవలం ఆరు నెలల పాటే అధికారంలో ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సుశీల కర్కి మాట్లాడుతూ తానుగానీ, తన బృందం గానీ అధికారాన్ని రుచి చూడటానికి ఇక్కడికి రాలేదు. ప్రజలకు సేవ చేయడానికే బాధ్యతలు చేపట్టాం. ఆరు నెలలకు మించి ఒక్క రోజు కూడా అధికారంలో కొనసాగం. కొత్తగా ఎన్నికయ్యే పార్లమెంటుకు పూర్తి బాధ్యతలు అప్పగిస్తామని తెలిపారు. దేశ పునర్నిర్మాణానికి ప్రజలందరి సహకారం అవసరమని, వారి మద్దతు లేకుండా తాము విజయం సాధించలేమని అన్నారు. ఇటీవల జరిగిన ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని అధికారికంగా 'అమరవీరులు'గా గుర్తిస్తామని కర్కి హామీ ఇచ్చారు. ఇది ఉద్యమంలో పాల్గొన్న వారికి ప్రభుత్వం ఇస్తున్న గౌరవంగా భావిస్తున్నారు. అదే సమయంలో నిరసనల సందర్భంగా జరిగిన విధ్వంసకర ఘటనలపై విచారణ జరిపిస్తామని ఆమె స్పష్టం చేశారు. అధికారం కోసం కాకుండా దేశాన్ని తిరిగి గాడిన పెట్టడానికే తాము వచ్చామని ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం నేపాల్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# వరద సాయం ఉగ్ర సంస్థల పరం

## పాకిస్థాన్‌లో లష్కరే స్థావరాల పునరుద్ధరణ



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 14:** ఉగ్రవాదులతో తమకు సంబంధం లేదని ప్రపంచ వేదికపై మేకపోతు గాంభీర్యాలు పలికే పాకిస్థాన్ లోలోపల ఉగ్రస్థావరాల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించడమే లక్ష్యంగా భారత్ పాక్‌లోని అనేక ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. అయినా బుద్ధి మారని దాయాది దేశం తినడానికి లేకపోయినా కూడా వరద బాధితుల పేరుతో సేకరించిన నిధులను ఉగ్ర స్థావరాల పునరుద్ధరణకు ఖర్చు చేస్తున్నట్లు భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళం ధ్వంసం చేసిన లష్కరే ప్రధాన క్యాంపు కార్యాలయం మర్కాజ్ తోయిబాను పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపాయి. ధ్వంసమైన లష్కరే తోయిబా ప్రధాన కార్యాలయ విభాగాలను తొలగించడానికి దాని చుట్టూ భారీ యంత్రాలను మోహరించి ఉన్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల్లో కనిపిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు వెల్లడించాయి. దీనిని పునర్నిర్మించిన తర్వాత మళ్లీ ఉగ్రవాదులకు శిక్షణ స్థావరంగా ఉపయోగించనున్నట్లు తెలిపాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో ధ్వంసమైన ఎల్ఇటికి ఆగస్టులో పాక్ ప్రభుత్వం నుంచి రూ. 1.25 కోట్లు ఇవ్వగా.. పునరుద్ధరణకు అయ్యే మొత్తం ఖర్చు సుమారు రూ. 4.7 కోట్లకుపైగా ఉంటుందని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. వీటికి కావాల్సిన నిధులను సేకరించడానికి పాక్ మేకవన్నె పులిలా మానవతావాద ముసుగులో ప్రచారాలు చేపడుతోంది. వరద ప్రభావిత ప్రాంతాల సహాయం పేరుతో విరాళాలు సేకరించి ఉగ్ర సంస్థలకు మళ్లిస్తోంది.

# మోడీ మణిపూర్ పర్యటన కంటితుడుపు చర్యే

## ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** కల్లోలిత మణిపూర్‌లో ప్రధాని పర్యటన కేవలం ఒక పిట్‌స్టాప్ వంటిది మాత్రమేనని ఎఐసిసి అధ్యక్షుడుఖర్గే వాదించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు చేశారు. మోదీ పర్యటన కేవలం ఒక పిట్ స్టాప్ (చిన్న విరామం) మాత్రమేనని ఇది రాష్ట్ర ప్రజలకు తీవ్ర అవమానం అని ఘాటుగా వ్యాఖ్యానించారు. చురాచంద్‌పూర్, ఇంఫాల్‌లలో పర్యటించడానికి వచ్చిన మోదీపై ఖర్గే సోషల్ మీడియా వేదికగా విరుచుకుపడ్డారు. నరేంద్ర మోదీ గారు.. మణిపూర్‌లో మీ 3 గంటల పర్యటన కనికరం కాదు. ఇది ఒక ప్రహసనం. కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. రిలీఫ్ క్యాంప్‌లలోని ప్రజల రోదనలు వినకుండా పారిపోవడమే మీ ఉద్దేశ్యం అని ఆయన పోస్ట్ చేశారు. అక్కడితో ఆగకుండా హింస మొదలైన ఈ 864 రోజుల్లో 300 మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. మొత్తంగా 67,000 మంది నిరాశ్రయులు అయ్యారని చెప్పారు. అంతేకాకుండా 1,500 మందికి పైగా గాయపడ్డారని తెలిపారు. ఈ సమయంలో మీరు 46 విదేశీ పర్యటనలు చేశారని కానీ సొంత ప్రజలను పరామర్శించడానికి ఒక్కసారి కూడా రాలేదని ఖర్గే అన్నారు. మీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం మణిపూర్‌లోని అమాయక ప్రజల జీవితాలను బుల్డోజ్ చేసిందంటూ తీవ్రంగా వ్యాఖ్యానించారు. అలాగే ప్రధాని, హోం మంత్రి అమిత్ షా అసమర్థత, కుమ్మక్కు కారణంగానే రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రాష్ట్రపతి పాలన విధించడం ద్వారా ఈ సమస్యను కప్పిపుచ్చుకోవాలని చూశారని ఆరోపించారు. ఈ విషయంలో మీ రాజధర్మం ఎక్కడ కనిపిస్తుందో చెప్పాలంటూ ఖర్గే ప్రశ్నలు సంధించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా ప్రధాని ఇంతకుముందే రాష్ట్రానికి వచ్చి ఉండాల్సిందని అన్నారు. రెండు సంవత్సరాల తర్వాతనైనా ఆయన మణిపూర్‌ను సందర్శించడానికి నిర్ణయించుకోవడం సంతోషం. ప్రధాని మోదీ తన పర్యటనలో నిరాశ్రయులైన ప్రజలతో మాట్లాడారు. అలాగే రూ.8,500 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. మణిపూర్‌లో మైతేయ్, కుకి వర్గాల మధ్య భూ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై మే 2023 నుంచి ఘర్షణలు జరుగుతున్నాయి.

# ఏకైక ఆమ్ ఆద్మీ ఎమ్మెల్యేపై ప్రజాభద్రతా చట్టం

**శ్రీనగర్, సెప్టెంబరు 14:** ప్రజాప్రతినిధిపై ప్రజా భద్రతా చట్టం కింద చర్యలు తీసుకోవడం చాలా అరుదుగా జరుగుతుంటుంది. కానీ జమ్మూ కాశ్మీర్‌లోని ఏకైక ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యే మెహ్రాజ్ మాలిక్‌పై పోలీసులు ఈ పీఎస్ఏ చట్టాన్ని ప్రయోగించి అరెస్ట్ చేయడం ఇప్పుడు సంచలనం సృష్టిస్తోంది. గత వారం పోలీసులు అదుపులోకి తీసుకున్న మెహ్రాజ్ మాలిక్‌పై ఇప్పటికే 18 కేసులు నమోదై ఉన్నాయని, పోలీస్ డైరీలో ఆయనపై రోజువారీ నివేదికలు ఉన్నాయని దోడా జిల్లా మెజిస్ట్రేట్ జారీ చేసిన పీఎస్ఏ డోసియర్‌లో పేర్కొన్నారు. 33 పేజీల ఈ డొసియర్‌లో మాలిక్‌ను హిస్టరీ షీటర్‌గా పేర్కొంటూ ఆయన సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, ప్రభుత్వ కార్యాలయాలను తగలబెట్టమని ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. అధికారులు, రాజకీయ ప్రత్యర్థులపై ఆయన తరచుగా అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని డోసియర్‌లో పేర్కొన్నారు. ముఖ్యంగా ఎన్నికల డ్యూటీ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడం, అనుమతి లేకుండా ర్యాలీలు నిర్వహించడం, వైద్యుల పట్ల అనుచిత భాష ఉపయోగించడం వంటి ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. 1978లో ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ఒక సిట్టింగ్ ఎమ్మెల్యేపై పీఎస్ఏ కింద కేసు నమోదు కావడం ఇదే మొదటి సారి. ఈ చట్టం ప్రకారం ఒక వ్యక్తిని విచారణ లేకుండానే రెండు సంవత్సరాల వరకు నిర్బంధించవచ్చు. ఇటీవల దోడా జిల్లా మెజిస్ట్రేట్‌పై అభ్యంతరకరకర వ్యాఖ్యలు చేసిన కొద్ది రోజులకే పోలీసులు మెహ్రాజ్ మాలిక్‌పై ఈ చట్టాన్ని ప్రయోగించారు. మాలిక్ అరెస్టుకు వ్యతిరేకంగా దోడాలో భారీ నిరసనలు చెలరేగాయి. పరిస్థితిని అదుపు చేయడానికి అధికారులు కర్ఫ్యూ విధించి ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. ఈ ఘర్షణల్లో పోలీసులు, నిరసనకారులు గాయపడ్డారు. ఈ అరెస్టుపై రాజకీయ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీజేపీ ఈ అరెస్టును సమర్థిస్తుండగా మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వంటి ఇతరపార్టీల నాయకులు మాత్రం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ప్రజాస్వామ్యంపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణిస్తున్నారు.

# సంక్షిప్తంగా..

## అసోంలో భూకంపం.. రిక్టర్ స్కేల్‌పై 5.8గా నమోదు




**గౌహతి, సెప్టెంబరు 14:** అసోంలో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 5.8 తీవ్రతగా నమోదైంది. ఉదల్‌గిరి జిల్లాలోని ధెకియజులి ప్రాంతానికి 16 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 5కిలోమీటర్ల లోతులో ఇది సంభవించిందన్నారు. భూకంప తీవ్రతకు పలు ఇళ్లు స్వల్పంగా ఊగినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ప్రాణ, ఆస్తినష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, మయన్మార్, చైనాలోనూ భూ ప్రకంపనలు వచ్చినట్లు తెలిసింది. అసోంలోని ఇదే ప్రాంతంలో వారం క్రితం 3.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ప్రధాని మోడీ ప్రస్తుతం అసోం పర్యటనలోనే ఉన్న విషయం తెలిసిందే.

## చైనా నౌకలను అడ్డుకొన్న తైవాన్




**తైపెయి సిటీ, సెప్టెంబరు 14:** తైవాన్ కోస్ట్‌గార్డ్ అడ్మినిస్ట్రేషన్ (సిజిఎ) శనివారం చైనాకు చెందిన నౌకలను అడ్డుకొంది. వీటిల్లో బీజింగ్‌కు చెందిన కోస్ట్‌గార్డ్ నౌక ఒకటి కాగా మరొకటి భారీ చేపల పడవగా చెబుతున్నారు. రెండు నౌకలు డాంగ్‌షా ద్వీపం వద్ద కార్యకలాపాలు సాగిస్తుండగా ఈ ఘటన చోటుచేసు కొంది. దీంతో తైవాన్-చైనా మధ్య దక్షిణ చైనా సముద్ర జలాల్లో ఉద్రిక్తతలు పెరిగిపోయాయి. ఫోకస్ తైవాన్ పత్రిక కథనం ప్రకారం గురువారం ఉదయం 6.15 గంటల సమయంలో రెండు చైనా నౌకల ను డాంగ్‌షా-నాంషా వద్ద గుర్తించారు. ఇవి ఇంకా నిషేధిత ప్రదేశానికి కొంచెం దూరంలో ఉండటంతో 2,000 టన్నుల కట్టర్ తైనాన్ అనే షిప్‌ను రంగంలోకి దించారు. అది శుక్రవారం చైనా కోస్ట్‌గార్డ్ నౌకను వెన్నంటే ఉండటంతో అది అక్కడి నుంచి వెళ్లిపోయింది. అయితే ఆ రోజు రాత్రి చైనా చేపలవేట నౌక నిషేధిత ప్రాంతానికి చేరుకొంది. దీంతో రెండు తైవాన్ నౌకలు అక్కడికి చేరుకొని దానిని అడ్డగించాయి. దీంతో అది వెనక్కి వెళ్లిపోయింది.

## మాడ్రిడ్‌లో చర్చల వేళ అమెరికాపై చైనా దర్యాప్తులు షురూ



**బీజింగ్, సెప్టెంబరు 14:** అమెరికా రెండు అంశాల్లో తప్పుడు విధానాలు అవలంబిస్తోందని ఆరోపిస్తూ చైనా ఒకేసారి రెండు దర్యాప్తులు మొదలు పెట్టింది. స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో రెండు దేశాల మధ్య చర్చలు మొదలుకానున్న వేళఇది జరగడం గమనార్హం. మాడ్రిడ్ సమావేశంలో జాతీయ భద్రత, టిక్ టాక్ సోషల్ మీడియా యాజ మాన్య హక్కుల వంటివి చర్చకు రానున్నాయి. అమెరికా సెమీకండక్టర్లను లక్ష్యంగా చేసుకొని చైనా ఈ దర్యాప్తులు చేపట్టింది. కొన్ని ఐసి చిప్స్‌లో అమెరికాపై యాంటీ డంపింగ్ ఇన్వెస్టిగేషన్‌ను మొదలు పెట్టింది. వీటిని అమెరికాలోని టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఆన్ చిప్స్ సంస్థలు తయారుచేస్తుంటాయి. చైనాలో తయారైన సెమీకండెక్టర్లపై అమెరికా వివక్ష చూపుతోందంటూ మరో దర్యాప్తు చేపట్టింది. ఆదివారం మాడ్రిడ్‌లో చైనా వైస్‌ప్రీమియర్ లిఫెంగ్, అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ భేటీ అయ్యారు. శుక్రవారం అమెరికా ప్రభుత్వం 23 సంస్థలను ఆంక్షల పరిధిలోని జాబితాలో చేర్చడంతో చైనా ప్రతీకారంగా ఈ నిర్ణయం తీసుకుంది. వీటిల్లో చైనా చిప్స్ తయారీ సంస్థ ఎస్ఎంఐసి కూడా ఉంది.

# మా కన్నీళ్లు ఆరకముందే పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లా..

## పహల్గావ్ బాధితుల ఉద్వేగం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** తమ కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదని పహల్గామ్ బాధిత కుటుంబాలు వాపోయాయి. భారత్‌పాకిస్థాన్ మధ్య క్రికెట్ మ్యాచ్‌ను బహిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్ పహల్గామ్‌లోని బైసరన్ మైదానంలో పాక్ ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పర్యాటకులతో సహా 26 మంది మరణించారు. ఈ సంఘటన నేపథ్యంలో పాకిస్థాన్‌తో భారత్ అన్ని విధాలా తెగదెంపులు చేసుకున్నది. మేలో ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ సైనిక చర్య చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. కాగా, పహల్గామ్ ఉగ్రదాడి జరిగిన తర్వాత సుమారు ఐదు నెలలకు ఆదివారం నుంచి దుబాయ్‌లో భారత్, పాకిస్థాన్ క్రికెట్ జట్ల మధ్య ఆసియా కప్ టోర్నీ జరుగనున్నది. అయితే ఈ నిర్ణయం తీసుకున్న బీసీసీఐతో పాటు కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి. పహల్గామ్ బాధిత కుటుంబాలు కూడా దీనిపై స్పందించాయి. పాక్‌తో మ్యాచ్‌ను భారత్ ఆటగాళ్లు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 'మా కన్నీళ్లు ఇంకా ఆరిపోలేదు. పాకిస్థాన్‌తో మ్యాచ్ ఏమిటి?' అని భర్త, కుమారుడ్ని కోల్పోయిన కిరణ్‌బెన్ ప్రశ్నించారు. మరోవైపు ఆమె చిన్న కుమారుడు సావన్ పర్మార్ కూడా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పహల్గామ్ దాడిలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులుకూడా అమరులయ్యారని గుర్తు చేశారు. భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరుగుతోందని తెలిసి తాము చాలా కలత చెందినట్లు చెప్పారు. 'పాకిస్థాన్‌తోఅన్ని సంబంధాలు తెంచుకున్నామని ప్రధాని మోదీ అన్నారు. మరి మనం ఇంకా ఈ ఆట ఎందుకు ఆడుతున్నాం? మేం ఇంకా దుఃఖిస్తున్నాం. ఈ ఆట ఆడాల్సిన అవసరం ఏమిటి?' అని ఆయన ప్రశ్నించారు.

# బీహార్‌లో 243 స్థానాల్లోను పోటీచేస్తాం

## మహాకూటమి కీలకనేత తేజస్వియాదవ్ సంచలనం



**ముజఫరాపూర్(బీహార్), సెప్టెంబరు 24:** బీహార్ అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జేడీ) నేత తేజస్వి యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేసి రాజకీయ వేడిని రాజేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాల్లోనూ తమ పార్టీయే పోటీ చేస్తుందని ప్రకటించి మహాఘట్‌బంధన్ కూటమిలో ప్రకంపనలు సృష్టించారు. సీట్ల పంపకాలపై మిత్రపక్షాలతో చర్చలు జరగాల్సి ఉండగా, తేజస్వి చేసిన ఈ ఏకపక్ష ప్రకటన కూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేసింది. ముజఫర్‌పూర్‌లోని కాంతిలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి, ఈసారి ప్రజలు తన ముఖం చూసి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డ ఆయన, కేవలం నినాదాలతోనే ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. బీహార్ నుంచి ఓట్లు, గుజరాత్‌లో ఫ్యాక్టరీలు ఈ ఎత్తుగడలు ఇకపై చెల్లవని వ్యాఖ్యానించారు. తమ ఒత్తిడి వల్లే ప్రభుత్వం పెన్షన్, ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తోందని, తాము ముందుంటే ప్రభుత్వం తమను అనుసరిస్తోందని అన్నారు. ఆర్‌జేడీ అధికారంలోకి వస్తే ఉపాధి, అభివృద్ధికి పెద్దపీట వేస్తామని తేజస్వి హామీ ఇచ్చారు. తమ పార్టీ ప్రకటించిన మై బెహన్ యోజన ను కాపీ కొట్టి ప్రభుత్వం మహిళలకు రూ.10,000 ఇస్తోందని, కానీ తాము గెలిస్తే ఐదేళ్లలో ప్రతి మహిళకు లక్షన్నర రూపాయలు అందిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసిన తేజస్వి, రూ.80 వేల కోట్లకు లెక్కలు చెప్పడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో వంతెనలు కూలిపోతున్నాయని, ఆసుపత్రుల్లో రోగులకు భద్రత కరువైందని, అయినా ప్రభుత్వం అవినీతిపరులను వదిలేసి ఎలుకలకు రక్షణ కల్పిస్తోందని ఎద్దేవా చేశారు. 2020 ఎన్నికల్లో ఆర్‌జేడీ 144 స్థానాల్లో పోటీ చేసి 75 గెలవగా, కాంగ్రెస్ 70 స్థానాల్లో పోటీకి దిగి కేవలం 19 సీట్లకే పరిమితమైంది. ఈసారి జేఎంఎం, ఎల్జేపీ వంటి పార్టీలు కూడా కూటమిలో చేరాయి. ఈ నేపథ్యంలో సీట్ల సర్దుబాటు కీలకంగా మారిన సమయంలో, అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తామన్న తేజస్వి ప్రకటన మిత్రపక్షాలను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.

### భద్రతా వలయం ఛేదించుకుని తేజస్వి కాళ్లపై పడ్డయువకుడు!

బీహార్‌లో ప్రతిపక్ష నాయకుడు, ఆర్జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్‌పర్యటనలో భద్రతాలోపం తలెత్తింది. ముజఫర్‌పూర్ జిల్లా పర్యటనలో భాగంగా ఒక కార్యక్రమంలో పాల్గొన్న తేజస్వి యాదవ్ హెలికాప్టర్‌లో తిరిగి వెళ్లేందుకు సిద్ధపడుతుండగా ఓ యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని పరుగుపరుగున ఆయన దగ్గరికి వచ్చి పాదాలపై పడ్డాడు. దీనికిముందు ముజఫర్‌పూర్‌లోని కాంతి స్కూల్‌లో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తేజస్వి యాదవ్ ఆవిష్కరించారు. అనంతరం పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొని బయలుదేరేందుకు సిద్ధమయ్యారు. సరిగ్గా అప్పుడే నల్లటి చొక్కా ధరించిన ఒక యువకుడు సెక్యూరిటీ వలయాన్ని ఛేదించుకుని తేజస్వి చెంతకువచ్చి ఆయన పాదాలపై పడ్డాడు. దాంతో ఒక్కసారిగా తేజస్వి దిగ్భ్రాంతికి గురయ్యారు. భద్రతా సిబ్బంది ఆ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. యువకుడి పేరు షరీఫుల్ ఇస్లామ్‌గా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తేజస్వియాదవ్‌పై ఉన్న అభిమానానికి నిదర్శనమని కొందరు.. భద్రతా లోపమని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు.

## టేకాఫ్ కాకుండానే రన్‌వేపై నిలిచిపోయిన ఇండిగో



**లక్నో, సెప్టెంబరు 14:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నో విమానాశ్రయంలో ఆదివారం ఊహించని ఘటన చోటు చేసుకుంది. లక్నో నుంచి ఢిల్లీ వెళ్తున్న ఇండిగో విమానంలో టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో విమానం పైకి ఎగురలేక రన్‌వేపైనే ఆగిపోయింది. దీంతో పైలట్ చాకచక్యంగా వ్యవహరించి టేకాఫ్‌ను నిలిపివేశారు. ఆసమయంలో సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ సహా 151మంది ప్రయాణికులు విమానంలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. టేకాఫ్ నిలిపివేసిన అనంతరం ప్రయాణికులను కిందకు దించి వేరే విమానంలో ఢిల్లీకి పంపారు.

## గగనతలాన్ని కాపాడిన మిగ్ 21లకు రిటైర్మెంట్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 21:** భారత వాయుసేనకు దాదాపు అర్ధశతాబ్దానికి పైగా సేవలు అందించి గగనతలాన్ని కాపాడిన మిగ్-21లకు ఇప్పుడు రిటైర్మెంట్ ప్రకటించారు. అయితే వీటిని కొనుగోలు చేసేందుకు చాలా సంస్థలు క్యూ కట్టాయి. కనీసం ఒక్క దానినైనా సొంతం చేసుకోవాలని పోటీ పడుతున్నాయి. వాయుసేన మిగ్-21 ఫైటర్‌జెట్ రిటైర్మెంట్ తర్వాత విద్యాసంస్థలు వార్ మెమోరి యల్స్ మిలిటరీ మ్యూజియాలు వీటి ఎయిర్ ఫ్రేమ్‌ను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం వద్ద క్యూకట్టాయి. సెప్టెంబర్ 26న రెండు స్క్వాడ్రన్ల ఈ యుద్ధ విమానాలకు తుది వీడ్కోలు పలకనున్నారు.

15-09pg6exHMNWJQEP 10_15-09pg6exHMNWJQEP.qxd 9/15/2025 12:51 AM Page 1



# ఆక్వాను ఆదుకోండి - కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ

## - అమెరికా సుంకాలతో రాష్ట్రంలో ఆక్వాకు తీవ్ర నష్టాలు వచ్చాయి - దేశీయ వినియోగంతో పాటు ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని ముఖ్యమంత్రి వినతి

**విజయవాడ,సెప్టెంబర్14, ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికా సుంకాలతో ఇబ్బందిపడుతున్న ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఆక్వా రైతులు నష్టపోకుండా కేంద్ర స్థాయిలో కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని కోరుతూ చంద్రబాబు వివిధ కేంద్ర మంత్రులకు లేఖలు రాశారు. దేశీయంగానూ ఆక్వా ఉత్పత్తుల వినియోగం పెరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్, వాణిజ్యపరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు సీఎం విడివిడిగా లేఖలు రాశారు. జీఎస్టీ, ఆర్థిక వెసులుబాట్లు వంటి అంశాలను పరిశీలించాలని కేంద్ర ఆర్థిక మంత్రికి, ఇతర దేశాలతో ఆక్వా విషయంలో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలని కేంద్ర వాణిజ్యపరిశ్రమల శాఖ మంత్రికి, దేశీయ మార్కెట్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మత్స్య శాఖ మంత్రికి లేఖలు రాశారు. రాష్ట్రంలో ఆక్వా రైతులు, ఆ రంగంపై ఆధారపడిన కుటుంబాలు తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయని సీఎం తన లేఖల్లో పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చంద్రబాబు కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ స్థాయిలో జరిగే రొయ్యల ఎగుమతుల్లో ఏపీ నుంచి 80 శాతం వాటా ఉందని.. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల్లో 34 శాతం వాటా ఏపీ కలిగి ఉందని సీఎం పేర్కొన్నారు. సుమారు రూ. 21,246 కోట్ల విలువైన సముద్ర, మత్స్య ఉత్పత్తులు ఏపీ నుంచి ఎగుమతి అవుతున్నాయని సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఆక్వా రంగం మీద ఆధారపడి 2.5 లక్షల ఆక్వా రైతు కుటుంబాలు, 30 లక్షల మంది ఆక్వా అనుబంధ రంగాలపై ఆధారపడిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లో సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమెరికా విధించిన సుంకాలతో రొయ్యలు ఎగుమతులపై ఎక్కువగా ప్రభావం పడిందని ఆయన స్పష్టం చేశారు. దాదాపు రూ. 25 వేల కోట్ల మేర నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నట్టు సీఎం తన లేఖల్లో పేర్కొన్నారు. 50 శాతం మేర ఎగుమతుల ఆర్డర్లు రద్దు అయ్యాయయని లేఖలో వివరించారు. దాదాపు 2 వేల కంటైనర్లలో జరుగుతున్న ఎగుమతులపై రూ. 600 కోట్ల మేర సుంకాల భారం పడిందని తెలిపారు. ఆక్వా రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని.. ఆక్వా ఫీడ్ ఉత్పత్తిదారులతో జరిపిన చర్చల ఫలితంగా కేజీ ఆక్వా ఫీడ్ ఎమ్మార్పీపై రూ. 9 మేర తగ్గించ గలిగామన్నారు. సబ్సిడీతో ట్రాన్స్ ఫార్మర్లు సరఫరా చేసేందుకు కూడా ఆలోచన కూడా చేస్తున్నామని సీఎం తన లేఖల్లో వివరించారు. రాష్ట్రం ప్రభుత్వంతో పాటు కేంద్ర సాయం కూడా ఆక్వా రైతులను నిలబెట్టేందుకు అవసరమవుతుందని కేంద్ర మంత్రులకు రాసిన లేఖలో ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఎగుమతి దారులకు..ఆక్వా కంపెనీలకు బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం, వడ్డీ చెల్లింపులపై 240 రోజుల పాటు మారటోరియం విధించాలని కోరారు. వడ్డీ రాయితీ కల్పించడంతోపాటు... ఫ్రొజెన్ రొయ్యలపై ఉన్న 5 జీఎస్టీని తాత్కాలికంగా మినహాయించడం వంటి చర్యలు తీసుకోవాలని సీఎం లేఖల్లో కోరారు. ఈ చర్యలతో పాటు అమెరికా కాకుండా ఇతర దేశాలకు ఆక్వా మార్కెట్ ను విస్తరించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు.

యూరోపియన్ యూనియన్, సౌత్ కొరియా, సౌదీ, రష్యా దేశాల్లో ఆక్వా ఎగుమతులు పెరిగేలా ఆయా దేశాలతో ఫ్రీ ట్రేడ్ ఒప్పందాలు కుదుర్చుకునే అంశాలను పరిశీలించాలని లేఖల్లో ముఖ్యమంత్రి కోరారు. ఎగుమతి దారులకు మధ్యంతర ఆర్థిక సహాయం, ఎగుమతులపై విధించే సుంకాలు, పన్నుల ఉపశమనం పథకంపై మరింత స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యూరోపియన్ యూనియన్ దేశాలకు సీఫుడ్ సరఫరా చేయడానికి తాము సిద్దంగా ఉన్నట్టు ఎగుమతిదారులు తనకు విజ్ఞప్తి చేశారని సీఎం చంద్రబాబు వివరించారు.

ఈ చర్యలతో పాటు దేశీయంగా ఆక్వా మార్కెట్ పెంచుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



జాతీయ సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

# సమాజ మనుగడకు కళలు దోహదం చేస్తాయి

## డా. పట్టాభి కళాపీఠం వ్యవస్థాపక ఛైర్మన్ డా. తూములూరి రాజేంద్రప్రసాద్

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** సమాజ మనుగడకు సాహిత్యం, కళలు దోహదం చేస్తాయని డా. పట్టాభి కళాపీఠము వ్యవస్థాపక ఛైర్మన్ డా. తూములూరి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం గుంటూరు ఎస్.హెచ్.వో హాలులో జాతీయ సాంస్కృతిక ఉత్సవాల పోస్టర్ ను సాహితీవేత్తలతో కలసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ శాఖలు మల్లెతీగ సాహిత్యసేవాసంస్థతో కలిసి రచయితలు, కళాకారులు, కార్టూనిస్టుల కోసం నవంబరులో విజయవాడలో ఒక గొప్ప సాహిత్య సాంస్కృతిక సంబరం చేయడం నేటి అవసరంగా భావిస్తున్నానన్నారు. ఈ వేదికను ఔత్సాహికులందరూ వినియోగించు కోవాల్సిందిగా కోరారు. ఉత్సవాల కమిటీ గుంటూరు పట్టణ కార్యదర్శి బండికల్లు జమదగ్ని మాట్లాడుతూ ఎలాంటి రుసుమూ లేకుండా ప్రతినిధులందరికీ ఉచిత ప్రవేశం కల్పిస్తున్నామని, ముందుగా పేరు నమోదు చేసుకుని వేడుకల్లో పాల్గొన్నవారికి సత్కారం చేయాలని కమిటీ నిర్ణయించిందని, కవులు,రచయిత(త్రు)లు,కార్టూనిస్టులు,కళాకారులు తమ పేరు, వివరాలు పంపి నమోదు చేసుకోవాలని కోరారు.

ఇతర వివరాలకు 9246415150, 83329 03156 నెంబర్లలో సంప్రదించవచ్చారు. కార్యక్రమంలో మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీ, ఉపాధ్యక్షుడు చొప్పా రాఘవేంద్రశేఖర్, సింగర్ ఎస్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.



# శ్రీవారి అనుగ్రహం మహిళా శక్తిపై ఉండాలి

## - తిరుమలలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

**తిరుమల,సెప్టెంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహం దేశంలోని మహిళాశక్తిపై కలగాలని లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా తెలిపారు. తిరుపతిలో తొలిసారిగా జరుగుతున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఆదివారం ఉదయం రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌సింగ్, ఏపి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజుతో కలసి ఓంబిర్లా తిరుమల ఆలయం వద్దకు విచ్చేశారు. వీరికి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన బిర్లా అనంతరం ఆనంద నిలయంలోనికి చేరుకని శ్రీవేంకటేశ్వరస్వామినికి దర్శించుకున్నారు. ఆశీస్సులందుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఓంబిర్లా, హరివంశ్‌సింగ్, అయ్యన్నపాత్రుడు, రాఘురామరాజుకు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. వీరితోబాటు ఇన్ఫోసిస్ అధినేత, ఎంపి సుధానారాయణమూర్తి, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ శ్రీవారిని దర్శించుకున్నారు.

# అద్భుతంగా ముగిసిన రాయలసీమ నృత్యకళోత్సవాలు

**తిరుపతి,సెప్టెంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** నాటక రంగాన్ని పరిరక్షించుకుంటూ కళాకారులను ప్రోత్సహించేదిశగా ప్రతి ఏడాది క్రమం తప్పకుండా రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చేపడుతున్న నృత్యోత్సవాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ఆదివారం ఉదయం ఒంగోలు జానపద బృందం కళాకారులు సుగాలి నృత్యం ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. కళాకారులకు ప్రదర్శన బహుమతిగా శ్రీవేంకటేశ్వరస్వామి ప్రతిమలను అందజేశారు. విజేతలకు పురస్కారాలు, బహుమతులు అందజేశారు. తిరుపతి మహతి కళాక్షేత్రంలో మూడురోజులు జరిగిన రాయలసీమ రంగస్థలి నృత్యకళోత్సవాలు కళాకారులను, ఆహుతులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు శ్రీకృష్ణదేవ రాయ పురస్కారాలను నిర్వాహకులు రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, ,కళాకారులు కెఎన్ రాజ, విజయభాస్కర్‌రెడ్డి, కోండే చెంగారెడ్డి,తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరావు ,మల్లారపు వాసు ప్రదానం చేశారు.



# తిరుమలలో జడివాన

**తిరుమల,సెప్టెంబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం వేకువజాము నుండి ఉదయం 9గంటల వరకు తిరుమలలో జడివాన కురిసింది., వేకువజామున 4గంటలనుండి మోస్తరుగా కురిసిన వాన ఆ తరువాత చిరుజల్లులతో బలంగా పడింది. ఆదివారం ఉదయం తిరుమలలో శ్రీవారి దర్శనానికి వచ్చిన ప్రముఖులు, భక్తులు గొడుగులక్రింద సేదదీరారు. అంతేగాక వానలోనే స్వామివారిని దర్శించుకున్నారు. జడివానతో తిరుమలలో వాతావరణం పూర్తిగా మారిపోయింది. చల్లటిగాలులు వీస్తున్నాయి

# ఆడపిల్లలను అదనపు భారంగా భావించవద్దు

## - హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్





విజయవాడలో బాలికల భద్రత,రక్షణపై జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో ప్రసంగిస్తున్న ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్,ఇతర న్యాయ ప్రముఖులు

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆడపిల్లలను ఎప్పుడు అదనపు భారంగా భావించడం కూడదని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ అన్నారు.ఆడపిల్లలను మనం బాధ్యతగా స్వీకరించి,వారి వ్యక్తిత్వాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా సామాజిక తీర్చిదిద్దాలన్నారు.వారిలో సృజనాత్మక,ఆలోచనా విధానం ఒక ఉన్నతమైన సమాజాన్ని తీర్చిదిద్దుతుందన్నారు. భారతదేశంలో బాలికలు, సురక్షిత వాతావరణం,.సంరక్షణ, అనే అంశంపై రాష్ట్ర స్థాయి ఆదివారం విజయవాడ లోని తుమ్మలపల్లి కాలాక్షేత్రం లో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ముఖ్య అతిధిగా హాజరయి,మాట్లాడుతూ ఈ సమావేశం ఒక బాలిక సంరక్షణకు సంబంధించినదన్నారు. చరిత్రలోకి వెళితే, మహిళలు ఎలా బాధపడ్డారో మనం చూశామని, ముఖ్యంగా ఈ దేశంలో ప్రారంభంలో సతి సహగమనం అనే ఆచారం ఉండేదని, సామాజిక సంస్కర్త రాజా రామ్ మోహన్ రాయ్ కృషి వల్ల ఆ ఆచారం నిషేధించబడిందన్నారు. అనేక సంవత్సరాలుగా మహిళల బాధలు మరియు వేదనలు తగ్గినప్పటికీ, మహిళాలపై వివక్ష పూర్తిగా తొలగించబడలేదన్నారు. సాధారణంగా సంవత్సరాలుగా ఒక మహిళను ఎవరైతే ఎక్కువ లేదా బాలికను కుటుంబానికి ఆస్తిగా కాకుండా భారంగా చూసారో ఆ సమాజానికి ఆపాదించబడుతుందన్నారు. చాలా కుటుంబాలలో ఒక బాలికను బాధ్యతగా కాకుండా ఒక భారంగా పరిగణిస్తారు. బాలికలు కుటుంబానికి సహకరించలేరని, అందువల్ల వీలైనంత త్వరగా ఆమెకు వివాహం చేయాలనే ప్రయత్నాలు జరుగుతాయన్నారు. అందువలన బాల్య వివాహాలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. బాలికల రక్షణ గురించి చట్టపరమైన ఫ్రేమ్ వర్క్ ఉన్నప్పటికీ, నిజ జీవితంలో దానికి కార్యరూపం అనుకున్నంత స్థాయిలో జరగడం లేదన్నారు. ప్రపంచ జాబితా ప్రకారం నేడు 90 మిలియన్ల మంది పిల్లలు లైంగిక హింసను అనుభవిస్తున్నారన్నారు, ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది మహిళలు మరియు పురుషులు వారి బాల్యంలో అలాంటి హింసకు గురయ్యారన్నారు. 1.6 బిలియన్ల మంది పిల్లలు తప్పకుండా వారి ఇంట్లో సంరక్షకుల ద్వారా హింసాత్మక శిక్షను భరిస్తున్నారన్నారు. హింసాత్మక క్రమశిక్షణను అనుభవించే పిల్లలలో మూడింట రెండు వంతులు శారీరక శిక్షకు మరియు మానసిక దూషణకు గురవుతున్నారన్నారు. నలుగురు చిన్న పిల్లల్లో ముగ్గురు తమ సంరక్షకుల ద్వారా క్రమం తప్పకుండా హింసకు గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పాఠశాలలో హింస ఉందని, దాదాపు 130 మిలియన్లు, 13 నుండి 15 సంవత్సరాల వయస్సు గల ముగ్గురిలో ఒకరి కంటే ఎక్కువ మంది విద్యార్థులు బెదిరింపులకు గురవుతున్నారన్నారు.. ప్రపంచంలోని పిల్లలలో 86 మందిని చట్టం ద్వారా శారీరక శిక్ష నుండి పూర్తిగా రక్షించబడలేదన్నారు. ఇప్పుడు ఆన్లైన్ లో 30 దేశాల్లోని యువకులలో మూడింట ఒక వంతు మంది ఆన్లైన్ వేధింపులకు గురవుతున్నట్లు నివేదించారు. 2020లో 153,000 కంటే ఎక్కువ వెబ్‌సైట్‌లు బాల లైంగిక వేధింపుల చిత్రాలను కలిగి ఉన్నట్లు నివేదించబడ్డాయని , ఇది అంతకు ముందు సంవత్సరం కంటే 16 ఎక్కువని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా లైంగిక హింస విస్తృతంగా ఉందని, సుమారుగా 15 మిలియన్ల మంది కౌమార బాలికలు 15 నుండి 19 సంవత్సరాల మధ్య బలవంతపు లైంగిక సంబంధాన్ని లేదా ఇతర బలవంతపు లైంగిక చర్యలను వారి జీవితకాలంలో అనుభవించారని తెలిపారు. అంగవైకల్యాలు కలిగిన పిల్లలు వైకల్యం లేని పిల్లల కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ హింసకు గురయ్యే అవకాశం ఉందన్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో నివేదిక ప్రకారం వారిలో 90 మంది కుటుంబానికి తెలిసిన వారిచే దాడికి గురయ్యారని, ఇది చాలా భయంకరమైనదన్నారు.

# ఎన్ఎఫ్ఐఆర్ నూతన జాతీయ కార్యవర్గం

## - జాతీయ ప్రధాన కార్యదర్శిగా మరోసారి ఎన్నికైన డాక్టర్ మర్రి రాఘవయ్య - రైల్వే జోనల్ కార్యదర్శిగా ఎన్నికైన భరణి భాను ప్రసాద్

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 14,ప్రభాతవార్త** నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ (ఎన్ఎఫ్ఐఆర్) జాతీయ మహాసభల్లో తెలుగు రాష్ట్రాలు మరోసారి తమ సత్తాను చాటుకున్నాయి. ఇటీవల న్యూఢిల్లీలోని కర్నయిల్ సింగ్ స్టేడియంలో 31వ జాతీయ మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో సమాఖ్య ప్రతినిధులు రాబోయే కాలవ్యవధికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్ఎఫ్ఐఆర్ అధ్యక్షులుగా గుమాన్ సింగ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మర్రి రాఘవయ్య, కోశాధికారిగా ఆర్‌పి సింగ్, తెలుగు రాష్ట్రాల దక్షిణ మధ్య రైల్వే జోనల్ కార్యదర్శిగా ఎం భరణి భాను ప్రసాద్‌లను సమాఖ్య ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు వర్కింగ్ కమిటీ సభ్యులుగా యు వెంకటేశ్వర్లు, కె విఆర్ ప్రసాద్, ఎం వెంకటేశ్వరరావు, కె ప్రభాకర్, అరుణ్ కుమార్, ప్రభురాజ్, రమణయ్య, డి సత్యవాణిలను ఎన్నుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లివ్వాలి



**విజయవాడ, సెప్టెంబర్ 14, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ బిసిలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు, మహిళా బిల్లులో బిసి మహిళకు ప్రత్యేక సబ్‌కోటా ఇవ్వాలన్నారు. చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్‌లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నరసారావు, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, ఉపాధ్యక్షులు ఎలమందరావు, బిఎస్ఆర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్షుడు నర్సారెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జికి పార్టీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డితోపాటు సిద్దిపేట నియోజకవర్గఇన్‌చార్జి పూజల హరి కృష్ణకు పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిపై గజ్వేల్‌కు చెందిన దళితులు, పార్టీ శ్రేణులు ఫిర్యాదు చేయడంతో నర్సారెడ్డిని గాంధీభవన్‌కు పిలిపించి షోకాజ్ నోటీసు జారీ చేశారని పార్టీ వర్గాలు తెలిపారు. పిసిసి క్రమశిక్షణ కమిటీకి వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని సూచించినట్లు వివరించారు. అలాగే సిద్దిపేట నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణపై సైతం పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌కు 10మందికిపైగా సిద్దిపేటకు చెందిన నాయకులు ఫిర్యాదు చేయడంతో వివరణ ఇవ్వలని పిసిసి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీచేసిందని పార్టీ శ్రేణులు తెలిపారు.

# రాహుకాల సమయంలో అంతరాలయ దర్శనాలకు చెక్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 14 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇక మీదట రాహుకాల సమయంలో అంతరాలయ దర్శనాలకు ఆలయ ఇఒ డి.బాపిరెడ్డి నిర్ణయం తీసుకున్నారు. దళారుల దందాకు చెక్ పెట్టారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో విఐపిల కోసం ఏర్పాటు చేసిన 'అంతరాలయ దర్శనాలు'కు రూ.500ల టిక్కెట్లు ఏర్పాటు చేసారు.ఈ అవకాశాన్ని దళారులు సద్వినియోగం చేసుకుంటూ ఉన్నారు. అంతేకాకుండా అంతరాలయానికి వచ్చిన విఐపిల నుంచి అర్చకులకు కూడా తట్టల్లో ఘనంగానే సంభావనలు దక్కేవి. అయితే సామాన్య భక్తులు ఆ సమయంలో నొచ్చుకునే వారు. కొన్ని సమయాల్లో సామాన్య భక్తులు సంయమనం మరచి రెచ్చిపోయి సిబ్బంది మీద తిరగబడే సందర్భాలు లేకపోలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి దేశ విదేశాల నుంచి భక్తులు వస్తున్నారు. వారి భక్తిభావాన్ని పరిరక్షించుటకు దేవస్థానం ఎన్నో చర్యలు తీసుకుంటుంటే దళారులు ఆ అవకాశాలను కకూడా సద్వినియోగం చేసుకుంటున్నారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనానికి దేవస్థానం రూ.500లు టిక్కెట్లు ఖరారు చేసారు. ఎవరైనా సరే అంతరాలయ దర్శనానికి వెళ్ళాలంటే ఈ టిక్కెట్టు కొనుక్కోవాల్సిందే అని ఖరారు చేసారు.ఈ నిర్ణయం దళారులకు వరంగా మారింది. వచ్చిన విఐపిలకు అంతరాలయ దర్శనం చేయిస్తామంటూ వేల రూపాయలు దండుకోవటం మొదలెట్టారు. అయితే రాహుకాల సమయంలో అంతరాలయ దర్శనాలతో భక్తుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంది. అంతేకాక స్వామి గర్భగుడి వద్ద ఉన్న సిబ్బందిపై సామాన్యభక్తులు తెలియక తిరుగుబాటు చేసే వారు.ఈ అంశాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఇఒ బాపిరెడ్డి ఎలాగోలా చెక్‌పెట్టాలని నిర్ణయించారు.

# జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో బిసిలకు రిజర్వేషన్ కల్పించాలి: సిపిఐ రామకృష్ణ

## - విజయవాడలో కాంగ్రెస్ నేతలు రఘువీరా, శివాజీ

**విజయవాడ,సెప్టెంబరు 14,ప్రభాతవార్తప్రతినిధి:** జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థలలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. బీసీలకు స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కల్పించాలనే అంశంపై ఆదివారం విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రఘువీరారెడ్డి, కొలనుకొండ శివాజీ, జల్లి విల్సన్, దోనేపూడి శంకర్, కోటేశ్వరరావు, ఇతర ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జన గణనతో పాటు, కులగణన కూడా చేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ కల్పించిన విధంగా.. బీసీలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఈ రెండు అంశాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనిట్లు చెప్పారు. పక్కన ఉన్న తెలంగాణాలో కుల గణన అమలు చేశారని, కర్నాటలో కూడా ప్రకటించారని.. మన ఏపీలో కూడా కుల గణన జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. బీసీ రిజర్వేషన్ సాధించుకునేందుకు ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలపై ఈరోజు సమావేశంలో చర్చిస్తున్నామన్నారు. 143 వెనుక బడిన కులాలు ఉండగా, బీసీలకు స్థానాలు తగ్గించడం వల్ల బీసీలు పదవులు కోల్పోయారని చెప్పారు. తెలంగాణాలో కుల గణన జరిగిన నేపథ్యంలో బీసీలకు పదవులు వచ్చాయని, ఏపీలో కూడా ఇదే విధంగా కుల గణన చేపట్టి.. బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తీర్మానం చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపుతామని రామకృష్ణ పేర్కొన్నారు. రఘువీరారెడ్డి,

కొలను కొండ శివాజీలు మాట్లాడుతూ తెలంగాణా,కర్ణాటకలో బీసీ ముసాయిదాను అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రకటించాయన్నారు.నిర్దిష్ట ప్రామాణికాలతో బీసీ సర్వేను నిర్వహించి, తదనుగుణంగా రూపొందిన నివేదికపై చర్చించి.తర్కించి రిజర్వేషన్లు అమలు చేసారన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో 7,441 బిఇడి సీట్లు భర్తీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** రాష్ట్రంలో బ్యాచ్‌లర్ ఆఫ్ ఎడ్యుకేషన్(బి.ఇడి) సీట్ల భర్తీకి నిర్వహించిన రెండో విడత టిజి ఎడ్‌సెట్ కౌన్సె లింగ్‌లో 7,441 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. ఈ మేరకు ఆదివారం టిజి సెట్స్ కన్వీనర్ పాండురంగారెడ్డి

సీట్ల కేటాయింపు వివరాలు వెల్లడించారు.రెండో విడత కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటాలో మొత్తం 10,005 బి.ఇడి సీట్లు అందుబాటులో ఉండగా, 12,076 మంది వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో 9,955 సీట్లు కేటాయించగా, 4,474 మంది విద్యార్థులు రిపోర్టింగ్ చేసినట్లు తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 18 వరకు కాలేజీల్లో రిపోర్టింగ్ చేయాలని అన్నారు.

# ఇంజినీర్స్ డే సందర్భంగా టిఎస్ సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** తమ మేధో శక్తితో మానవ మనుగడకు ఎన్నో ఫలాలను అందించిన ఘనత ఇంజినీర్లదేనని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఇంజనీర్లందరికీ ముఖ్యమంత్రి ఇంజనీర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ఆర్థికాభివృద్ధికి, భారతావని ప్రగతికి బలమైన పునాదులు నిర్మించిన భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినమైన సెప్టెంబర్ 15ను పురస్కరించుకొని, ఆయన జ్ఞాపకార్థం ఇంజనీర్స్ డేగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజి నీరుగా, దార్శని కుడిగా, విద్యాప్రదాతగా, నిపుణుడిగా, పారిశ్రామిక ప్రగతి చోదకుడిగా ప్రత్యేకతను చాటారన్నారు. అత్యుత్తమ ఇంజనీరింగ్ సాంకేతికతతో వివిధ రంగాలలో ఆయన చేసిన కృషి భారతదేశ ఇంజనీరింగ్ రంగానికి ఆదర్శంగా నిలిచాయని సిఎం చెప్పారు. మూసీ వరదల నుంచి హైదరాబాదు నగరాన్ని రక్షించేందుకు జల నియంత్రణ ప్రణాళికలు,ఎన్నో గొప్ప నిర్మాణాలు చేపట్టటంలో ప్రత్యేక చొరవ చూపించారన్నారు.

# యూరియా కొరత తీవ్రం

## పంట చేతికి రాదనుకొని మరణించిన రైతు

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** రాష్ట్రంలో యూరియా కొరత తీవ్రతరం అవుతోంది. యూరియా బస్తాలు దొరకపోవడంతో పంట చేను చేతికి రాదన్న మనస్తాపంతో ఒక యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. రాష్ట్రంలోని కొత్తగూడెం జిల్లా, ఇల్లందు మండలం, ధనియాలపాడు పంచాయతీ పరిధిలోని సేవ్యాతండాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల తెలిపారు.


# కీచక టీచర్ కటకటాల్లోకి

## వెరిటాస్ సైనిక్ పాఠశాలలో విద్యార్థినిపై ఉపాధ్యాయుని లైంగిక దాడి

**ములుగు, సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్ చక్కదిద్దాల్సిన పాఠశాలలో ఉపాధ్యాయుడు వారిపై లైంగిక కోరిక చూపితే ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్‌కు చెబితే పాఠశాల నుంచి రెడ్ టీసీ ఇచ్చి పంపిస్తామని హెచ్చరించిన సంఘట ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో చోటుచేసుకుంది. బాధిత విద్యార్థిని కుటుంబసభ్యులు, గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి అందించిన వివరాల మేరకు... హైదారాబాద్‌కు చెందిన ఓ విద్యార్థిని 9వ తరగతి చదువుతుంది. కాగా ఈనెల 4న సాయంత్రం విద్యార్థులందరూ చదువుకుంటున్నారు. అదే సమయంలో పాఠశాలలోని ప్రణయ్ అనే ఉపాధ్యాయుడు వచ్చి ఉపాధ్యాయుల దినోత్సవం కోసం తరగతి గదిని డెకరేషన్ చేయాల్సి ఉందని ఓ విద్యార్థిని తీసుకొని వెళ్లారు. తరగతి గదిలోకి వెళ్లగానే లైట్స్ ఆఫ్‌చేసి ఆ విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాధిత విద్యార్థి ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లింది.

15-09Pg7exHMNWJQE 11_15-09Pg7exHMNWJQE.qxd 9/15/2025 12:47 AM Page 1





## అలయ్ బలయ్ కార్యక్రమానికి రండి

### సిఎం రేవంత్‌రెడ్డికి దత్తాత్రేయ ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** జూబ్లీహిల్స్ నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డిని ఆదివారం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే నెల 3న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో జరిగే అలయ్ బలయ్ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డిని దత్తాత్రేయ ఆహ్వానించారు. ఈ మేరకు సిఎంకు ఆహ్వాన పత్రికను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయను సిఎం రేవంత్ శాలువా కప్పి సత్కరించారు. కాగా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని బండారు దత్తాత్రేయ నిర్వహిస్తారు. రాజకీయాలకు అతీతంగా అలయ్ బలయ్ వేడుకలు ప్రతీ యేడాది దసరా సమయంలో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రతి యేటా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు, అధికారులు, సెలబ్రిటీలు, ప్రముఖులు పాల్గొంటారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయాలకు అతీతంగా నాయకులను ఒకే వేదికమీదకు తీసుకురావాలనే ఉద్దేశంతో 2005లో అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.

## టైంస్కేల్ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదు

### రాష్ట్ర గిరిజన హాస్టల్, ఆశ్రమం పాఠశాల డైలీవేజ్ వర్కర్ల జెఎసి నేతలు

**హైదరాబాద్ (ముషీరాబాద్), సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లకు టైమ్ స్కేల్ ఇచ్చేవరకు సమ్మె విరమించేది లేదని తెలంగాణ గిరిజన హాస్టల్, ఆశ్ర మం పాఠశాల డైలీవేజ్ వర్కర్ల జెఎసి నేతలు ఎం. పాపారావు, బి.మధు, నాగేశ్వరరావు, బ్రహ్మాచారి, గోపాల్‌లు స్పష్టం చేశారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేస్తూ గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ వర్కర్లు న్యాయమైన డిమాండ్ల సాధనకై ఈనెల 12 నుంచి సమ్మె ప్రారంభించారని గుర్తు చేశారు. టైస్కేల్‌తో పాటు సమాన పనికి సమాన వేతనం, పాత పద్ధతిలోనే వేతనాల చెల్లింపులు, చనిపోయిన కాంటినెంట్స్ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం వంటి డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా ఎటువంటి స్పందన లేకపోవటంతో సమ్మెకు దిగవలసి వచ్చిందని తెలిపారు. జిల్లాలలో సమ్మె చేస్తున్న డైలీ వేజ్ వర్కర్లను అధికారులు ఫోన్‌లు చేసి, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదరించటం సరికాదని, సమ్మెచేసే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఉద్యాన పంటలకు ప్రోత్సాహకం

### రైతులకు రాయితీలు ప్రకటించిన డైరెక్టర్ యాస్మిన్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులకు రాయితీలు ఇవ్వాలని ఆ శాఖ నిర్ణయం తీసుకుంది. ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహించేందుకుగాను రైతులకు వివిధ రాయితీలు అందించేందుకు ప్రణాళికను రూపొందించింది. సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా అందిస్తున్న రాయితీలు, నిధులను ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా ప్రకటించారు. తెలంగాణలో కొత్తగా ఉద్యాన తోటల విస్తీర్ణాన్ని పెంచేందుకు పలు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 9,902 ఎకరాలకు సంబంధించి మామిడి, అరటి, జామ, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, బత్తాయి వంటి పండ్ల తోటల సాగు నిమిత్తం 18.48 కోట్ల రూపాయలను కేటాయించారు. అదేవిధంగా కూరగాయల సాగు నిమిత్తం 10 వేల ఎకరాల విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యానికి గాను 9.60 కోట్ల రూపాయలు, 2,949 ఎకరాల్లో ఉల్లి సాగు కోసం 2.35 కోట్ల రూపాయలు కేటాయింపులు చేశారు.

అలాగే రాష్ట్రంలోని 2,549 ఎకరాల్లో పూల సాగు నిమిత్తం 2.06 కోట్ల రూపాయలు, 3,294 ఎకరాల్లో అల్లం, వెల్లుల్లి సాగుకు సంబంధించి 5.33 కోట్ల రూపాయలను కేటాయించారు. ఈవిధంగా ప్రకటించిన ఉద్యాన పంటల సాగు నిమిత్తం అన్ని విభాగాల్లో 40 శాతం రాయితీని రైతులకు అంద చేయనున్నారు. వీటితోపాటు, అదనంగా పుట్టగొడుగుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు గాను వాటి యూనిట్లకు 1.08 కోట్ల రూపాయలను కేటాయింపులు చేశారు. పాత తోటల పునరుద్ధరణకు మరో 2 కోట్ల రూపాయలు, నీటి వనరుల సృష్టి కోసం 2.73 కోట్ల రూపాయలు, ప్లాస్టిక్ మల్చింగ్ కోసం 14.24 కోట్ల రూపాయలను కేటాయించారు. వీటికి 40 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు. ఇక సేంద్రీయ సాగు, నర్సరీల ఏర్పాటు, విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, పాలీహౌజ్‌లు, కోల్డ్ స్టోరేజీలు వంటి యూనిట్ల ఏర్పాటుకు 30 నుంచి 50 శాతం వరకు రాయితీ ఇవ్వనున్నారు.

## సుప్రీంకోర్టు తీర్పు నుండి ఇన్‌సర్వీస్ టీచర్లకు రక్షణ కల్పించాలి

### ఎస్‌టిఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** టెట్‌పై ఈ నెల 1న సుప్రీంకోర్టు ఐదేళ్ళ పైబడి సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్ళలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్ )ఉత్తీర్ణులు కావాలని లేదంటే ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ ఇచ్చిన తీర్పు నుండి సీనియర్ టీచర్లకు రక్షణ కల్పించాలంటే విద్యాహక్కు చట్టంలో సెక్షన్ 23 ను సవరించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉపాధ్యాయులు అప్ డేట్ కావటానికి తాము వ్యతిరేకం కాదని, అయితే 2010కి ముందే నియామకమైన టీచర్లకు టెట్ మినహాయింపు ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. 15 సంవత్సరాల తర్వాత హఠాత్తుగా రెండేళ్లలో పరీక్ష పాస్ కావాలంటే సీనియర్ టీచర్లు ఆందోళన చెందుతున్నారని, దీంతో ఏర్పడే సంక్షోభాన్ని నివారించడానికి తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేయాలన్నారు. జాతీయ విద్యావిధానం సవరించాలని, సిపిఎస్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఆదాయ పన్ను పరిమితిని పెంచాలని, సమగ్ర శిక్ష ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో నిర్వహిస్తున్న దేశవ్యాప్తం క్యాంపైన్‌లో భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రెండేళ్ల కాలంలో వీలైనన్ని ఎక్కువ పర్యాయాలు టెట్ పరీక్ష నిర్వహించి అవసరమైన ఉపాధ్యాయులందరూ ఉత్తీర్ణులు అయ్యేలా అవకాశం కల్పించాలన్నారు. డిగ్రీ, బిఎడ్ అర్హతలతో ఎస్జీటీలుగా నియామకమైన ఉపాధ్యాయులకు ఓడిఎల్ (ఓపెన్ అండ్ డిస్టెన్స్ లర్నింగ్) పద్ధతిలో జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ల ద్వారా డిఎడ్ స్వల్పకాలిక శిక్షణను అందించి టెట్ పేపర్ 1 వ్రాసుకోవడానికి అర్హత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముందు ఇటీవల మరణించిన సిపిఐ జాతీయ నాయకులు సురవరం సుధాకర్ రెడ్డికి నివాళులర్పించారు.

## సింగరేణి మనుగడను సర్కారు కాపాడాలి

### మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** తెలంగాణలో ఏకైక ప్రభుత్వరంగ పరిశ్రమగా ఉన్న సింగరేణి మనుగడను ప్రభుత్వం కాపాడాలని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సింగరేణిపై సమీక్ష చేసి, సింగరేణి కార్మిక వర్గాన్ని తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడారని మండిపడ్డారు. సింగరేణి పట్ల డిప్యూటీ సిఎం భట్టికి మరింత శ్రద్ధ ఉండాలని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రాంతం పట్ల, సింగరేణి సంస్థ పట్ల ప్రేమ లేదు అని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడిన మాటలను ఆయన ఖండించారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లా డారు. సింగరేణిని కాపాడాలని కెసిఆర్ అనేక ప్రయత్నాలు చేశారని, కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దేశవ్యాప్తంగా 1400 బొగ్గు బ్లాకులను ప్రయివేటీకరణకు నిర్ణయం తీసుకున్నారని, కార్పొరేట్ సంస్థలను కాపాడటం కోసం బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరణ చేశారని చెప్పారు.

తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాకులన్నీ సింగరేణికి దక్కాలని కెసిఆర్ అన్నారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక 4 బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరణ చేశారని, 4 బొగ్గు బ్లాకులను కాపాడటం కోసం కెసిఆర్, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ప్రయత్నం చేసిందని పేర్కొన్నారు. కేంద్రంలో బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి బొగ్గు బ్లాకుల వేలం పాటలో కలిసి పాల్గొన్నారని గుర్తు చేవారు. సింగరేణిని కాపాడాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. ఒడిశాలో నైనీ బొగ్గు బ్లాకు ఎట్లా వచ్చిందని, కర్ణాటకలో కాపర్, బంగారం గనులను సింగరేణి దక్కించుకుందని సింగరేణి సంస్థ ప్రకటించిందని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్నా కాంగ్రెస్ సింగరేణికి ఏం చేయలేదని విమర్శించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ తెస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, సింగరేణి సంస్థలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రులు, ఎమ్మెల్యేల ఆధిపత్యం పెరిగి, సింగరేణి నాశనం అయ్యే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. సింగరేణి సిఎండి కాంగ్రెస్ చెప్పుచేతల్లో పనిచేస్తున్నారని ఆరోపించారు.

## అటవీప్రాంతం గుండా నూతన రోడ్డు మార్గాలు

### మేడారం జాతర ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క



**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** వచ్చే జనవరిలో జరిగే మహా మేడారం జాతరను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం పనులను వేగవంతం చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం మేడారం జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె దగ్గరుండి పరిశీలిచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రహదారులు చాలా ముఖ్యమైనవని, జిల్లా ఎస్పీతోపాటు మేడారం సర్కిల్‌లో పనిచేసే పోలీస్ అధికారులతో కలిసి కొత్తరోడ్లను పరిశీలించినట్లు తెలి పారు. ప్రస్తుతం ఉన్న మార్గాలను వెడల్పు చేయడంతో పాటు కొత్తరోడ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. అటవీ ప్రాంతంగుండా నూతన రహదారి మార్గా లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా కొండపర్తి నుంచి గోనెపల్లి, ముత్తాపురం మీదుగా పడికాపురం వరకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని, కాల్వ పల్లి నుంచి కన్నెపల్లికి వచ్చే దారిని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాల్వపల్లి నుంచి ఊరటం వరకు వచ్చే దారిలో బీటీ రోడ్డు వేస్తున్నామని, అడవి దారులను డెవలప్ చేసుకుని వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తులందరూ మేడారం ఆలయం వరకు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఛత్తీస్‌గడ్, ఖమ్మం వైపు నుంచి వచ్చే భక్తులకు చిన్నబోయినపల్లి మీదుగా ఊరటం దాకా రహదారి మార్గాన్ని కల్పిస్తామని, మేడారం మహా జాతర లోపు రూ 16.5 కోట్లతో కొండాయి బ్రిడ్జి కంప్లీట్ చేస్తామని, దీనికి సంబంధించి నిధులను సీఎం ఇప్పటికే మంజూరు చేశారు చేసినట్లు తెలిపారు. జాతర సమయంలో ఎక్కడికక్కడ అటవీ ప్రాంతంలో పార్కింగ్ ప్లేస్‌లను ఏర్పాటు చేస్తామని, మట్టి రోడ్లను, బీటి రోడ్లను ఏర్పాటు చేస్తాం వచ్చిపోయే భక్తులకు ఇబ్బంది లేకుండా డివైడర్లను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమ్మక్క సారలమ్మ కీర్తిని మరింత పెంచే విధంగా యజ్ఞంలా పనిచేస్తున్నట్లు తెలిపారు. కొంతమంది తమ ప్రయోజనాల కోసం దేవుడి దగ్గర చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆదివాసి పూజారుల ఆలోచన, విశ్వాసం నమ్మకం, ఆచారం లకు అనుగుణంగా సమ్మక్క సారలమ్మ గుడిని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఒక ఆదివాసి బిడ్డగా ఆదివాసి జీవితాన్ని తెలిసిన వ్యక్తిగా మొదటి నుంచి ఆదివాసి సాంప్రదాయాలు ఆచారాలను కాపాడుతున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో కొందరు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే అడ్డుకున్నానని, ఆదివాసి సంప్రదా యాలకు భంగం వాటిల్లకుండా పనులు చేయించే బాధ్యత నాదిసమ్మక్క సారలమ్మ కీర్తి ఇనుమడింప చేసే విధంగా మేడారం ఆధునీకరణ పనులు జరుగుతాయన్నారు.

## గద్వాల జిల్లా కెటిఆర్ సభ అట్టర్‌ఫ్లాప్

### మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** తేరు మైదానానికి ఒక చరిత్ర ఉందని, దాన్ని కెటిఆర్ అబద్దాలకు అడ్డగా మార్చి నడిగడ్డ ప్రతిష్టను దిగజార్చి పోయాడని మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ మండిపడ్డారు. అలంపూర్ నియోజక వర్గంలో గెలిచిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు అభివృద్ధిపై ఆలోచన లేదు అని వారికి ఫ్యూడలిస్టు, శాడిస్ట్ రాజకీయాలు చేయడమే తప్ప ప్రజా సమస్యలపై అవగాహన లేదని సంపత్ కుమార్ అన్నారు.

శనివారం సభలో కెటిఆర్ మాట్లాడుతూ గురుకుల హాస్టల్‌లో ఎలుకలు దూరుతున్నాయని చేసిన విమర్శను సంపత్ కుమార్ తిప్పికొట్టారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నటువంటి రోజుల్లో తాను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కలిసి కొట్లాడి అలంపూర్ నియోజకవర్గానికి అత్యధిక గురుకులాలను తీసుకువచ్చానని గుర్తుచేశారు. అలంపూర్ నియోజకవర్గంలో ఒక్కటంటే ఒక్క డబుల్ బెడ్ ఇల్లు కట్టలేదని, ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అలంపూర్ నియోజకవర్గంలో 3500 పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లకు నిర్విఘ్నంగా నిర్మాణం జరుగుతుం దన్నారు. ఇది ప్రజాపాలనకు దర్పం పడుతుందని అన్నారు. పదేళ్ల రాజకీయంలో మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి రాష్ట్రాన్ని అప్పులపాలు చేసి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా మాట్లాడడం తగదన్నారు.

పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ గురించి కూడా మాట్లాడే అర్హత కెటిఆర్‌కు లేదని సంపత్ కుమార్ అన్నారు.

టిఆర్ఎస్ పరిపాలనలోనే ఆ కంపెనీకి స్వయంగా కెటిఆర్ చేతుల మీదుగా 9 పర్మిషన్లు ఇచ్చాడు అని అన్నారు. దళితులు, బిసిల గురించి మాట్లాడే నైతికత కెటిఆర్‌కి లేదన్నారు.

## దేశ సమగ్రతకు పునాది హిందీ

### కులాలు, మతాల పేరిట దేశాన్ని విచ్ఛిన్నం చేయకండి: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



అవార్డులను ప్రదానం చేస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** అధికార బాషగా హిందీ ఈ దేశ సమగ్రతకు బలమైన పునాదిగా నిలిచిందని పలువురు వక్తలు చెప్పారు. టిపిసిసి మైనార్టి సెల్ ఛైర్మన్ రాజేష్‌కుమార్ అగర్వాల్, తెలంగాణ హిందీ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఎన్ఎస్ కుమార్ అధ్యక్షతన ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యసంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'హిందీ దివస్' కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులుగా పిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్‌గౌడ్, గౌరవ అతిధులుగా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాలరావు, ఎఐసిసి కార్యదర్శి శశ్వనాథన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక కమిషన్ ఛైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. మహేష కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కొంతమంది తమ స్వార్థ రాజకీయల కోసం కులాలు, మతాలు పేరిట దేశాన్ని విచ్ఛిన్నం చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిం చారు. రాజకీయాలు అనేవి పదవుల కోసం మాత్రమేనని, ఇంకొందరు తమ పదవులు కాపాడు కోవ డానికి దిగజారుడు రాజకీయాలకు పాల్పడు తున్నారని ఆరోపించారు.

ఇది దేశ భవిష్యత్తుకు మంచిది కాదన్నారు. 1949లో భారత రాజ్యాంగ సభ హిందీని దేశ అధికార భాషగా ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రపం చీకరణ ప్రభావంతో ఇంగ్లీషుకు ప్రాధాన్యత పెరిగినప్పటికి హిందీ తన స్థానాన్ని కోల్పోలేదన్నారు. తెలంగాణ లౌకిక వాదానికి పెట్టింది పేరని, భాష, ప్రాంతం అనే భేదం లేదన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ భాషలు, మతాలు వేరైనా మనమంతా భారతీయులమని, పరస్పరం గౌరవించుకుంటూ కలిసి, మెలిసి జీవించాలని, మర్వాడీలపై దాడులు సరికాదన్నారు.

హిందీ జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.సర్వర్, ప్రదీప్ సురానీ, లక్ష్మీనారాయణ రాఠి, సిఎ మురళిమనోహర్ పలోడ్, భీమ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. హిందీ దివస్ సందర్భంగా పలువురికి ముఖ్య అతిధులు అవా ర్డులను ప్రదానం చేశారు.

## 'సెప్టెంబరు 17'ను తెలంగాణ విలీన దినోత్సవంగానే నిర్వహించండి

### సిఎం రేవంత్‌రెడ్డికి సిపిఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 14:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సెప్టెంబర్ 17ను గత ఏడాది తెలంగాణ ప్రజాపరిపాలన దినంగా నిర్వహించారని, ఈ ఏడాది కూడా అదే పేరుతో నిర్వహించనున్నట్లు తమకు తెలిసిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు తెలిపారు. విమోచన దినోత్సవాన్ని ప్రజాపాలన దినంగా నిర్వహించడం వల్ల నాటి చారిత్రాత్మక పోరాటాన్ని ఏ మాత్రం ప్రతిబింబించడం లేనందున తెలంగాణ విలీన దినోత్సవంగానే నిర్వహించడం సముచితమని పేర్కొన్నారు. ఇందుకు తగు నిర్ణయం తీసుకోవాలని ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆదివారం లేఖ రాశారు. ఈ మేరకు ఆ వివరాలతో కూడిన ప్రకటనను కూనంనేని విడుదల చేశారు. నాటి మహత్తర తెలంగాణ స్వాతంత్ర్యోద్యమ, రైతాంగ సాయుధ పోరాట చరిత్రను రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠ్యాంశాలలో చేర్చాలని ఆయన సిఎంకు సూచించారు. అమరవీరుల స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, అందులో ఆనాటి పోరాటంలో అసువులు బాసిన అమరుల పేర్లను, ఫోటోలను ప్రతి గ్రామం నుంచి అధికారికంగా సేకరించి భావితరాలకు మార్గదర్శకంగా ఉండేలా స్మారక కేంద్రంలో మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆ లేఖలో కోరారు. హైదరాబాద్‌లో నాటి పోరాట యోధులు రావి నారాయణ రెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి ఒకే చోట, దొడ్డి కొమరయ్య, షేక్ బందగీ, బొమ్మగాని ధర్మభిక్షం, చాకలి ఐలమ్మ లాంటి ఆనాటి సాయుధ పోరాట యోధుల విగ్రహాలను ముఖ్య ప్రదేశాలలో ఏర్పాటు చేస్తే తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని కూనంనేని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. తొలి సార్వత్రిక ఎన్నికల్లో నెహ్రూను మించిన మెజారిటీ పొందిన ప్రజానాయకుడు రావి నారాయణరెడ్డి విగ్రహాన్ని పార్లమెంటులో పెట్టాలని కోరారు. నాటి తెలంగాణ స్వాతంత్ర్య పోరాట నాయకుల పేర్లు చిరస్థాయిగా నిలిచే విధంగా వివిధ ప్రభుత్వ పథకాలకు, ప్రాజెక్టులకు నామకరణం చేయాలని సూచించారు. పలు సభలలో నాటి కమ్యూనిస్టు పార్టీ, నాయకులు చేసిన వీరోచిత పాత్రను శ్లాఘించడం, అలాగే వీరనారి చాకలి అయిలమ్మ పేరును మహిళా యూనివర్సిటీకి, తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టినందుకు కమ్యూనిస్టు పార్టీ తరపున ప్రత్యేకించి అభినందనలు తెలియజేస్తున్నామని సిఎంకు తెలిపారు. చరిత్రపై సంపూర్ణ అవగాహన ఉన్న వారిగా పై ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తారని ఆశిస్తున్నానని కూనంనేని వెల్లడించారు.

## గ్రూప్-1 ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాకూడదని కెటిఆర్ కుట్ర

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రూప్ 1 ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో రాకూడదని కెటిఆర్ కుట్ర పన్నుతున్నారని ఎంపి చామల కిరణ్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి కెటిఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గ్రూప్ 1 పరీక్షలలో 563 అభ్యర్థుల దగ్గర మూడు కోట్ల రూపాయలు లెక్కన తీసుకొని ప్రభుత్వం వాళ్ళను ఎంపిక చేసిందని అంటున్నారు. మీ హయాంలో మీరెట్లా ఉద్యోగాలు ఇవ్వలేదు, మీ హయాంలో గ్రూప్ 1, 2, 3 4, పెట్టే పరిస్థితి లేదన్నారు. మా సిఎం రేవంత్ రెడ్డి నిరుద్యోగల కోసం చిత్తశుద్ధితో పని చేస్తున్నారని అన్నారు. తల్లిదండ్రులు, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందుకెళ్లుతున్నామని, న్యాయనిపుణుల సలహాలు తీసుకుని ఎట్టి పరిస్థితుల్లో కూడా అడ్డంకులు రావద్దన్న సదుద్దేశంతో గ్రూప్ 1 పరీక్షలు పెట్టామన్నారు. 563 మంది తల్లిదండ్రులు ఒక్కొక్కరు మూడు కోట్లు పెట్టే స్తోమత ఉంటుందా? మీ హయాంలో ఎవరికి ఉద్యోగాలు ఇవ్వని మీరు మీకు ఓటేయని ప్రజలు బాధపడుతూ ఉండాలనుకుంటున్నారా? అంటూ ప్రశ్నించారు. రాజకీయ ప్రయోజనం తప్ప ప్రజల మీద నీకు ప్రేమ లేదని, అమెరికాలో చదువుకుని ఉద్యోగం చేస్తూ ఇండియాకు వచ్చి మంత్రి పదవి చేపట్టిన నీకు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఎలా మాట్లాడతావు అంటూ ప్రశ్నించారు. రాజకీయ దురుద్దేశంతో ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారంటూ మండిపడ్డారు. తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కెటిఆర్‌కి గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన నిరుద్యోగుల తల్లిదండ్రులు మీడియా ముందుకు వచ్చి బుద్ధి చెప్పాలన్నారు. శనివారం కెటిఆర్ మాట్లాడిన మాటలు నిజమా కాదా తెలియాలి అంటే తల్లిదండ్రులు స్పందించాలన్నారు.



పాతబస్తీ చార్మినార్ పరిసర ప్రాంతాల్లో మర్కాజి మిలాద్ ఊరేగింపు

## పాతనగరంలో మిలాద్ ఊరేగింపు..

### పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**హైదరాబాద్ (చార్మినార్), సెప్టెంబరు 14, ప్రభాతవార్త :** మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ఆదివారం నిర్వహించిన మిలాద్ ర్యాలీ ప్రశాంతంగా కన్నుల పండుగగా కొనసాగింది. దక్షిణ మండలం పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. చార్మినార్, గుల్జారా హౌస్, మదీనా, దారుషిఫా, ఓల్గా హోటల్, శాలిబండ, హుస్సేనీఆలం, మొగల్‌పుర, భవానీనగర్, చాంద్రాయణగుట్ట, కాలాఫత్తర్, కామాటిపుర బహదూర్‌పుర, నయాపూల్, సిటీ కళాశాల చౌరస్తా, మూసాబౌలి, మిశ్రీగంజ్, కాజీపుర, కిల్వత్, వట్టెపల్లి, కిషన్‌బాగ్, ఫత్తర్‌గట్టితో పాటు వివిధ ప్రాంతాలలో మిలాద్ ర్యాలీని నిర్వహించారు. పాతబస్తీ మిశ్రీ గంజ్ దర్గా నుంచి ప్రారంభమైన మిలాద్ ఊరేగింపు పలు ప్రాంతాల మీదుగా కొనసాగిన అనంతరం చార్మినార్‌కు చేరుకుంది. కాగా పాతనగరంలోని పలు ప్రాంతాలు నుంచి వచ్చిన ర్యాలీలు చార్మినార్‌వద్ద ప్రధాన ర్యాలీలో కలిశాయి.

ప్రశాంతమైన వాతావరణంలో ర్యాలీని నిర్వహించామని మిలాద్ మర్కాజీ ఊరేగింపు జాయింట్ కన్వీనర్, ఖాద్రియా ఇంటర్నేషనల్ సొసైటీ అధ్యక్షులు ఖాద్రి తెలిపారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక నుంచి నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ ఊరేగింపులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రమన్ సింగ్, దక్షిణ మండలం డిసిపి స్నేహా మెహ్రాతో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఊరేగింపులో ఒంటెలు, గుర్రాలు ఉన్నాయి. చార్మినార్, మక్కామసీదు, గుల్జారాహౌస్‌తోపాటు పలుచోట్ల వేదికలు ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. మిలాద్ ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలోని పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. చార్మినార్, గుల్జారాహౌస్, మదీనా ప్రధాన రహదారులలో నిలబడి ప్రజలు మిలాద్ ఊరేగింపును తిలకించారు. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా నిర్వహించిన ఊరేగింపు ప్రశాంతంగా జరిగిందని చార్మినార్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.

## పెరిగిన చికెన్ ధరలు

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** నాన్ వెజ్ ప్రియులకు భారీ షాక్ తగిలింది. రాష్ట్రంలో చికెన్ ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి. హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కిలో చికెన్ ధర 240 రూపాయలుగా ఉంది. వారానికి సుమారు 20 రూపాయల చొప్పున ధర పెరుగుతూ వచ్చి ప్రాంతాలను బట్టి ఇప్పుడు ఏకంగా 240 నుండి 260 రూపాయల వరకూ ధర పలుకుతోంది. దీంతో సాధారణ, మధ్య తరగతి కుటుంబాలకు చికెన్ ధరల పెరుగుదల పెద్ద భారమైంది. వారానికి ఒకటి రెండు సార్లు చికెన్ తినే వారు ఇప్పుడు వినియోగాన్ని తగ్గించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా చేపలు, గుడ్లు వైపు మొగ్గచూపుతున్నారు. కాగా ఇప్పటి వరకూ శ్రావణ మాసం, వినాయక చవితి కారణంగా అంతగా డిమాండ్ లేకుండా ఉండటంతో చికెన్ ధరలు స్థిరంగా ఉన్నాయి. అయితే దసరా పండుగ సమయం దగ్గరపడు తుండటంతో మళ్లీ చికెన్ కొనుగోళ్లు విపరీతంగా పెరిగాయి. దసరా సంద ర్భంగా ఇంటింటా విందులు, వేడుకలు ఉండటంతో చికెన్‌కు డిమాండ్ ఏర్పడింది.

## పాత పెన్షన్ అమలు చేసే పార్టీలకే మా ఓటు

### పాట్నా పెన్షన్ సంఘర్ష్ సభలో ఎన్ఎంఒపిఎస్ సెక్రటరీ జనరల్

**హైదరాబాద్, సెప్టెంబరు 14, ప్రభాతవార్త:** పాత పెన్షన్ అమలు చేసేవారికి ఓటు వేయాలని నేషనల్ మూవ్మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ పిలుపునిచ్చారు. ఆదివారం బీహార్ రాష్ట్ర రాజధాని పాట్నాలో మిల్లర్ హై స్కూల్ గ్రౌండ్ లో ఆధ్వర్యంలో పెన్షన్ సంఘర్ష్ భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రప్రభుత్వ ఉద్యోగి పెన్షన్ రాష్ట్ర పరిధిలోనిది. ఇటీవల దేశంలో పార్టీలు తమ మ్యానిఫెస్టోలో సిపీఎస్ రద్దు పాత పెన్షన్ అమలు చేస్తామని తెలంగాణ, కర్ణాటక లో సిపీఎస్ ఉద్యోగుల మద్దతుతో అధికారంలోకి వచ్చాయన్నారు. ఇప్పుడు ఈ ఎన్నికల్లో బీహార్ లో కాంగ్రెస్ పార్టీ ,రాష్ట్రీయ జనతా దళ్‌లు, తెలంగాణ ,కర్ణాటక ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఆయా రాష్ట్రాల్లో పాత పెన్షన్‌ను పునరుద్ధరించకుండా బీహార్‌లో సిపీఎస్ ఉద్యోగుల ఆయా పార్టీలకు మద్దతు ఇస్తున్నారన్నారు. ఇటీవల కేంద్రం యూ.పి.యెస్ ప్రకటించడం ద్వారా, రెండు దశాబ్దాల తర్వాత ఎన్.పి.యెస్ నిష్ప్రయోజనమైందన్నారు. ఉద్యోగికి కంట్రిబ్యూషన్ తో సంబంధం లేకుండా ఒపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ యూ. పి.యెస్ విధానం ద్వారా ఇప్పటికి ఎన్. పి.యెస్ ట్రస్ట్ ద్వారా షేర్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టిన 10.53 లక్షల కోట్లకు మరింతగా కంట్రిబ్యూషన్ ను పెంచి ప్రవేటు పెట్టుబడిదారులకు అప్పజెప్పడమేనన్నారు. 2004 నుండి అమల్లోకి తెచ్చిన పి.ఎఫ్ ఆర్ డి ఏ బిల్లు 2013 సెప్టెంబర్ లో పార్లమెంట్‌లో పాస్ చేయించారని ఇప్పటివరకు వ జమైన మొత్తం నిధి అంతా ఇష్టా రాజ్యంగా షేర్ మార్కెట్ లోకి పెట్టుబడులుగా వెళ్లాయని ఆయన ఆరోపించారు. ఎన్. పి.యెస్ పై నిరసనలు వెల్లువెత్తటంతో, కావాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు మార్చుకోవచ్చని అంటూనే ఇన్నాళ్ళు ఎన్.పి.ఎస్ లో జమకాబడిన మొత్తాలను కేంద్రం ఇవ్వదని ఒపీఎస్ ను పునరుద్ధరించిన రాష్ట్రాలకు స్పష్టం చేయడం ,రాష్ట్ర ఉద్యోగుల పై రాష్ట్రాల అధికార స్వేచ్ఛ హరించడమేన్నారు.

15-09pg10 12 ONG_15-09pg10.qxd 9/15/2025 12:42 AM Page 1





## హాంకాంగ్ ఓపెన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమి

**న్యూఢిల్లీ:** హాంకాంగ్ ఓపెన్ 2025లో సాత్విక్-చిరాగ్ జోడీ ఓటమితో రన్నరప్‌గా సరిపెట్టుకుంది. ఈ భారత జంట చైనాకు చెందిన ఆరో సీడ్ వీ కెంగ్ లియాంగ్ మరియు చాంగ్ వాంగ్ ద్వయం చేతిలో ఓడిపోయింది. ఆదివారం జరిగిన హాంకాంగ్ ఓపెన్ సూపర్ 500లో భారత బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి రన్నరప్‌గా నిలిచారు. ఎనిమిదో సీడ్ రాంకిరెడ్డి-శెట్టి జోడీ చైనాకు చెందిన ఆరో సీడ్ వీ కెంగ్ లియాంగ్‌చాంగ్ వాంగ్ జోడీ చేతిలో 21-19, 14-21, 17-21 తేడాతో పరాజయం చెందింది. 2025 బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లతో సహా ఐదు సెమీఫైనల్స్‌లో నిష్క్రమణలను ఎదుర్కొన్న ఈ భారత జంట హాంకాంగ్ ఓపెన్‌ను ఒక గంటలోపు పోటీని ముగించింది. రెండవ గేమ్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ ప్రదర్శన నిరాశాజనకంగా ప్రారంభమైంది. ఆట సగం ముగిసే సమయానికి 5-11తో వెనుకబడి ఉంది. ఆ తర్వాత ఈ జంట తమ లక్ష్యాన్ని మరింతగా పెంచుకుని, త్వరలోనే అంతరాన్ని కేవలం రెండు పాయింట్లకు తగ్గించింది. అయితే, వారు తమ లయను కోల్పోయి చివరికి రెండవ సెట్‌ను 14-21తో వదులుకున్నారు. మూడవ మరియు చివరి గేమ్‌లో, చైనాకు చెందిన వీచాంగ్ 0-6తో ప్రారంభంలో ఆరు పాయింట్ల ఆధిక్యాన్ని సాధించి, దాన్ని 11-2కి పెంచారు. అయితే భారత జంట తీవ్రంగా పోరాడి 17-20తో అంతరాన్ని తగ్గించింది. కానీ తదుపరి పాయింట్‌లో షటిల్‌ను వైడ్ చేసి మ్యాచ్‌ను వదులుకుంది. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష య సేన్, చైనాకు చెందిన రెండో సీడ్ షి



## వరల్డ్ కప్ నింగ్బోలో మేఘనకు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ నింగ్బో-2025లో మేఘనా సజ్జనార్ తొలి కాంస్యం సాధించగా, స్వప్నిల్ కుసాలే ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించింది. చైనాలోని నింగ్బోలో ఆదివారం జరిగిన ఈ ప్రపంచ కప్‌లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో మేఘనా సజ్జనార్ కాంస్యం గెలుచుకోవడం ద్వారా తన తొలి వ్యక్తిగత అంతర్జాతీయ పతకాన్ని సాధించింది. 31 ఏళ్ల మేఘనా 632.6 స్కోరుతో క్వాలిఫైయింగ్‌లో ఏడో స్థానంలో నిలిచి పతక రౌండ్‌కు చేరుకుంది. ఫైనల్‌లో అస్థిరమైన ప్రారంభం ఉన్నప్పటికీ, ఆమె 230.0 షూట్ చేసి కాంస్యం సాధించడానికి పట్టుదలతో ప్రయత్నం చేసింది. ఈ టోర్నీలో చైనాకు చెందిన టీనేజర్ పెంగ్ జిన్లు 255.3 పాయింట్లతో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించి స్వర్ణం సాధించగా, నార్వేకు చెందిన ఒలింపియన్ జీనెట్ హెగ్ డ్యూస్టాడ్ 252.6 పాయింట్లతో రజతం గెలుచుకుంది. కాగా భారత్‌కు చెందిన పారిస్ 2024 కాంస్య పతక విజేత స్వాప్నిల్ కుసాలే పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్లలో పరాజయాన్ని చవిచూశాడు. 587-30+తో 21వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు దూరమయ్యాడు. ఇక కిరణ్ అంకుష్ జాదవ్ నాల్గవ స్థానంలో (590-31+) అర్హత సాధించినా, చివరి రౌండ్ ప్రారంభంలోనే నిష్క్రమించాడు. ఈషా, మేఘన మరియు కిరణ్ తప్ప, మరే ఇతర భారతీయ షూటర్లు నింగ్బోలో ఫైనల్స్‌కు చేరుకోలేదు. ఒలింపిక్ పతక విజేత మను భాకర్ ఈ ఈవెంట్‌లో పాల్గొనలేదు. దీంతో మేఘనా పోడియం ఫినిషింగ్‌తో, భారత్ రెండు పతకాలతో టోర్నమెంట్‌ను ముగించింది. ఇప్పటికే శనివారం ఇషా సింగ్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణం సాధించింది.

### ఆస్ట్రేలియాతో మహిళల వన్డేలో..

## భారత్ 281 పరుగుల స్కోర్

### వరల్డ్ రికార్డు బద్దలు కొట్టిన స్మృతి, ప్రతీక

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాతో వన్డేలో భారత్ మహిళా క్రికెట్ జట్టు భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన, ప్రతీకా రావల్ అద్భుత ప్రదర్శన కనపరిచారు. ఇద్దరూ అర్ధ శతకాలతో చెలరేగి 100కు పైగా పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. ఈ క్రమంలోనే పాతికేళ్లుగా బెలిండా క్లార్క్-లిసా కైట్లీ పేరిట ఉన్న వన్డే ప్రపంచ రికార్డును స్మృతి-ప్రతీకా బద్దలు కొట్టారు. ఆదివారం న్యూ ఛండీగఢ్‌లోని మహారాజా యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరిగిన తొలి అంతర్జాతీయ మహిళల వన్డే సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత జట్టు 50 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 281 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. స్మృతి, ప్రతీక రావల్, హర్లీన్ ల అర్ధ సెంచరీలతో రాణించారు. ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ప్రతీక, స్మృతి ఫ్లాట్ పిచ్‌పై 114 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యంతో భారత స్కోరుకు పునాది వేశారు. ప్రతికా 96 బంతుల్లో 64 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచింది. అర్ధ సెంచరీ ఆరు బౌండరీలతో స్మృతి 63 బంతుల్లో 58 పరుగులు చేసింది. ఆమె 32వ ఒఐడీ అర్ధ సెంచరీ ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో ఫోబ్ లిచ్‌ఫీల్డ్ చేతిలో రనౌట్ అయింది. అలాగే హర్లీన్ మిడిల్ ఓవర్లలో 57 బంతుల్లో 54 పరుగులు చేసింది. అందులో తన నాలుగో వన్డే అర్ధ సెంచరీలో 4 బౌండరీలు, 2 సిక్సర్లు ఉన్నాయి. కెప్టెన్ హర్మన్ ప్రీత్‌కౌర్ 11, జెమీమా రోడ్రిగ్స్ 18 పరుగులు మాత్రమే చేయగా, చివరి ఓవర్లలో రిచా ఘోష్ 25, రాధా యాదవ్ 19, దీప్తి శర్మ 20 నాటౌట్‌గా ఫర్వాలేదనిపించారు. ఈ క్రమంలో 50 ఓవర్లలో భారత్ జట్టు ఏడు వికెట్లు నష్టానికి 281 పరుగులు చేసింది. ఇది మహిళల వన్డేల్లో ఆస్ట్రేలియాపై భారత్ సాధించిన రెండవ అత్యధిక స్కోరు. ఆస్ట్రేలియా బౌలర్లలో పేసర్ మేఘన్ షట్ రెండు వికెట్లు పడగొట్టగా, అలానా కింగ్ గార్త్, అన్నాబెల్, సదర్‌లాండ్, అలనా కింగ్, తహ్లియా మెక్‌గ్రాత్ ఒక్కో వికెట్ తీసుకున్నారు.







### వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో..

## ఫైనల్స్‌కు కుషారే

న్యూఢిల్లీ: ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, హైజంప్‌లో సర్వేష్ కుషారే ఫైనల్‌కు చేరిన తొలి భారతీయుడుగా రికార్డుకెక్కాడు. టోక్యోలోని నేషనల్ స్టేడియంలో ఆదివారం జరిగిన పోటీల్లో 29 ఏళ్ల జంపర్ అర్హత పోటీలో 2.25 మీటర్లు దూకి, పురుషుల హైజంప్ ఫైనల్‌కు టాప్ 12 అథ్లెట్లలో చారిత్రాత్మక స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఫైనల్‌లో చోటు దక్కించుకోవడానికి తన రెండవ ప్రయత్నంలో 2.25 మీటర్లు క్లియర్ చేశాడు. గత సంవత్సరం పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన కుషారే, 2.16 మీటర్లతో విజయవంతమైన క్లియరెన్స్‌తో ఓపెనింగ్ చేశాడ. ఆ తర్వాత 2.21 మీటర్లతో, ఆపై 2.25 మీటర్లకు పైగా ప్రయాణించి తన చారిత్రాత్మక అర్హతను నిర్ధారించుకున్నాడు. ఇక ఒలింపిక్ ఛాంపియన్ జియాన్మార్కో తంబేరి 2.21 మీటర్లు జంప్ చేయడంలో విఫలమై పోటీ నుండి నిష్క్రమించాడు. అలాగే ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్, న్యూజిలాండ్‌కు చెందిన హామీష్ కెర్ కూడా 2.25 మీటర్లు క్లియర్ చేసి సులభంగా అర్హత సాధించాడు. కాగా పురుషుల హైజంప్ ఫైనల్ ఈ నెల 16వ తేదీన జరగనుంది.

### వరల్డ్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో

## పసిడితో మెరిసిన జాస్మిన్



**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ఒలింపిక్ రజత విజేతను ఓడించి భారత్ బాక్సర్ జాస్మిన్ స్వర్ణంతో మెరిసింది. ఇదే టోర్నీలో భారత్‌కు చెందిన మరో బాక్సర్ నుపుర్ రజతాన్ని దక్కించుకుంది. లివర్‌పూల్‌లో ఆదివారం జరిగిన పోటీల్లో జాస్మిన్ లంబోరియా 57 కిలోల బరువు విభాగంలో తన తొలి బంగారు పతకాన్ని సాధించింది. పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత పోలాండ్‌కు చెందిన పారిస్ స్జెరెమెటాపై అద్భుతమైన విజయం సాధించింది. జాస్మిన్ రౌండ్ 2, 3లో దూసుకుపోయి నంబర్ వన్ సీడ్ స్జెరెమెటాను 4-1 తేడాతో ఓడించి తన తొలి ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాన్ని గెలుచుకుంది. అంతేకాకుండా ఈ ఎడిషన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశానికి ఇది తొలి స్వర్ణం. కాగా జాస్మిన్ ఈ ఏడాది అస్తానాలో జరిగిన ప్రపంచ బాక్సింగ్ కప్‌లో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె బర్మింగ్‌హామ్ 2022 కామన్వెల్త్ గేమ్స్, 2021 ఆసియా ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలను కూడా కైవసం చేసుకుంది. ఇక 80 కిలోల ఫైనల్‌లో పోలాండ్‌కు చెందిన అగాటా కాజ్మార్స్కా చేతిలో ఓడిపోయి భారత్‌కు చెందిన నుపుర్ రజతం సాధించింది. సెమీఫైనల్లో, జైస్మిన్ వెనిజులాకు చెందిన ఒమైలిన్ కరోలినా అల్కాలా సెగోవియాను 5-0 తేడాతో ఓడించింది. అలాగే 80 కిలోల విభాగంలో మరో భారత్ బాక్సర్ పూజా రాణి ఇంగ్లాండ్‌కు చెందిన ఎమిలీ అస్క్విత్‌తో జరిగిన అద్భుతమైన సెమీఫైనల్ తర్వాత పోడియం ఫినిషింగ్‌తో సరిపెట్టింది.

## డేవిస్ కప్ విజేతగా సుమిత్



**న్యూఢిల్లీ:** భారత్ స్విట్జర్లాండ్‌ను ఓడించి తొలి యూరోపియన్ విదేశీ డేవిస్ కప్ విజయాన్ని సాధించింది. ఈ విజయం భారత్ 2026 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్ మొదటి రౌండ్‌కు చేరుకోవడానికి అర్హత కల్పిస్తుంది. భారత్ కాలమానం ప్రకారం ఆదివారం బీల్‌లో జరిగిన డేవిస్ కప్ 2025 ప్రపంచ గ్రూప్ టైలో భారత నెంబర్ వన్ ప్లేయర్ సుమిత్ నాగల్‌తో కూడిన పురుషుల జట్టు స్విట్జర్లాండ్‌ను 3-1 తేడాతో ఓడించి చరిత్ర సృష్టించింది. దీంతో 32 సంవత్సరాల తర్వాత ఒక యూరోపియన్ దేశంపై భారత్ సాధించిన తొలి విదేశీ డేవిస్ కప్ విజయం ఇది. చివరిసారిగా 1993లో ఫ్రాన్స్‌పై విజయం సాధించింది. ఇక నిర్ణయాత్మక రివర్స్ సింగిల్స్ రబ్బర్‌లో సుమిత్ నాగల్ 6-1, 6-3 తేడాతో స్విట్జర్లాండ్‌కు చెందిన హెన్రీ బెర్నెట్‌పై విజయం సాధించి విజయాన్ని నమోదు చేశాడు. డేవిస్ కప్ స్టాండింగ్స్‌లో 37వ స్థానంలో ఉన్న భారతదేశం, తొమ్మిదో సీడ్ స్విట్జర్లాండ్ (24వ ర్యాంక్)ను ఓడించి 2026 వరల్డ్ గ్రూప్ క్వాలిఫయర్స్ మొదటి రౌండ్‌లో స్థానాన్ని సంపాదించుకుంది. రివర్స్ సింగిల్స్‌లో మొదటి మ్యాచ్‌లో 18 ఏళ్ల బెర్నెట్‌ను ఎదుర్కొన్న సుమిత్ ప్రారంభంలోనే బ్రేక్ వేసి ఆధిపత్యం చెలాయించాడు. డేవిస్ కప్‌లో అరంగేట్రం చేసిన దక్షిణేశ్వర్ సురేష్ తొలి సింగిల్స్ రబ్బర్‌లో 76(4), 63తో హోమ్ ఫేవరెట్ జెరోమ్ కిమ్‌ను ఓడించాడు. 626వ ర్యాంక్‌లో ఉన్న సురేష్ అద్భుతమైనప్రదర్శన చేశాడు. వరుససెట్లలో మ్యాచ్‌ను కైవసం చేసుకునే ముందు బహుళ బ్రేక్ పాయింట్లను కాపాడుకున్నాడు. తరువాత సుమిత్ నాగల్ 6-3, 7-6(4)తో రెండుసార్లు ఒలింపియన్ మార్కోఆండ్రియా హ్యూస్లర్‌ను ఓడించాడు. మొదటి సెట్‌లో నాగల్ రెండుసార్లు హ్యూస్లర్‌ను బ్రేక్ చేసి, రెండవ సెట్ టైబ్రేక్‌లో భారత్‌కు 2-0 ఆధిక్యాన్ని ఇచ్చాడు.

### శీతాకాల సమావేశాల్లోనే

## 'ఎఫ్‌డిఐ' బిల్లు!

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 14:** బీమారంగంలో నూరుశాతం ఎఫ్‌డిఐలను అనుమతించే బిల్లును వచ్చే సమావేశాల్లోనే ప్రవేశపెడుతున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బీమారంగంలోకి మరిన్ని సంస్థలను తీసుకురావడంతోపాటు అధిక సంఖ్యలో ఉద్యోగాల సృష్టికి ఇది ఉపకరిస్తుందన్నారు. ఈ ఎఫ్‌డిఐ బిల్లును రానున్న శీతకాలసమావేశాల్లోనే పార్లమెంటులోప్రవేశపెట్టనున్నట్లు ఆమె తెలిపారు. బీమా చట్టం 1938 లోని వివిధ నిబంధనలను సవరించాలని ఆర్థికమంత్రిత్వశాఖ ప్రతిపాదించింది.

బీమారంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ప్రస్తుత 74శాతంనుంచి 100శాతం వరకూ పెంచడంతోపాటు అధీకృత మూలధనం తగ్గించడం, కాంపొజిట్ లైసెన్స్ నిబంధన వంటివి ఈ బిల్లులో ఉన్నాయన్నారు. బీమా నియంత్రణ అభివృద్ధిచట్టం 1999లోనూ సవరణలు ప్రతిపాదించినట్లు



తెలిపారు.పాలసీ దారుల ప్రయోజనాలను ప్రోత్సహించడం వారి ఆర్థికభద్రతను పెంచడం బీమా మార్కెట్‌లోకి మరిన్ని భాగస్వామ్య సంస్థలప్రవేశాన్ని సులభతరంచేయడం ఆర్థికవృద్ధి, ఉపాధికల్పనకు ప్రతిపాదిత సవరణలు ఉపయోగపడతాయని నిర్మలాసీతారామన్ అన్నారు. మోడీ ప్రభుత్వం తెచ్చినసంస్కరణలు భారత్‌లోని ప్రతి పౌరుడు సాధించిన విజయమని అన్నారు.

దీపావళి పండుగకు ముందేజిఎస్టీ సంస్కరణలను ప్రారంభించాలని ప్రధాని నరేంద్రమోడీ సూచించారు. ప్రధాని మోడీసూచనమేరకే ఈ సంసనకరణలనుప్రజలకుముందు తీసుకువచ్చి దేశంలోని సామాన్య కుటుంబాలపైభారం తగ్గించామన్నారు. ప్రజల సాధికారతతోనే భారత్ అభివృద్ధిచెందిన దేశంగా మారుతుందన్నారు.



## న్యూయార్క్‌లో ముకేష్ అంబాని లగ్జరీ విల్లా కొనుగోలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** రిలయన్స్ ఛైర్మన్ ముకేష్ అంబాని అమెరికాలో విలువైన ఆస్తులు కొనుగోలుచేసారు. న్యూయార్క్‌లో ప్రస్తుతం 145కోట్లను వెచ్చించి లగ్జరీ భవనం కొనుగోలుచేసారు.న్యూయార్క్‌లోని ట్రైబెకా ప్రనాంతంలో భవంతిని 17.4 మిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో రూ.145 కోట్లతో కొనుగోలుచేసినట్లు రియల్‌డీల్ తాజా నివేదికతో వెలుగులోకి వచ్చింది. 2023 ఆగస్టులోమన్‌హట్టన్‌లో హడ్సన్ నదికి ఎదురుగా ఉన్న తన 9 మిలియన్ డాలర్ల విల్లాను విక్రయించిన రెండేళ్లకే అంబాని ఈ కొత్త భవంతిని కొనుగోలుచేసారు. ఈ భవనం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అమెరికా విభాగం కొనుగోలుచేసింది. టెక్ బిలియనీర్ రాబర్ట్ పెరా 2018లో 20 మిలియన్ డాలర్లకుకొనుగోలుచేసి లగ్జరీభవనంగా మార్చాలనిచూసారు. తర్వాత 2021లో దాన్ని 25 మిలియన్ డాలర్లకు విక్రయించారు. ఇపుడు అదే భవనం 17.4 మిలియన్ డాలర్లకు అంబాని సొంతంచేసుకున్నారు. అంబాని ప్రస్తుతం 97.9 బిలియన్ డాలర్లతో అంటే రూ.8.2 లక్షలకోట్లతో దేశంలోనే అత్యంత సంపన్నవ్యక్తిగా నిలిచారు. రెండోస్థానంలో ఆదానిగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదాని ఉండగా ఆయన నికర ఆస్తులు 82.1 బిలియన్ డాలర్లని తేలింది.

## మరోసారి తెరపైకి బ్యాంకుల విలీనం!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** దేశంలో ఇప్పటి వరకు చాలా సార్లు బ్యాంకుల విలీనం జరిగింది. రెండు మూడు బ్యాంకులను కలిపి ఒక పెద్ద బ్యాంకుగా ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. ఇప్పుడు మరోసారి ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనం అంశం తెరపైకి వచ్చింది. వికసిత్ భారత్ 2047 విజన్‌లో భాగంగా ప్రపంచంలోని అతిపెద్ద బ్యాంకుల్లో భారత్‌కు చెందిన బ్యాంకులకు చోటు కల్పించాలని లక్ష్యంగా కేంద్రం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల అధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఎస్‌బీ మంథన్ 2025 పేరిట ఈ సమీక్ష చేపట్టారు. ఇందులో కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ప్రపంచంలోని టాప్20 బ్యాంకుల్లో రెండు దేశీయ బ్యాంకులకు చోటు కల్పించేలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మరిన్ని బ్యాంకులను విలీనం చేసే అవకాశాలపై చర్చిచినట్లు సమాచారం. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఆర్థిక సేవల విభాగం గత రెండు రోజుల పాటు పీఎస్‌బీ మంథన్ 2025ని నిర్వహించింది. ఇందులో తొలి రోజున బ్యాంకుల విలీనం, వరల్డ్ టాప్ 20లో రెండు దేశీయ బ్యాంకుల లక్ష్యంపై చర్చించినట్లుగా ప్రభుత్వ వర్గాలు సూత్రప్రాయంగా వెల్లడించాయి. కేంద్రం జాబితాలో పెద్ద బ్యాంకులు ఉన్నట్లు సమాచారం. అయితే బ్యాంకుల విలీనం, ఏ బ్యాంకులు ఉండొచ్చు అనే విషయాలపై క్లారిటీ లేదు. ప్రస్తుతం ఆస్తుల విలువ పరంగా చూసుకుంటే వరల్డ్ టాప్ 100లో భారత్ నుంచి కేవలం రెండు బ్యాంకులే చోటు దక్కించుకున్నాయి. దేశీయ అతిపెద్ద బ్యాంకింగ్ సేవల సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) 43వ స్థానంలో కొనసాగుతోంది. ఇక ప్రైవేట్ రంగంలోని దిగ్గజ బ్యాంక్ అయిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (హెచ్‌డిఎఫ్‌సి) 73వ స్థానంలో ఉంది. పీఎస్‌బీ మంథన్ 2025లో జరిగిన ప్రధాన చర్చలంలో వరల్డ్ టాప్ 20 బ్యాంకుల్లో మన దేశానికి రెంచిన రెండు బ్యాంకులను నిలపడంపై చర్చ జరిగినట్లు సమాచారం. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను విలీనం చేస్తారా అని అడిగిన ప్రశ్నకు అలాంటి చర్చ జరగలేదని అధికారులు తెలిపారు. అయితే, విలీనం ద్వారానే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమావేశానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రెటరీ ఎం నాగరాజు నేతృత్వం వహించారు. ఆర్థిక శాఖ సీనియర్ అధికారులు, ప్రభుత్వ బ్యాంకుల టాప్ ఎగ్జిక్యూటివ్స్ పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ సీఎస్ శెట్టి, పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈఓ అశోక్ చంద్ర హాజరయ్యారు. సమావేశం తొలి రోజున చీఫ్ ఎకానమిక్ అడ్వైజర్ వీ అనంత నాగేశ్వరన్, ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ జే, డీఎఫ్ఎస్ మాజీ సెక్రెటరీ, ఎక్స్ ఐఆర్‌డీఏఐ ఛైర్మన్ దెబాశిస్ పాండా మాట్లాడారు.

## దీపావళికి ఇపిఎఫ్ఓ ధమాకా!



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 14:** ఎటిఎంలద్వారా పిఎఫ్ డబ్బు ఉపసంహరించుకునేకొత్త సౌకర్యం త్వరలో ప్రవేశపెట్టబోతున్నారు. ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను సులభవంగా నిర్వహించుకునేందుకు ఇపిఎఫ్ 3.0 పేరుతో కొత్త విధానాలను ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. నిజానికి సెప్టెంబరులోనే ఈ కొత్తవిధానాలు రావాల్సి ఉంది. కానీ కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా వాటిని నిలిపివేసారు. దీపావళికి ముందు ఏటిఎంలద్వారా పిఎఫ్ సొమ్ము ఉపసంహరించుకునే వెసులుబాటు కష్టమర్లకు కల్పిస్తుందని తెలుస్తోంది. బ్యాంకుల తరహాలోనే సరళమైన లావాదేవీని సృష్టించేప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈచర్య తీసుకోనున్నట్లు వెల్లడించింది.అక్టోబరు 10,11 తేదీల్లో ఇపిఎఫ్ఓ ట్రస్టుకమిటీ సమావేశం కేంద్ర కార్మిక మంత్రి మన్సుక్ మాండవీయ అధ్యక్షతన జరుగుతుంది. దీపావళికి ముందు సుమారు 8 కోట్లమంది పిఎఫ్ చందాదారులోటిఫికేషన్‌కు సంబంధించి ఈసమావేశంలోముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. యుపిఐద్వారా పిఎఫ్ డబ్బును ప్రవేశపెట్టడం వంటి బ్యాంకింగ్‌షేవలపైనే చర్చించనున్నారు. నెలకు అదనంగా కనీసం పెన్షన్‌ను రూ.1000నుంచి 1500 నుంచి 2500కు పెంచే ప్రణాళిక గురించి కూడా చర్చకు రానున్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య వివాహం ఇల్లు కొనుగోలు వంటి కొన్ని నిర్దిష్టకారణాలతో పిఎఫ్ ఖాతాదారులు ఇంటర్నెట్‌ద్వారా రూ.5 లక్షలవరకూ వారి సొమ్ము విత్‌డ్రాచేసుకోవచ్చు. కానీ డబ్బులుచేతుల్లోకి రావడానికి కనీసం రెండుమూడురోజులు పడుతోంది.కొత్తగా పిఎఫ్‌లో ఏటిఎం సేవలు అందుబాటులోకి వస్తే సొమ్ములు తీసుకోవడం మరింత సులువవుతుంది. అయితే బ్యాంకులద్వారా పిఎఫ్ సొమ్ము సులభంగా పొందేలాచేయడంచేస్తే పథకం ఉద్దేశ్యం దెబ్బతింటుందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తంచేసాయి. పిఎఫ్ అనేది ఉద్యోగులు తమ పదవీ విరమణ సమయంలో అత్యవసర పరిస్థితులకు ఉపయోగపడే పథకం అని వాటిని ఎటిఎంలద్వారా తీసుకోడానికి అనుమతించేలా పథకం ఉద్దేశ్యం దెబ్బతింటుందని అంటున్నారు.



## బోయింగ్‌పై రూ.27.36 కోట్ల జరిమానా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** ప్రముఖ విమాన తయారీ సంస్థ బోయింగ్‌కు అమెరికా నియంత్రణ సంస్థ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ మరోసారి ఫైన్ విధించింది. భద్రతకు సంబంధించిన ఉల్లంఘనలను గుర్తించడంతోసుమారు 3.1 మిలియన్ డాలర్లు అంటే రూ.27.36 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉల్లంఘనలు మొత్తం సెప్టెంబరు 2023నుంచి ఫిబ్రవరి 2024లోపు చోటుచేసుకున్నవేనని ఎఫ్ఎఎ తెలిపింది. అలాస్కా ఎయిర్‌లైన్స్ డోర్ ఊడిపోవడంవంటి వాటాతో చాలా సంఘటనలున్నాయి.వాషింగ్టన్‌లోని రెంటాన్ ఫ్యాక్టరీలోనిర్వహించినదర్యాప్తులో క్వాలిటీ సిస్టమ్స్‌లో వందల ఉల్లంఘనలునానయి.కెన్సాస్‌లోని బోయింగ్‌సబ్‌కాంట్రాక్టుసంస్థ స్పిరిట్ ఏరోసిస్టమ్స్‌లోనూ ఇదేపరిస్థితి నెలకన్నది. 2విమానాలు ఎగిరేందుకు యోగ్యత లేనివిగా గుర్తించింది. నాణ్యతలేనివిమానానికి ధృవీకరణ వచ్చేట్లు సంతకంచేయాలని ఒత్తిడిచేసినట్లు గుర్తించారు. పెనాల్టీపై స్పందించేందుకు బోయింగ్‌కు 30 రోజుల గడువు ఉంది. ఈ ఏడాదిజూన్‌లో అమెరికా నేషనల్‌ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీబోర్డు 17 నెలలపాటు నిర్వహించిన దర్యాప్తు నివేదికను విడుదలచేసింది.బోయింగ్ తయారీ భద్రతా పర్యటేక్షణలో చాలా లోపాలున్నా ఎఫ్ఎఎ తనిఖీలు ఆడిట్స్ ఏమాత్రం ప్రభావంచూపలేదని పేర్కొంది. అందువల్లనే అలాస్కా సంఘటన చోటుచేసుకున్నట్లు గుర్తించింది.



## బ్యాంకుల్లో 444 రోజుల డిపాజిట్లపైనే ఎక్కువ ఆసక్తి!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 14:** బ్యాంకులు కొత్తగాప్రవేశపెట్టిన 444 రోజుల డిపాజిట్ అన్నివర్గాలను ఆకర్షిస్తోంది. వడ్డీరూపంలోనే కాకుండా పెట్టుబడిదారులకు ఇది బెస్ట్ ఆప్షన్‌గా కనిపిస్తోంది. అయితే ప్రభుత్వరంగ బ్యాంకులన్నింటికంటే ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకు 6.75% వడ్డీతో ఎక్కువ రాబడి ఇస్తోంది. 10.25 లక్షలుపెట్టుబడి పెడితే ఈ బ్యాంకులు మెచూరిటీ 11,11,952.08 వరకూ లభిస్తుంది. రెండోస్థానంలోఉన్న పంజాబ్‌సింధ్ బ్యాంకు 6.70శాతం, ఎస్‌బిఐ తన అమృత్ సృష్టితో 6.60శాతంతో మూడోస్థానంలోను, కెనరాబ్యాంకు 6.50శాతంతో చివరిస్థానంలోను ఎక్కువ రిటర్నులిచ్చే బ్యాంకుల్లో నిలిచాయి. ఎస్‌బిఐలో అయితే 6.60సాధారణ వడ్డీరేటు. ఈ క్రమంలో రూ.10.25 లక్షలకు 444 రోజుల తర్వాత సుమారు రూ.11,09,958.24 వస్తుంది. వడ్డీరూపంలో రూ.94,958.24 పొందుతారు. పంజాబ్ సింధ్‌బ్యాంకులో అయితే ఇదే మొత్తానికి మెచూరిటీ విలువ సుమారు 11,11,287.15 అవుతుంది. వడ్డీరూపంలో 86,287.15 వస్తుంది. ఇక ఐఒబిలో అయితే 444 రోజుల ఎఫ్డీలో 6.75శాతం వడ్డీతో 10.25 లక్షల సొమ్ముకు 11,11,952.08 వస్తుంది. వడ్డీ 86,952.08గా ఉంది. ఇక కెనరాబ్యాంకు అయితే ఈస్కీంపై 6.50 వడ్డీ ఇస్తోంది. ఈ జాబితాలో తక్కువ వడ్డీరేటు. 10.25 లక్షలసొమ్ముకు సుమారు 11,08,630.59 వస్తుంది. వడ్డీ కేవలం రూ.83,630.59 మాత్రమే వస్తుంది.రిటర్నులు కొంచెం తక్కువగా ఉంటాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps